తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

శనివారం 17.01.2026 | సంపుటి :12 సంచిక : 178 | పేజీలు :12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370



ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698






హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్


## జల్.., జంగల్.. జమీన్ కోసం నినదించిన జిల్లా

# ఆదిలాబాద్ ఖిల్లా



### తుమ్మడిహట్టి వద్ద ప్రాజెక్టు కట్టితీరుతాం

- నిర్మల్ జిల్లాకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ మంజూరు
- ఆదిలాబాద్ విమానాశ్రాయానికి ప్రధానితో శంకుస్థాపన
- పనుల కోసం ప్రధానితో భేటీ అవుతూనే ఉంటా.. తప్పేంటి?

- ఉమ్మడి జిల్లాకు యూనివర్సిటీ మంజూరు
- బాసర ఐఐటిలోనే క్యాంపస్ ఏర్పాటు చేస్తాం
- నిర్మల్ జిల్లాకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్
- ఉమ్మడి జిల్లాకు యూనివర్సిటీ మంజూరు
- బాసర ఐఐటిలోనే క్యాంపస్ ఏర్పాటు చేస్తాం
- కేసీఆర్ అప్పులతో తెలంగాణ కుప్పయ్యింది
- ఫాంహౌజ్ రాజకీయాలతో తెలంగాణకు నష్టం వాటిల్లింది
- బీఆర్ఎస్ నాయకులు రాక్షసుల్లా అభివృద్ధికి అడ్డుపడుతున్నారు
- అభివృద్ధి కోసం ఆశీర్వదించండి..మున్సిపల్ ఎన్నికల్లోనూ ఆదరించండి
- నిర్మల్ బహిరంగ సభలో సీఎం రేవంత్ పిలుపు
- చనాకా-కొరాటా పంప్‌హౌస్, సదర్మట్ బ్యారేజీని ప్రారంభించిన ముఖ్యమంత్రి

"ఆదిలాబాద్ జిల్లాకు వర్సిటీ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నా. యూనివర్సిటీ తప్పకుండా వస్తుంది. బాసర ఐఐటీలోనే యూనివర్సిటీని ప్రారంభిస్తాం. దీని కోసం ఏర్పాట్లు చేయాలని మంత్రి జూపల్లిని కోరుతున్నా. నిర్మల్‌లో ఏటీసీ ఏర్పాటు చేస్తాం. ఎర్రబస్సురాని చోటుకు ఎయిర్‌బస్‌ను తీసుకొస్తాం. ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీని ఆహ్వానిద్దాం" -సీఎం రేవంత్ రెడ్డి

నిర్మల్‌బ్యూరో(జనంసాక్షి):పాలమూరు జిల్లాతో సమానాంగా ఆదిలాబాద్ జిల్లాకు నిధులు మంజూరు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల అనంతరం నిర్మల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. నిర్మల్ ప్రజలు ఇచ్చిన భరోసా, మద్దతు వల్లే సీఎం అయ్యాను. ఆదిలాబాద్ జిల్లా పోరాటానికి, పౌరుషానికి గడ్డ అంటూ.. జల్, జంగల్, జీమిన్ అంటూ కుమురం భీం కొట్లాడారని అన్నారు. ఈ జిల్లాలో జరగాల్సినంత అభివృద్ధి జరగలేదు. బాసర ట్రిపుల్ ఐటీలోనే యూనివర్సిటీ ఏర్పాటు చేస్తాం. జిల్లాలోని ప్రజాప్రతినిధులంతా ఇందుకు సహకరించాలి. పారిశ్రామికంగానూ ఆదిలాబాద్‌ను అభివృద్ధి చేస్తాం. జిల్లాకు మిగతా 2లో..

## త్వరలోనే అన్ని ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ

- గత బీఆర్ఎస్ ప్రభుత్వం సొంత లాభం చూసుకుంది
- కుటుంబం, పార్టీ, రాజకీయ అవసరాలే ప్రాధాన్యంగా పని చేసింది
- నిరుద్యోగ యువత.. రాజకీయ పార్టీల చేతిలో ఆయుధాలుగా మారొద్దు
- గ్రూప్-3 ఉద్యోగాల నియామక పత్రాల పంపిణీలో సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి):గత ప్రభుత్వ పెద్దల ఉద్యోగాలు ఊడగొట్టి.. తమకు ఉద్యోగాలు ఇచ్చే ప్రజా ప్రభుత్వాన్ని యువత తెచ్చుకున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. వివిధ శాఖల్లో గ్రూప్-3 ఉద్యోగాలకు ఎంపికైన 1,370 మందికి శిల్పకళా వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మిగతా 2లో..



## అన్ని వేళలా అండగా ఉంటాం

ఎన్నికలప్పుడే కాదు.. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడూ వస్తాం : మంత్రి పొంగులేటి

ఖమ్మం(జనంసాక్షి): ఎన్నికలప్పుడే కాదు, ప్రజలు ఎప్పుడు కష్టాల్లో ఉన్నప్పుడూ వస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా పాలేరులో పర్యటించిన మంత్రి మీడియాతో మాట్లాడారు. పాలేరు నియోజకవర్గంలో ఈ నెల 18న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటిస్తారని చెప్పారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారని, మద్దులపల్లి వద్ద కొత్త మార్కెట్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. సీపీఐ పార్టీ వందేళ్ల ఉత్సవాల్లో సీఎం పాల్గొంటారని వెల్లడించారు. ఖమ్మం జిల్లా పర్యటన సందర్భంగా పార్టీ కార్యకర్తలతో సీఎం సమావేశమవుతారని, ఈ సమావేశానికి కార్పొరేషన్ పరిధిలోని కార్యకర్తలను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు.

## నోట్ల కట్టల కేసులో జస్టిస్ యశ్వంత్‌వర్మకు చుక్కెదురు

దర్యాప్తు చట్టబద్ధతపై సవాల్‌ను తిరస్కరించిన సుప్రీం 2లో

### ధరణి,భూభారతి కుంభకోణంలో

# 15మంది అరెస్ట్

- రూ.63.19లక్షల నగదు స్వాధీనం
- మరో 9 మంది పరారీలో ఉన్నారు
- వెబ్‌సైట్‌లో లోపాల ఆధారంగా లూటీ
- వరంగల్ కమిషనర్ సన్ ప్రీత్‌సింగ్



వరంగల్(జనంసాక్షి): తెలంగాణలో సంచలనం సృష్టించిన ధరణి, భూభారతి కుంభకోణంలో 15 మందిని అరెస్టు చేసినట్టు వరంగల్ కమిషనర్ సన్ ప్రీత్‌సింగ్ తెలిపారు. మరో 9 మంది పరారీలో ఉన్నట్టు చెప్పారు. ప్రధాన నిందితులుగా బసవరాజు, జెల్లా పాండుగా గుర్తించాం. జనగామ, యాదాద్రి జిల్లాల్లో గతంలో అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయి. యాదగిరి గుట్టలోని ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్ల ద్వారా మోసాలు జరిగాయన్నారు. రూ.3.90 కోట్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడింది. వెబ్‌సైట్‌లో సాంకేతిక లోపాల ఆధారంగా లూటీ చేశారు. నిందితుల నుంచి రూ. 63.19లక్షల నగదు స్వాధీనం చేసుకున్నాం. నిందితుల బ్యాంక్ ఖాతాల్లోని రూ.లక్ష సీజ్ చేశాం. రూ.కోటి విలువైన ఆస్తి పత్రాలు, కారు, ల్యాప్ టాప్‌లు, డెస్క్ టాప్‌లు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నాం. పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. ధరణి- భూ భారతి కేసులో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశముందని సీపీ తెలిపారు. మొత్తం మూడు కోట్ల 72 లక్షల రూపాయల కుంభ కోణం జరిగినట్టు పోలీసులు వెల్లడించారు. జనగామ, యాదాద్రి జిల్లాల్లో సంచలనం సృష్టించిన ధరణి, భూభారతి కుంభకోణం కేసులో కీలక ఆధారాలు సేకరించారు పోలీసులు.

## బెట్టింగ్, జూదంపై కేంద్రం కొరడా

242 వెబ్‌సైట్లపై నిషేధం

న్యూఢిల్లీ(జనంసాక్షి):బెట్టింగ్, జూదంపై కేంద్ర ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. వీటితో సంబంధం ఉన్న 242 వెబ్‌సైట్లను బ్లాక్ చేసింది. బెట్టింగ్, జూదాన్ని ప్రమోట్ చేస్తున్న దాదాపు 8వేల వెబ్‌సైట్లపై ఇప్పటి వరకు కేంద్రం చర్యలు చేపట్టింది. ఇటీవల రియల్‌మనీ గేమింగ్ యాప్‌లను నిషేధించిన కేంద్రం.. వెబ్‌సైట్లపైనా దృష్టి సారించింది.బెట్టింగ్, ఆన్‌లైన్ జూదం కారణంగా యువత పెడదోవ పట్టడం, ఆర్థికంగా మిగతా 2లో..




## తెలంగాణలో తొలిసారిగా హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్

పరేడ్ గ్రౌండ్‌లో ప్రారంభించిన మంత్రి జూపల్లి 2లో..

## ట్రంప్‌కు నోబెల్ అందించిన మచాడో

ఇది తనకు దక్కిన గౌరవంగా ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు



వాషింగ్టన్(జనంసాక్షి):వెనుజువెలా ప్రతిపక్ష నాయకురాలు మారియా కొరినా మచాడో గురువారం వైట్ హౌజ్‌లో అధ్యక్షుడు ట్రంప్‌ని కలిశారు. ఈ సందర్భంగా తన నోబెల్ శాంతి బహుమతి పురస్కారాన్ని ట్రంప్ నకు అందజేశారు. సమావేశం అనంతరం ఈ విషయాన్ని మచాడో స్వయంగా మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా మిగతా 2లో..

## 'మహా' విజయం

- మహారాష్ట్ర 'మున్సి'పోల్స్‌లో మహాయుతి హవా
- 25 కార్పొరేషన్లు కైవసం



ముంబై(జనంసాక్షి):మహారాష్ట్రలో మహాయుతి కూటమికి మరో విజయం- 29లో 25 మున్సిపల్ కార్పొరేషన్లు హస్తగతం- 2,869 వార్డులకుగానూ 1,700కుపైగా వార్డుల్లో పాగా- కాంగ్రెస్‌కు 306 వార్డులు, శివసేన (ఉద్ధవ్)కు 166 వార్డులు మహారాష్ట్ర మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో అధికార మహాయుతి కూటమి విజయఢంకా మోగించింది. మొత్తం 29 మున్సిపల్ కార్పొరేషన్లలో ఎన్నికలు జరగగా 25 చోట్ల బీజేపీ సారథ్యంలోని మహాయుతి మిగతా 2లో..

### మెట్రో రెండోదశకు కేంద్రం

# సుముఖం

- ఎల్ అండ్ టీ నుంచి టేకోవర్ లావాదేవీలు పూర్తి చేయండి
- రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి ఇద్దరేసి సభ్యులతో కమిటీ
- సిఎం రేవంత్‌కు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లేఖ

హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్ మెట్రో రెండోదశ కోసం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ని కలిసి చర్చించానని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వివరించారు.ముందుగా మెట్రో మొదటి దశను ఎల్ అండ్ టీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం టేకోవర్ చేసుకోవాలని, అందుకు అన్ని ఒప్పందాలు, నిర్ణయాలు, లావాదేవీలు పూర్తి చేయాలని సూచించారు. ఈ మేరకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శుక్రవారం లేఖ రాశారు. ఈ లేఖలో హైదరాబాద్ మెట్రో రెండో దశ పనుల పురోగతి గురించి ప్రస్తావించారు. అలాగే హైదరాబాద్ నగరంలో ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి, రవాణా సౌకర్యాలను మెరుగుపరచడంలో భాగంగా నగరంలో మెట్రో రెండో దశ పనులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ అనుమతి కోరిందని గుర్తుచేశారు. ఇప్పటికే అమలు జరుగుతున్న మిగతా 2లో..





### ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారం

# స్పీకర్‌కు 4 వారాల గడువు

## విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు వెల్లడి

న్యూఢిల్లీ(జనంసాక్షి):పార్టీ ఫిరాయించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో ముగ్గురు ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకునేందుకు సుప్రీంకోర్టు నాలుగు వారాలు గడువు ఇచ్చింది. ఈ నాలుగు వారాల్లో ముగ్గురు ఎమ్మెల్యేల విచారణ పూర్తిచేసి నిర్ణయం వెలువరించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు సుప్రీంకోర్టు ధర్మాసనం సూచించింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై స్పీకర్ సత్వరమే నిర్ణయం తీసుకునే విధంగా ఆదేశించాలంటూ దాఖలైన పిటిషన్‌లపై జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం ఇవాళ మరోసారి విచారణ జరిపింది.ఈ విచారణలో సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చి, కోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో స్పీకర్ పూర్తిగా విఫలమయ్యారని పిటిషనర్లు పాడి కౌశిక్ రెడ్డి, వివేకానంద్, కేటీఆర్ తరపు న్యాయవాదులు వివరించారు. విచారించిన ధర్మాసనం స్పీకర్‌కు 4 వారాల సమయమిస్తూ వాయిదా వేసింది.ఇవాళ సుప్రీంకోర్టులో బీఆర్ఎస్ వేసిన పిటిషన్ విచారణకు వస్తున్న నేపథ్యంలో స్పీకర్ నిన్ననే స్పందించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలే యాదయ్య బీఆర్ఎస్‌లోనే ఉన్నట్లు తెలంగాణ స్పీకర్? ప్రసాద్‌కుమార్ నిన్న క్లీన్‌చిట్ ఇచ్చారు. వారు పార్టీ మారారనేందుకు ఆధారాలు లేవన్నారు.బీఆర్ఎస్ ఫిర్యాదు చేసిన పది మందిలో గతంలోనే ఐదుగురు ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్‌చిట్ ఇచ్చేశారు. వీరు కాకుండా ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిపై వచ్చిన ఫిర్యాదులపై స్పీకర్ విచారణ జరపాల్సి ఉంది. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌పై దాఖలైన అనర్హత పిటిషన్‌పై విచారణ పూర్తి అయింది. కానీ తీర్పును ఇంకా వెల్లడించలేదు. స్పీకర్ తీర్పును రిజర్వులో ఉంచారు.గత నెలలో తెలంగాణలో ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ అంశంపై సర్వోన్నత న్యాయస్థానం తెలంగాణ స్పీకర్‌కు మరో 4 వారాల గడువు ఇచ్చింది. మిగతా 2లో..

## ఒక్క వాయిదా పడినా వచ్చేస్తున్నారు

- ఆర్టికల్ 32 దుర్వినియోగమవుతోంది
- హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న వాటిపై సుప్రీంను ఆశ్రయించడంపై ధర్మాసనం ఆగ్రహం

9లో..

## నితిన్ నబీన్ లాంఛనమే!

20న బీజేపీ జాతీయ అధ్యక్షుడి ఎన్నిక



న్యూఢిల్లీ(జనంసాక్షి): నూతన జాతీయ అధ్యక్షుడిని భారతీయ జనతా పార్టీ ఈనెల 20న ప్రకటించనుంది. ఈ మేరకు పార్టీ నూతన అధ్యక్షుడి ఎన్నిక షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ పదవి కోసం ఈ నెల 19న నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపింది. జనవరి 20న కొత్త అధ్యక్షుడి పేరును ప్రకటించనున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు బీజేపీ రిటర్నింగ్ అధికారి కె.లక్ష్మణ్ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు.ఈనెల19న మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల మధ్య అభ్యర్థులు తమ నామినేషన్లు సమర్పించవచ్చని లక్ష్మణ్ తెలిపారు. తర్వాత నామినేషన్ల పరిశీలన చేపడతామన్నారు. అదేరోజు సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్య నామినేషన్ల ఉపసంహరణకు మిగతా 2లో..

## 'స్టార్టప్ ఇండియా' విప్లవంగా మారింది

- రాబోయే పదేళ్లలో స్టార్టప్స్, టెక్‌లో అగ్రగామిగా భారత్
- భారతీయ స్టార్టప్‌ల వైవిధ్యంపై నాకు విశ్వాసముంది
- 'నేషనల్ స్టార్టప్ డే' కార్యక్రమంలో ప్రధాని మోదీ



న్యూఢిల్లీ(జనంసాక్షి):రాబోయే పదేళ్లలో స్టార్టప్స్, టెక్ విభాగాల్లో ప్రపంచ అగ్రగామిగా భారత్‌ను నిలపడమే లక్ష్యమని ప్రధాని మోదీ వెల్లడించారు. ఈ లక్ష్యం దిశగా భారతీయ స్టార్టప్‌లు వైవిధ్యంతో, సాహసోపేతంగా పురోగమిస్తాయనే పూర్తి విశ్వాసం తనకు ఉందన్నారు. ప్రస్తుత తరుణంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీపై భవిష్యత్ వ్యూహాన్ని కలిగిన దేశాలకే ఎక్కువ ప్రయోజనాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. 'నేషనల్ స్టార్టప్ డే' సందర్భంగా శుక్రవారం దిల్లీలోని భారత్ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రసంగించారు.2014లో దేశంలో 4 యూనికార్న్‌లే ఉండగా, ఇప్పుడు వాటి సంఖ్య 125కు చేరిందన్నారు. పదేళ్ల క్రితం 500 స్టార్టప్‌లే ఉండగా, ఇప్పుడు వాటి సంఖ్య 2 లక్షలు దాటిందన్నారు. ఒక్క 2025 సంవత్సరంలోనే 44వేల స్టార్టప్‌లు రిజిస్టర్ అయ్యాయని ఆయన మిగతా 2లో..

## మళ్లీ పాక్ కవ్వింపు చర్యలు

సరిహద్దుల్లో డ్రోన్లతో దాడి చేసే యత్నం

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఓ వైపు భారత్‌తో స్నేహ సంబంధాలు కొనసాగిస్తాం అంటూనే.. పాకిస్థాన్ మరోవైపు కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. గురువారం రాత్రి జమ్మూ కాశ్మీర్‌లోని పూంచ్ సెక్టార్‌లో నియంత్రణ రేఖ వెంబడి రెండు పాక్ డ్రోన్లు సంచరించినట్లు రక్షణ వర్గాలు వెల్లడించాయి. డ్రోన్ల కదలికలు చూసిన వెంటనే భారత సైన్యం స్పందించి యాంటీ-డ్రోన్ ఆపరేషన్ చేపట్టడంతో అవి వెనుదిరిగాయి. ఈ వారంలోనే ఇలా జరగడం మూడోసారి అంటున్నారు. పాకిస్థాన్‌కు భారత్ ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది హెచ్చరికలు జారీ చేసిన కొద్ది గంటల్లోనే ఈ ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. గణతంత్ర దినోత్సవం వేడుకల నేపథ్యంలో సరిహద్దుల్లో భద్రతా దళాలు పహారా కాస్తున్నాయి. డ్రోన్ల కదలికల తర్వాత ఆ ప్రాంతంలో హై అలర్ట్ ప్రకటించి, భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. మంగళవారం రాత్రి, రాజౌరి జిల్లాలోని నియంత్రణ మిగతా 2లో..

### భారత్-ఈయూ వాణిజ్య ఒప్పందం

# గొప్ప మైలురాయి

ఇది అన్ని డీల్స్‌కు తల్లి లాంటిది: పీయూశ్ గోయల్



న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత్-యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య త్వరలో కుదరబోయే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూశ్ గోయల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ ఒప్పందం మైలురాయిగా నిలవబోతోందన్నారు. ఇది అన్ని ఒప్పందాలకు తల్లి లాంటిదిగా అభివర్ణించారు. శుక్రవారం దిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. భారత్-ఈయూ ఒప్పందం భారత ఎగుమతి రంగాలకు సరికొత్త ఊపిరిపోస్తుందని పీయూశ్ గోయల్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఒప్పందం ఇరుపక్షాలకు మేలు చేకూర్చేదిగా, పరస్పర ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. భారతీయ ఎగుమతి రంగాలకు ఇది ఒక 'సూపర్ డీల్' అవుతుందని అన్నారు. 2014 నుంచి ఎన్‌డీఏ ప్రభుత్వం ఆస్ట్రేలియా, యూకే, ఒమన్, న్యూజిలాండ్, యూఏఈ, ఈఎఫ్‌టీఏ కూటమి, మారిషస్‌లతో కలిపి మొత్తం ఏడు వాణిజ్య ఒప్పందాలను ఖరారు చేసిందని అన్నారు. ఇరుపక్షాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం వస్తువులు, సేవల పరంగా సమతుల్యంగా ఉందని ఆయన చెప్పారు. ఇది అభివృద్ధికి భారీ అవకాశాలను కల్పిస్తుందన్నారు. భారత్-ఈయూ దేశాలు వాణిజ్యంలో ఒకరితో ఒకరు పోటీ పడే స్థితిలో లేవని, ఒకరికొకరు తోడ్పడే స్థితిలో ఉన్నాయని గోయల్ పేర్కొన్నారు.ఈ ఒప్పందంపై గురువారం వాణిజ్య కార్యదర్శి రాజేశ్ మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
17.01.2026

# త్వరలోనే అన్ని ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ

నియామక పత్రాలను సీఎం చేతుల మీదుగా అందజేశారు. 2014 నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేయలేదని ఆక్షేపించారు. గత ప్రభుత్వం సొంత లాభం చూసుకుందని, కుటుంబం, పార్టీ, రాజకీయ అవసరాలే ప్రాధాన్యంగా పని చేసిందని మండిపడ్డారు. వారి ఉద్యోగాలు ఊడితేనే నిరుద్యోగులకు కొలువులు వస్తాయని యువత భావించిందన్నారు. దీంతో వారి ఉద్యోగాలు ఊడగొట్టి, ఉద్యోగాలు ఇచ్చే ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారని పేర్కొన్నారు. 14 ఏళ్ల పాటు గ్రూప్-1 పరీక్షలు నిర్వహించలేదని మండిపడ్డారు. ఉద్యోగాల కోసం సన్నద్ధమయ్యే వారు సంవత్సరాలుగా నోటిఫికేషన్ల కోసం ఎదురు చూశారని అన్నారు. గత ప్రభుత్వం పోటీ పరీక్షలు నిర్వహించకపోవడం బాధ్యతారాహిత్యమని అభిప్రాయపడ్డారు. పరీక్షల పేపర్లు లీకవ్వడం, మళ్లీ మళ్లీ పరీక్షలు నిర్వహించడం మరో బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. దీని ద్వారా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విశ్వసనీయతను దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉద్యోగాలు ఇవ్వడం మా బాధ్యత : గ్రూప్-1 ఉద్యోగ నియామకపత్రాలు ఇచ్చే సమయంలో కూడా కొంతమంది కోర్టుకు వెళ్లి కుట్రలు చేశారని, అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 60 వేల ఉద్యోగ నియామకపత్రాలు అందించినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఉద్యోగాలు ఇవ్వడం తమకు బాధ్యత అని మీకు జీవితమని కొత్త ఉద్యోగులను ఉద్దేశించి అన్నారు. ప్రభుత్వ ఉద్యోగం అంటే జీతం తీసుకోవడం కాదు ఒక భావోద్వేగమని అభివర్ణించారు. ప్రస్తుతం అందరికీ విద్య అందుతుంది కానీ నాణ్యమైన విద్య అందడం లేదని సీఎం రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు పాఠశాలల మీద ప్రజలకు ఎందుకు విశ్వాసం పెరిగింది? అని ప్రశ్నించారు. ఉచితంగా విద్య ఇస్తున్నా ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలు ఎందుకు రావట్లేదు? అని ఆలోచించాలన్నారు. నాణ్యమైన విద్యను అందిస్తే, ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను వారి తల్లిదండ్రులే పంపిస్తారని పేర్కొన్నారు.

విద్యతోనే పేదరికం పోతుంది : ఇప్పుడు ఆహార ధాన్యాలకు ఎటువంటి లోటు లేదని, ప్రోటీన్ ఫుడ్ ఇవ్వలేకపోతున్నామని సీఎం అన్నారు. నాణ్యమైన, బలమైన ఆహారం పేదలకు ఇవ్వలేకపోతున్నట్లు తెలిపారు. లక్షల మంది విద్యార్థులు ఇంజినీరింగ్ చేసి బయటకు వస్తున్నారని, అందరికీ ఎందుకు ఉద్యోగాలు రావట్లేదు? అని అన్నారు. జాబ్ మార్కెట్‌లో అవకాశాలు ఉన్నా స్కిల్ లేక అందుకోలేకపోతున్నట్లు తెలిపారు. నైపుణ్యాభివృద్ధి కోసం యువత ప్రయత్నించాలని కోరారు. ఒకప్పుడు పేదరికం పోగొట్టడానికి ప్రభుత్వం భూములు ఇచ్చేదని, ఇప్పుడు ఇవ్వడానికి భూములు లేవని, కేవలం నాణ్యమైన విద్యను మాత్రమే అందించగలమని పేర్కొన్నారు. విద్య ఒక్కటే పేదరికాన్ని పోగొడుతుందని, విద్యతోనే గౌరవం వస్తుందని, మిగతా వాటితో రాదని తెలిపారు. 2047 నాటికి తెలంగాణ రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చాలని విజ్ఞప్తి చేశారు.

రాబోయే రోజుల్లో ఉద్యోగ నోటిఫికేషన్లు వేస్తాం : త్వరలోనే అన్ని ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని, యువత రాజకీయ నాయకుల ఉచ్చులో పడొద్దని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగంలో మూడు దశలు గరం, నరం, భేషరం ఉంటాయంటా చమత్కరించారు. ఉద్యోగం వచ్చినప్పుడు ఉన్న గరం చివరి దశ వరకు ఉండాలన్నారు. తల్లిదండ్రులను సరిగా చూసుకోకపోతే ఉద్యోగుల జీతంలో 15 శాతం కోత విధిస్తామని సీఎం తెలిపారు. అత్తగారి ఇంటికి వెళ్లినా తల్లిదండ్రుల బాధ్య ఆడవాళ్లదే అని చెప్పారు. అత్తగారి ఇంటి నుంచి ఒత్తిడి ఉంటే తనకు చెప్పాలని, మీ జీతం నుంచి 15 శాతం మీ తల్లిదండ్రులకు ఇచ్చేస్తామన్నారు. తల్లిదండ్రులను సరిగ్గా చూసుకోనివారు సమాజంలో మానవ జన్మ ఎత్తడానికి అర్హులు కాదని పేర్కొన్నారు.

## 'మహా' విజయం

గెలుపొందింది. థాక్రే కుటుంబానికి కంచుకోట లాంటి ముంబయి నగరాన్నీ మహాయుతి కైవసం చేసుకుంది. దేశంలోనే సంపన్న ముంబయి మున్సిపల్ కార్పొరేషన్‌లోని 227 వార్డులకుగానూ 84 చోట్ల బీజేపీ, 26 చోట్ల శివసేన (షిండే) గెలిచాయి. శివసేన (ఉద్ధవ్) 74 సీట్లకు పరిమితమైంది. మ్యాజిక్ ఫిగర్ 114కు కేవలం 4 సీట్ల దూరంలో (110 వద్ద) మహాయుతి ఉంది. ఈ గణాంకాలన్నీ శుక్రవారం (జనవరి 16న) రాత్రి 7.30 గంటల సమయానివి. 29 మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోని మొత్తం 2,869 వార్డులకుగానూ 1,700కుపైగా వార్డుల్లో మహాయుతి కూటమే ఆధిక్యంలో కొనసాగుతోంది. అంటే సగానికిపైగా స్థానాల్లో అధికార కూటమి హవాయే ఉందని తేటతెల్లమైంది.

విపక్ష 'ఎంవీఏ' కూటమి చీలికతో మారిపోయిన లెక్క

మహారాష్ట్ర మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు ముందు కీలక పరిణామాలు జరిగాయి. ఉద్ధవ్ థాక్రేకు చెందిన శివసేన(యూబీటీ), రాజ్ థాక్రేకు చెందిన మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన (ఎంఎన్ఎస్) చేతులు కలిపాయి. కానీ ఎంఎన్ఎస్‌తో ఉద్ధవ్ చేతులు కలపడాన్ని కాంగ్రెస్ వ్యతిరేకించింది. దీంతో మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) కూటమి రెండుగా చీలిపోయింది. ఫలితంగా ఈ మున్సిపల్ ఎన్నికల్లో శివసేన(యూబీటీ), కాంగ్రెస్, ఎన్‌సీపీ (ఎస్‌పీ) పార్టీల ఓట్లు చీలిపోయాయి. దీనివల్ల అధికార మహాయుతి కూటమిలోని పార్టీలకు రాజకీయ లబ్ధి చేకూరిందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. ఎంవీఏ కూటమి పార్టీలు ఏకతాటిపై నిలిచి పోటీ చేసి ఉంటే ఫలితం మరోలా వచ్చి ఉండేవన్నారు. పరిమిత ఓటు బ్యాంకు కలిగిన మజ్లిస్ పార్టీ కూడా ఈ ఎన్నికల్లో ఇంచుమించు 94 సీట్లను గెల్చుకుందని వారు గుర్తు చేశారు.

అయినా 'ఉద్ధవ్' అన్ని సీట్లు గెల్వడం పెద్ద విషయమే

"ఈ ఎన్నికలకు ముందు 29 మున్సిపల్ కార్పొరేషన్లను మహాయుతి ప్రభుత్వం చిన్నాభిన్నం చేసింది. ఆ కార్పొరేషన్లను నేరుగా రాష్ట్ర పట్టణ వికాస శాఖే నడిపింది. కేవలం బీజేపీ, శివసేన(షిండే) కార్పొరేటర్లకే నిధులను విడుదల చేశారు. ఉద్ధవ్ శివసేన కార్పొరేటర్లకు నిధులను ఇవ్వలేదు. ఈ క్లిష్ట పరిస్థితుల్లోనూ ఉద్ధవ్ శివసేన 166 సీట్లను గెల్చుకోవడం పెద్ద విషయమే. ఇందుకోసం మేం ఉద్ధవ్ థాక్రేను అభినందిస్తున్నాం. ఎంఎన్ఎస్‌తో పొత్తును వదులుకోమని ఎన్నికలకు ముందే శివసేన(ఉద్ధవ్)కు చెప్పాం. కానీ ఉద్ధవ్ థాక్రే వినిపించుకోలేదు" అని మహారాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సచిన్ సావంత్ పేర్కొన్నారు.

## నితిన్ నబీన్ లాంఛనమే!

అవకాశం ఉంటుందన్నా రు. ఎక్కువ మంది అభ్యర్థులు ఉండి ఎన్నిక జరపాల్సి వస్తే జనవరి 20న పోలింగ్ నిర్వహించి విజేతను ప్రకటిస్తామని వివరించారు. ఈ ప్రక్రి యంతా దిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో జరగనుందని తెలిపారు.

బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఇటీవల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన నితిన్ నబీన్ ఎన్నిక లాంఛనమే అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం బీజేపీ అధ్యక్షుడిగా ఉన్న జేపీ నడ్డా స్థానంలో నబీన్ బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉన్నట్లు సమాచారం. యువ నాయకత్వాన్ని తయారు చేసుకోవడడంలో భాగంగా నబీన్‌కు పార్టీ సారథ్య బాధ్యతలు అప్పగించే అవకాశాలు కన్పిస్తున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా వంటి అగ్రనేతల మద్దతు నితిన్ నబీన్‌కు ఉన్నట్లు తెలుస్తోంది.

ఐదుసార్లు ఎమ్మెల్యేగా

1980 మే 23న రాంచీలో జన్మించిన నబీన్ జన్మించారు. నబీన్‌సిన్హా విద్యాభ్యాసం దిల్లీలో పూర్తయింది. కాయస్థ సామాజికవర్గానికి చెందిన నబీన్ సిన్హాకు ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉంది. ఆయన తండ్రి నబీన్‌కిశోర్ ప్రసాద్ సిన్హా కూడా బిహార్‌లో సీనియర్ బీజేపీ నేతగా గుర్తింపు పొందారు. 2005లో తండ్రి ఆకస్మిక మరణంతో నితిన్ 26 ఏళ్ల వయసులో రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. 2006లో జరిగిన ఉప ఎన్నికలో ఎమ్మెల్యేగా గెలిచారు. ఇక ఆ తర్వాత నుంచి ఓటమి చవిచూడలేదు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఛత్తీస్‌గఢ్ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా పనిచేశారు. అక్కడ బీజేపీని అధికారంలోకి తేవడంలో కీలకంగా వ్యవహరించారు.

జల్.. జంగల్.. జమీన్.. కోసం నినదించిన జిల్లా..

# ఆదిలాబాద్ ఖిల్లా



ఎయిర్ బస్ తీసుకొస్తాం. ఎయిర్‌పోర్టు కోసం 10వేల ఎకరాల భూమిని సేకరించాల్సి ఉందన్నారు. విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీని ఆహ్వానిద్దాం. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు కట్టాల్సిందే.. ఆదిలాబాద్ జిల్లాకు నీరు ఇవ్వాల్సిందే. ప్రతి 3 నెలలకు ఒకసారి ప్రధాని వద్దకు వెళ్తున్నాం. ఆయనకు ఇవ్వాల్సిన గౌరవం ఇచ్చి.. అడగాల్సిన ప్రాజెక్టులు అడుగుతున్నాం. మోదీని పదే పదే కలుస్తున్నానని కొంత మంది విమర్శిస్తున్నారు. రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు ఎవరు ఇస్తారు.. ప్రధాని కాదా? ప్రధానిని కలవకపోతే నిధులు, ప్రాజెక్టులు ఎలా వస్తాయి. పదేళ్ల పాటు కేంద్ర ప్రభుత్వాన్ని గత ప్రభుత్వం అడగలేదు. అడగకపోతే రాష్ట్రానికి ఏం కావాలో కేంద్రానికి ఎలా తెలుస్తుంది. పైరవీలు చేయను.. పర్సనల్ ఎంజెడా లేదు.. రాష్ట్ర అభివృద్ధి కోసం, నిధుల కోసం.. ప్రధాని మోదీ, అమిత్ షా సహా ఎవరినైనా కలుస్తానని అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు.. ఆ తర్వాత అభివృద్ధే అందరి లక్ష్యం. పదేళ్లు అధికారంలో ఉన్న వారు ఈ ఆలోచన చేయకపోవడం వల్లే.. తెలంగాణకు తీరని నష్టం జరిగిందని పరోక్షంగా కెసిఆర్ తీరుపై మండిపడ్డారు.. రాష్ట్ర భాజపా నేతలు కూడా ప్రధాని మోదీని కలిసి రాష్ట్రానికి ప్రాజెక్టులు, నిధులు తేవాలి. నిర్మల్ జిల్లాకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ మంజూరు చేస్తున్నాం. నాగోబా జాతరకు రూ.22కోట్లు మంజూరు చేసి అభివృద్ధి చేస్తాం. సమ్మక్క-సారలమ్మ జాతరకు రూ.300 కోట్లు కేటాయించి పునర్నిర్మాణం చేశాం. ప్రపంచ పెట్టుబడులకు హైదరాబాద్ స్వర్గధామంగా మారిందన్నారు. పెట్టుబడుల కోసం మేం ప్రయత్నిస్తుంటే.. స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నామని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. పదేళ్లు అధికారాన్ని అనుభవించి రూ.8లక్షల కోట్లు అప్పు చేశారు.. రూ. వేల కోట్లు దోపిడీ చేశారని కెసిఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. భూసేకరణ కు నిధులు మంజూరు చేసి ప్రాజెక్టులు పూర్తి చేసుకున్నామని తెలిపారు. ఉమ్మడి జిల్లాకు వర్సిటీ లేదని.. ఈ ప్రాంతానికి వర్సిటీ మంజూరు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. త్వరలో వర్సిటీ మంజూరు అవుతుందన్నారు. బాసర వర్సిటీ ఏర్పాటు చేసుకుంటున్నామని.. దానికి ఏర్పాట్లు చేయాలన్నారు. ఆదిలాబాద్ వర్సిటీ బాసరలో ఏర్పాటు చేస్తున్నామని.. ఉమ్మడి జిల్లా కు కావాల్సిన నిధులను బ్జడెట్ లో ప్రవేశ పెట్టుతామన్నారు.. తుమ్మడి హెట్టీ వద్ద ప్రాణహిత చేవెళ్ల పై నివేదిక తయారు చేస్తున్నామని.. తుమ్మడి హెట్టీ వద్ద ప్రాజెక్టు కట్టి తీరుతామని స్పష్టం చేశారు. ప్రతి నీటి చుక్కని ఒడి పట్టుతామన్నారు.. ఆదిలాబాద్‌కు ఎయిర్ పోర్ట్ తీసుకొచ్చే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. మోడీ చేతుల మీదుగా ఆదిలాబాద్ ఎయిర్ పోర్టు శిలాఫలకం వేయిస్తామని స్పష్టం చేశారు. ఎన్నికలు వచ్చాక రాజకీయం.. ఎన్నికల తర్వాత అభివృద్ధికి కలిసి నడుద్దామన్నారు. ప్రతి మూడు నెలలకు సారి కేంద్రాన్ని కలుస్తాం.. మీరు సైతం నా దగ్గరకు రండి.. సాధ్యం అయినంత పనులు చేస్తామని ప్రతిపక్ష నేతలకు సీఎం తెలిపారు. మోడీ నాకు చుట్టం కాదు దేశానికి ప్రధాని కాబట్టి మన ప్రాంతం అభివృద్ధి కావాలి కాబట్టి మోడీని కలుస్తున్నానని చెప్పారు. ప్రాంత అభివృద్ధి కోసం ఎవ్వర్నినా కలుస్తా. పైరవీలు లేవు, పర్సనల్ పనులు నాకు లేవని సీఎం స్పష్టం చేశారు. కేంద్రం వరంగల్ ఎయిర్ పోర్టు వచ్చింది. ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ ఇస్తాం అని చెప్పినట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 'ఇవ్వన్నీ అడిగనిదే ఇవ్వరు. గత పాలకులు అడగకపోవడంతో ఈ పరిస్థితి వచ్చింది. వాళ్ల తప్పులకు ఇప్పుడు అప్పులు మిగిలాయి. ఆ ప్రభుత్వంలో ఇచ్చిన బియ్యం ఎవ్వరైనా తిన్నారా..? కాని మేము ఇచ్చే సన్న బియ్యం తింటున్నారు. నాడు పావలా వడ్డీ లేదు సున్నా వడ్డీ లేదు.. గుండు సున్నా మిగిల్చారు. వెయ్యికోట్ల భూమి మహిళలకు కేటాయించాం..రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక స్థితి వల్ల క్రమక్రమంగా అభివృద్ధి చేసుకుందాం.. రాష్ట్ర ప్రజలు అండగా నిలవండి, దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతా.. త్వరలో మున్సిపల్ ఎన్నికలు రాబోతున్నాయి ప్రజా ప్రభుత్వంతో కలిసి పని చేసే వారిని గెలిపించండి.. కేవలం ఎన్నికల అప్పుడే రాజకీయాలు, అభివృద్ధికి అందరం ఒకటే..' అని స్పష్టం చేశారు.

పదేళ్ల పాలనలో అప్పులు తప్ప అభివృద్ధి లేదు

ఆదిలాబాద్ జిల్లా అంటే తనకు ప్రత్యేకమైన అభిమానం ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అత్యంత వెనుకబడిన ఈ జిల్లాకు ఆశించిన న్యాయం జరగలేదని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో శుక్రవారం పర్యటించిన సిఎం రూ.386.46 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. హాతిఘాట్‌లో చనాకా - కొరాట బ్యారేజ్ పంప్‌హౌస్ ప్రారంభించారు. సదర్మట్ బ్యారేజ్‌ను జాతికి అంకితం చేశారు. యాసంగి పంటకు నీరు విడుదల చేశారు. పొన్కల్ దగ్గర గోదావరి నదిపై సదర్మట్ బ్యారేజ్ నిర్మాణాన్ని ప్రారంభించారు. రూ.676 కోట్లతో ప్రభుత్వం సదర్మట్ బ్యారేజ్ నిర్మాణం చేపట్టిందని సీఎం ప్రసంగించారు. ఈ బ్యారేజ్ ద్వారా 18 వేల ఎకరాలకు సాగునీరును ప్రభుత్వం అందించనుందన్నారు. కేసీఆర్ హయాంలో చిత్తశుద్ధిగా పనిచేసి ఉంటే చనాక - కొరాట ప్రాజెక్టు ఎప్పుడో పూర్తయ్యేదని తెలిపారు. చనాక - కొరాట, సదర్మట్ బ్యారేజీలు గత పదేళ్లలో పూర్తికాలేదని ఈ సందర్భంగా సీఎం చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అవసరమైన నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేశామని వెల్లడించారు. కాళేశ్వరానికి రూ.లక్షా 10 వేల కోట్లు ఖర్చుచేసినా.. చుక్కనీరు రాలేదని విమర్శించారు. రైతులకు నీరు రావాలంటే తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాజెక్టు కట్టాల్సిందేనని స్పష్టం చేశారు.

చనాకా-కొరాటా పంప్‌హౌస్‌ను ప్రారంభించిన సిఎం

ఆదిలాబాద్ జిల్లాలో సిఎం రేవంత్ రెడ్డి శుక్రవారం పర్యటించిన సందర్భంగా భోరాజ్ మండలం హతిఘాట్‌లో చనాకా-కొరాటా పంప్‌హౌస్‌ను ప్రారంభించి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా రూ.386.46 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పలువురు ఎమ్మెల్యేలు ఉన్నారు. అనంతరం నిర్మల్ జిల్లాలో సిఎం పర్యటించారు. పొంకల్ గ్రామంలో సదర్మట్ బ్యారేజీని ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ చేపట్టిన నల్లమల సాగర్ కు తాము వ్యతిరేకమని ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిస్పష్టం చేశారు. సుప్రీంకోర్టులో దీనిపై పోరాటం చేస్తున్నామని తెలిపారు. గోదావరి జలాల్లో చుక్క నీరు కూడా వదులుకునేది లేదని అన్నారు. నిర్మల్ లో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడిన మంత్రి.. తుమ్మిడిహట్టి నుంచి గ్రావిటీ ద్వారా సుందిళ్ల ప్రాజెక్టుకు తరలిస్తామని చెప్పారు. సుందిళ్ల నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీటిని తరలిస్తామని తెలిపారు.

## ట్రంప్‌కు నోబెల్ అందించిన మచాడో

మచాడో మాట్లాడుతూ.. 'చరిత్రలో రెండు వందల ఏళ్ల తర్వాత, బొలివర్ వారసులు వాషింగ్టన్ వారసుడికి ఒక పతకాన్ని తిరిగి ఇస్తున్నా.. ఇది మన స్వేచ్ఛ పట్ల ఆయన ప్రత్యేక నిబద్ధతకు గుర్తింపుగా నా నోబెల్ శాంతి బహుమతిని ట్రంప్ నకు అందజేస్తున్నా' అని వ్యాఖ్యానించారు. వెనుజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్యను ఇటీవల అమెరికా సైనిక దళాలు అదుపులోకి తీసుకున్న కొన్ని రోజులకే ఈ పరిణామాలు చోటు చేసుకోవడం ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. మచాడోతో భేటీ అనంతరం ట్రంప్ స్పందిస్తూ.. 'మారియా కొరినా మచాడోను కలవడం నాకు ఎంతో సంతోషంగా ఉంది. ఆమె ఎన్నో కష్టనష్టాలను ఎదిరించి నిలిచిన గొప్ప మహిళ, ఇన్నాళ్ళు ప్రపంచ శాంతి కోసం నేను చేసిన కృషిని గుర్తించి ఆమె తన నోబెల్ పురస్కారాన్ని నాకు బహుమతిగా ఇచ్చారు.. థ్యాంక్యూ మరియా.. అంటూ తన ట్రూత్ సోషల్ వేదికగా తెలిపారు. గత ఏడాది అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ తనకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని.. దానికి తాను పూర్తి అర్హుడని నానా హంగామా చేశారు. కానీ, నోబెల్ బహుమతి మాత్రం ట్రంప్‌నకు దక్కలేదు. 2025 లో నోబెల్ బహుమతి వెనుజువెలా ప్రతిపక్ష నేత కొరినా మచాడోకి దక్కింది.

## నోట్ల కట్టల కేసులో జస్టిస్ యశ్వంత్‌వర్మకు చుక్కెదురు

**దర్యాప్తు చట్టబద్ధతపై సవాల్‌ను తిరస్కరించిన సుప్రీం**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** నోట్ల కట్టల కేసులో న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్‌వర్మకు మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. తనను తొలగించాలని కోరుతూ వచ్చిన తీర్మానాన్ని లోక్‌సభ స్పీకర్ ఆమోదించడంతోపాటు తనపై దర్యాప్తు కోసం ఏర్పాటుచేసిన పార్లమెంటరీ ప్యానల్ చట్టబద్ధతను సవాల్ చేస్తూ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ కేసుకు సంబంధించిన తీర్పును జనవరి 8న రిజర్వ్ చేసిన జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఎస్‌సీ శర్మలతో కూడిన ధర్మాసనం నేడు వెలువరిం చింది. గతేడాది జస్టిస్ యశ్వంత్‌వర్మ దిల్లీ హైకోర్టులో సేవలం దిస్తున్నప్పుడు తన అధికారిక నివాసంలో పెద్దఎత్తున నోట్లకట్టలు లభ్యమయ్యాయి. దానిపై అంతర్గత త్రిసభ్య సంఘం విచారణ జరిపింది. అది ఇచ్చిన నివేదిక నేపథ్యంలో పదవి నుంచి వైదొలగాల్సిందిగా సుప్రీంకోర్టు సూచించింది. ఆయన దానికి అంగీకరించకపోవడంతో పార్లమెంటులో అభిశంసనకు ప్రయత్నాలు జరిగాయి. ఈ క్రమంలో స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ సుప్రీంకు వెళ్లిన జస్టిస్ వర్మకు అక్కడ మళ్లీ చుక్కెదురైంది.

## బెట్టింగ్, జూదంపై కేంద్రం కొరడా

చితికిపోతున్నట్లు గ్రహించిన కేంద్ర ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. గతేడాది అక్టోబర్‌లో ఆన్‌లైన్ గేమింగ్ యాక్ట్, 2025ను తీసుకొచ్చింది. ఈ క్రమంలోనే నగదుతో ముడిపడిన ఆన్‌లైన్ గేమింగ్‌ను నిషేధించింది. దీంతో వింజో, నజారా టెక్నాలజీస్ వంటి ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్స్ రియల్ మనీ గేమ్స్‌కు స్వస్తి చెప్పాయి.

## మెట్రో రెండోదశకు కేంద్రం సుముఖం

మొదటి దశ మెట్రోను ఎల్ అండ్ టీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, తామే నిర్వహిస్తామని ప్రకటించిందని ప్రస్తావించారు. లావాదేవీలు పూర్తయిన తర్వాత రెండో దశ నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే హైదరాబాద్ మెట్రో రెండో దశ నిర్మాణానికి అంగీకరించిందని కూడా కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ గుర్తు చేశారని అన్నారు. మెట్రో మొదటి దశను రాష్ట్ర ప్రభుత్వం ఎల్ అండ్ టీ నుంచి తీసుకోవడం, రెండో దశకు సన్నాహాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సంయుక్తంగా కమిటీ ఏర్పాటు చేయడంపై సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నిర్ణయించారని కూడా కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ తనకు తెలిపారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇద్దరు, కేంద్ర ప్రభుత్వం తరపున మరో ఇద్దరు అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇద్దరు అధికారుల పేర్లను పంపాలని కోరినట్లు కూడా వివరించారు. కానీ, ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారుల పేర్లను ఎందుకు ప్రతిపాదించలేదని ప్రశ్నించారు. కావున సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే ఇద్దరు అధికారుల పేర్లను పంపి సమావేశ నిర్వహణకు ప్రయత్నం చేయాలని సూచించారు. అదేవిధంగా, వేగవంతంగా ఎల్ అండ్ టీ నుంచి మెట్రో నెట్‌వర్క్‌ను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, ఆ తర్వాత మెట్రో రెండో దశ నిర్మాణానికి కావాల్సిన ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి పంపాలని విజ్ఞప్తి చేశారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని కిషన్‌రెడ్డి కోరారు.

## తెలంగాణలో తొలిసారిగా హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్

**పరేడ్ గ్రౌండ్‌లో ప్రారంభించిన మంత్రి జూపల్లి**

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో తొలిసారిగా హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్ వేదికగా శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ఈ షో జరుగనుంది. తెలంగాణ పర్యాటక, సంస్కృతి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ హాట్ ఎయిర్ బెలూన్ షోను ప్రారంభించారు. ముందస్తుగా టికెట్లు బుక్ చేసుకున్న 300 మంది సందర్శకులకు హాట్ ఎయిర్ బెలూన్లలో రైడ్‌కు అనుమతి ఇవ్వనున్నారు. అలాగే సాధారణ ప్రేక్షకులకు నైట్ గ్లో షో ఓపెన్‌గా ఉండనుంది. హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ టికెట్‌ను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసుకునే అవకాశం ఉంది. వయస్సు, రైడ్ రకాన్ని బట్టి ధరలు రూ.500 నుంచి రూ.1500 వరకు ఉండనున్నాయి. పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతి సందర్భంగా జనవరి 13 నుంచి 15 వరకు ఇంటర్నేషనల్ కైట్ / స్వీట్స్ ఫెస్టివల్‌ను నిర్వహించిన విషయం తెలిసిందే. పెద్ద సంఖ్యలో సందర్శకులు కైట్ ఫెస్టివల్‌లో పాలుపంచుకున్నారు. అలాగే జనవరి 16, 17 తేదీల్లో గచ్చిబౌలి స్టేడియంలో డ్రోన్ ఫెస్టివల్, సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జనవరి 16 నుంచి 18 వరకు హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇది హైదరాబాద్‌లో తొలి హాట్ ఎయిర్ బెలూన్ ఈవెంట్‌గా రికార్డు సృష్టిస్తోంది. పరేడ్ గ్రౌండ్‌లో సాయంత్రం 4 గంటల నుంచి రంగురంగుల బెలూన్లు ఆకాశంలో కనువిందు చేయనున్నాయి.

# స్పీకర్‌కు నాలుగు వారాల గడువు

ఈ లోపు నిర్ణయం తీసుకోవాలని సూచించింది. కేసు విచారణను కూడా 4 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించి వాదనలను వినేందుకు స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు. ఫిరాయించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో ముగ్గురు ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకునేందుకు సుప్రీంకోర్టు 4 వారాలు గడువు విధించింది. తమ పార్టీకి చెందిన 10 మంది శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి(గద్వాల), ఎం.సంజయ్(జగిత్యాల), గూడెం మహిపాల్‌రెడ్డి (పటాన్‌చెరు), పోచారం శ్రీనివాస్‌రెడ్డి(బాన్సువాడ), కాలె యాదయ్య(చేవెళ్ల), తెల్లం వెంకట్రావు(భద్రాచలం) అరెకపూడి గాంధీ(శేరిలింగంపల్లి), ప్రకాశ్‌గౌడ్(రాజేంద్రనగర్), కడియం శ్రీహరి(స్టేషన్‌ఘన్‌పూర్), దానం నాగేందర్(ఖైరతాబాద్)లు కాంగ్రెస్ పార్టీలో చేరారని, ఫిరాయింపు నిరోధక చట్టం కింద వారిని అనర్హులుగా ప్రకటించాలని స్పీకర్‌కు భారాస ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, కేపీ వివేకానంద, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, చింత ప్రభాకర్, పాడి కౌశిక్ రెడ్డి ఫిర్యాదు చేశారు. అయితే ఈ ఫిర్యాదులపై స్పీకర్ నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేస్తున్నారని అయితే ఈ ఫిర్యాదులపై స్పీకర్ నిర్ణయం తీసుకోవడంలో జాప్యం చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. దీంతో సుప్రీంకోర్టు విచారించగా పార్టీ ఫిరాయింపు ఫిర్యాదులపై నిర్ణయం తీసుకోవడానికి స్పీకర్‌కు ఒకసారి 3 నెలలు, మరోసారి 4 వారాల గడువు ఇచ్చింది. డిసెంబర్ 19వ తేదీతో రెండోవిడత గడువు ముగిసింది. ఈ మేరకు న్యాయనిపుణులు, అడ్వొకేట్ జనరల్‌తో చర్చించిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆ 10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీచేశారు. ఎనిమిది మంది ఎమ్మెల్యేలు తమ వివరణలను సభాపతికి సమర్పించారు. దీంతో వారు అఫిడవిట్ దాఖలు చేశారు. మరోవైపు ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించారంటూ ఆధారాలను స్పీకర్?కు సమర్పించారు. రెండు దశల్లో ఎనిమిది మంది ఎమ్మెల్యేలపై వచ్చిన ఫిరాయింపు ఫిర్యాదులను విచారించిన సభాపతి తీర్పు వెల్లడించారు

## 'స్టార్టప్ ఇండియా' విప్లవంగా మారింది

తెలిపారు. ప్రస్తుతం ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థ భారత్‌లోనే ఉందన్నారు. 'నేషనల్ స్టార్టప్ డే' వేడుకకు హాజరైన స్టార్టప్‌ల వ్యవస్థాపకులను చూస్తుంటే, తనకు నవ్య భారత్, వికసిత భారత్ కనిపిస్తోందని మోదీ వ్యాఖ్యానించారు.

కంఫర్ట్ జోన్‌లో జీవించే ఆలోచన యువతకు లేదు!

"స్టార్టప్ ఇండియా మిషన్ వేగాన్ని పుంజుకుంటోంది. అదొక విప్లవంగా మారింది. ఇక కంఫర్ట్ జోన్‌లో జీవించే ఉద్దేశం భారతీయ యువతకు లేనే లేదు. నూతన లక్ష్యాలతో సరికొత్త ఎత్తులకు ఎదగాలని వారు కోరుకుంటున్నారు. అసలైన సమస్యల పరిష్కారంపై భారతీయ యువత, ఎంట్రప్రెన్యూర్‌లు ఫోకస్ పెట్టారు. టైర్-2, టైర్-3 నగరాలతో పాటు గ్రామీణ ప్రాంతాల యువత కూడా సొంతంగా వ్యాపారాలను ప్రారంభి స్తున్నారు. స్టార్టప్ ఇండియా కార్యక్రమం వల్ల భారత్‌లో ఏర్పడిన ఎన్నో యూనికార్న్‌లు స్టాక్ మార్కెట్‌లో ఐపీఓలకు వస్తున్నాయి. ఎంతోమందికి ఉద్యోగాలను ఇస్తున్నాయి. 45 శాతం భారతీయ స్టార్టప్‌లలో సగటున ఒక మహిళా డైరెక్టర్ లేదా పార్ట్‌నర్ ఉన్నారు. మహిళల సారథ్యంలో ఏర్పాటయ్యే స్టార్టప్‌లకు ఫండింగ్‌ను అందించే విషయంలో ప్రపంచంలో రెండో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా భారత్ ఎదిగింది. స్టార్టప్ ఇండియా కార్యక్రమాన్ని ప్రారంభించక ముందు నేను దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఓ కార్యక్రమానికి హాజరయ్యాను. అందులో ఓ మహిళా స్టార్టప్ ఆవేదనను విన్నాను. ఉద్యోగాన్ని వదిలేసి స్టార్టప్‌ను పెడతాను అన్నందుకు తన తల్లి తీవ్ర భయాందోళనకు గురైందని ఆ మహిళ గోడును వెళ్లబోసుకుంది. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది" అని ప్రధాని మోదీ తెలిపారు. "గతంలో సొంత వ్యాపారం ప్రారంభించడాన్ని రిస్క్‌గా భావించేవారు. రిస్క్ పేరు చెప్పి యువతను నిరుత్సాహపరిచేవారు. కానీ ఇప్పుడు రిస్క్ తీసుకొని వ్యాపారాలను మొదలుపెట్టడమే భారతీయ యువతకు ప్రధాన పనిగా మారిపోయింది. భారతీయ స్టార్టప్‌ల వ్యవస్థాపకుల అత్యద్భుత విశ్వాసం, గొప్ప ఆశయాలను చూసి నేను మంత్రముగ్ధుడిని అయ్యాను. ఒకప్పుడు సొంత వ్యాపారం పెట్టడం అనేది కెరీర్‌లో చిట్టచివరి ఆప్షన్‌గా ఉండేది. కానీ ఇప్పుడది ఒక ఫ్యాషన్‌గా మారిపోయింది. నెలవారీ శాలరీని మించి ఆలోచించే వాళ్లను ఇప్పుడు అందరూ స్వాగతిస్తున్నారు, గౌరవిస్తున్నారు" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

**కొత్త వ్యాపార అవకాశాలతో అన్ని రంగాలకు కనెక్టివిటీ**

"స్టార్టప్ ఇండియా అనేది ఒక స్కీం మాత్రమే కాదు. దానికి ఇంద్ర ధనుస్సు లాంటి పెద్ద విజన్ ఉంది. కొత్త వ్యాపార అవకాశాలతో దేశంలోని అన్ని రంగాలను కనెక్ట్ చేయడమే దీని లక్ష్యం. భారతీయ స్టార్టప్‌లు తయారీ రంగం, పరిశోధనలపైనా ఫోకస్ పెట్టాల్సిన సమయం వచ్చేసింది. ఈ రోజు చేసే పరిశోధనే రేపటి ఇంటలెక్చువల్ ప్రాపర్టీగా మారుతుంది. స్టార్టప్‌లకు సీడ్ ఫండ్‌ను అందించడానికి మేం చాలా స్కీంలను అమల్లోకి తెచ్చాం. కాలం చెల్లిన రూల్స్ అన్నీ తొలగించాం. స్టార్టప్‌ల వ్యవస్థాపకుల ఐడియాలను మేం బలంగా నమ్మాం. ఈ ఏడాదితో స్టార్టప్ ఇండియా కార్యక్రమం పదేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. దీనివల్ల మేం వేలాది మందికి కలలు కనే ధైర్యాన్ని ఇచ్చాం. ఎంతోమంది వారి వ్యాపార కలలను సాకారం చేసుకున్నారు. ఈ శుభ సందర్భంగా ప్రతీ ఒక్క స్టార్టప్ వ్యవస్థాపకుడికి నా అభినందనలు" అని ప్రధాని మోదీ తెలిపారు.

## భారత్-ఈయూ వాణిజ్య ఒప్పందం గొప్ప మైలురాయి

అగర్వాల్ కూడా స్పందించారు. భారత్, యూరోపియన్ యూనియన్ ప్రతిపాదిత ఒప్పందంపై చర్చలు తుది దశలో ఉన్నాయని ఆయన చెప్పారు. మిగిలి ఉన్న సమస్యలను పరిష్కరించడానికి చర్చలు జరుగుతున్నాయన్నారు. ఈ నెలాఖరులో ఈయూ ప్రతినిధుల పర్యటన సందర్భంగా ఒప్పందాన్ని ప్రకటించడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. రిపబ్లిక్ డే వేడుకలకు ముఖ్య అతిథులుగా 77వ గణతంత్ర వేడుకలకు ఈయూ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఆంటోనియో లూయిస్ శాంటోస్ డా కోస్టా, ఈయూ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్ లేయన్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. రెండు రోజుల పాటు భారత్?లో పర్యటించనున్నారు. జనవరి 27న ఈ ఒప్పందానికి సంబంధించిన ముగింపు చర్చల ప్రకటన వెలువడే అవకాశం ఉందని తెలుస్తోంది. ఒప్పందం ఖరారు కానున్న వేళ కేంద్రమంత్రి చేసిన వ్యాఖ్యలకు ప్రాధాన్యత సంతరించుకొన్నది. ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్, ఇటలీ, ఆస్ట్రియా, బెల్జియం, బల్గేరియా, ఫిన్లాండ్, హంగేరి, ఐర్లాండ్, నెదర్లాండ్స్, పోర్చుగల్, పోలాండ్, డెన్మార్క్, స్వీడన్ వంటి 27 అభివృద్ధి చెందిన దేశాలు ఈయూలో భాగస్వాములుగా ఉన్నందున భారత్ కు ఇది అతిపెద్ద ఒప్పందం కానుంది. అమెరికా విధిస్తున్న అధిక సుంకాలు ప్రపంచ వాణిజ్యాన్ని అస్తవ్యస్తం చేసిన నేపథ్యంలో ఈ ఒప్పందం భారత్‌కు ఎంతో కీలకం కానుంది. ప్రస్తుతం భారత్ 50 శాతం మేర భారీ సుంకాలను ఎదుర్కొంటోంది. ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం భారతీయ ఎగుమతిదారుల సరుకు రవాణాను ఇతర మార్కెట్లకు విస్తరించుకోవడానికి సహాయపడనుంది. అలాగే, ఇది చైనాపై ఆధారపడటాన్ని తగ్గించడానికి కూడా దోహదపడుతుంది. భారత్ చేసే మొత్తం ఎగుమతుల్లో యూరోపియన్ యూనియన్ మార్కెట్ వాటా సుమారు 17 శాతంగా ఉంది. అలాగే, ఈయూ దేశాలు చేసే మొత్తం విదేశీ ఎగుమతుల్లో భారత్‌కు చేసే ఎగుమతులు 9 శాతంగా ఉన్నాయి. ఇదిలా ఉండగా, భారత్-ఈయూ ఒప్పందం కేవలం వస్తువులకే పరిమితం కాదు. సేవల రంగం, ఐటీ, హెల్త్‌కేర్, ప్రొఫెషనల్స్ తరలింపు వంటి అంశాలు కూడా అందులో ఉన్నట్లు తెలుస్తోంది. ఇంకో కీలకమైన విషయం ఏంటంటే, యూరప్ మార్కెట్లు నాణ్యత విషయంలో చాలా కఠినంగా ఉంటాయి. ఈయూతో ఒప్పందం కుదిరిందంటే, భారతీయ ఉత్పత్తుల నాణ్యతకు గ్లోబల్ సర్టిఫికేషన్ లభించినట్లు అవుతుంది. ఈ ఒప్పందం ద్వారా జర్మనీ, ఫ్రాన్స్ వంటి దేశాల నుంచి అత్యాధునిక సాంకేతికత. భారీ పెట్టుబడులు భారత్‌కు వచ్చే మార్గం సుగమం అవుతుంది.

## మళ్లీ పాక్ కవ్వింపు చర్యలు

రేఖ దాటి భారత భూభాగంలోకి వచ్చిన అనుమానిత పాక్ డ్రోన్లను అడ్డగించడానికి ఆర్మీ సిబ్బంది కాల్పులు జరిపారు.

# ఉప్పల నివాసంలో సంక్రాంతి సంబరాలు



హైదరాబాద్ (జనంసాక్షి) : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త నివాసంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, పాల్గొని పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ ఈ సంక్రాంతి పండుగ మీ జీవితాల్లో సరికొత్త కాంతిని ఇవ్వాలని అన్ని వర్గాల ప్రజలు పాడిపంటలతో సుఖసంతోషాలతో జీవించాలని కోరుకుంటూ ప్రజలందరికి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి పండుగ అందరికీ ఆరోగ్యం, ఆనందం, శ్రేయస్సు తీసుకురావాలని ఆకాంక్షించారు. గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ ఐక్యతతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ ప్రథమ మహిళ ఉప్పల స్వప్న, పెద్ద కుమారుడు ఉప్పల సాయి కిరణ్ ,కోడలు శార్వారీ చిన్న కుమారుడు ఉప్పల సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటన సందర్భంగా జోగు రామన్న అరెస్టు



**ఆదిలాబాద్, జనవరి16 (జనంసాక్షి) :** ఆదిలాబాద్ జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్నను హౌస్ అరెస్టు చేశారు. జోగు రామన్నతో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలను హౌస్ అరెస్టు చేశారు. ఇలా బీఆర్ఎస్ నేతల అరెస్టుతో జిల్లాలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ.. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని చనాకా కొరాటా ప్రాజెక్టు ట్రయల్ రన్‌కు రావడం సిగ్గుమాలిన చర్య అని విమర్శించారు. ఆదిలాబాద్ జిల్లా రైతాంగానికి 50 వేల ఎకరాలకు నీరు అందించాలన్న సంకల్పంతో బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ పూర్తిస్థాయిలో ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టి రైతులకు సంకల్పంతో కృషి చేశారని తెలిపారు. కానీ బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఒక్క ఎకరాకు కూడా అందించకుండా ట్రయల్ రన్ చేయడం, దాన్ని ప్రారంభించడం సిగ్గుమాలిన చర్య అని విమర్శించారు. సీఎం పర్యటన నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి నుంచే పోలీసులు ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామికం అని జోగురామన్న మండిపడ్డారు. భేలా, జైనత్, ఆదిలాబాద్ మండల నాయకులను ఎక్కడికక్కడ అరెస్టులు చేయడం సమంజసం కాదని సూచించారు. ఒక్క ఎకరానికి కూడా నీరు అందించలేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనను రైతులు వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. రైతు సమస్యలు పరిష్కరించడంపై ధ్యాసలేని ఈ ముఖ్యమంత్రి కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ట్రయల్ రన్ అంటూ మోసం చేస్తున్నారని మండిపడ్డారు.

# గాదె ఇన్నయ్యకు మాతృవియోగం



**జనగామ, జనవరి16 (జనంసాక్షి) :** సామాజిక ఉద్యమకారుడు, మావోయిస్టు పార్టీ మాజీ నేత గాదె ఇన్నయ్య ఇంట్లో విషాదం నెలకొంది. ఇన్నయ్య తల్లి థెరిసమ్మ కన్నుమూశారు. అనారోగ్య సమస్యలు, వయోభారంతో ఇబ్బంది పడుతున్న ఆమె గురువారం రాత్రి జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం సాగరంలోని సొంతింట్లో తుదిశ్వాస విడిచారు. శనివారం నాడు ఆమె అంత్యక్రియలు జరగనున్నాయని సమాచారం. మావోయిస్టు పార్టీకి అనుకూలంగా మాట్లాడినందుకు మావోయిస్టు పార్టీ మాజీ నేత గాదె ఇన్నయ్యను నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) అధికారులు డిసెంబర్‌లో అరెస్ట్ చేశారు. ఇన్నయ్య జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం రేగడి తండా గ్రామ పంచాయతీ పరిధిలో 'మా ఇల్లు ప్రజాదరణ' ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఎన్ఐఏ అధికారులు ఆశ్రమానికి చేరుకుని మూడు గంటలపాటు విచారణ చేపట్టారు. అనంతరం ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఇన్నయ్య హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలులో ఉన్నారు.

# కన్యాకుమారిలో రోడ్డు ప్రమాదం

- **లక్సెట్టిపేటకు చెందిన దంపుతల దుర్మరణం**



**మంచిర్యాల, జనవరి16 (జనంసాక్షి) :** తమిళనాడులోని కన్యాకుమారి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన దంపతులు మరణించారు. అయ్యప్ప మాల ధరించిన వారు.. శబరిమలకు వెళ్లొస్తుండగా ఈ దారుణం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటకు చెందిన పాలకుర్తి సత్యనారాయణ (63), రమాదేవి (59) జనరల్ స్టోర్ నిర్వహిస్తున్నారు. ఇటీవల అయ్యప్ప మాల ధరించిన ఈ దంపతులు జనవరి 8వ తేదీన ఓ ప్రైవేటు సర్వీస్‌లో శబరిమల దర్శనానికి వెళ్లారు. జనవరి 15వ తేదీన మకర సంక్రాంతి రోజున అయ్యప్ప స్వామి దర్శనం చేసుకుని తిరిగి బయల్దేరారు. ఈ క్రమంలో కన్యాకుమారి సమీపంలో బైపాస్ రోడ్డులో బస్సును ఆపారు. అక్కడ సముద్ర స్నానం చేసుకుని దేవాలయాలు సందర్శించుకుని బస్సు దగ్గరకు వస్తుండగా వారికి ఓ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దంపతులిద్దరూ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మృతదేహాలను కన్యాకుమారి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కన్యాకుమారి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# సంక్రాంతి వేళ అర్ధరాత్రి దొంగల హల్‌చల్

- **చెంగిచెర్లలో పలు ఇళ్లల్లో భారీ చోరీ**

**హైదరాబాద్, జనవరి16 (జనంసాక్షి) :** హైదరాబాద్ నగర శివారులోని మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగల ముఠా హల్‌చల్ చేసింది. సంక్రాంతి పండుగ సమయంలో చెంగిచెర్ల కాలనీలో గుర్తు తెలియని దొంగల ముఠా పలు ఇళ్లలోకి చొరబడి భారీ చోరీలకు పాల్పడింది. తెల్లవారుజామున 2:30 గంటల సమయంలో దొంగల ముఠా చేతిలో కత్తులు, ఇతర ఆయుధాలతో చెంగిచెర్ల కాలనీలో సంచరించింది. ముందుగానే రెక్కీ చేసుకుని, కారులో వచ్చిన ఈ ముఠా దాదాపు 12 ఇళ్లలోకి చొరబడి నగదు, బంగారం, వెండి ఆభరణాలు, విలువైన వస్తువులను దోచుకుంది. వరుసగా ఇళ్లల్లో చోరీకి తెగబడ్డ దుండగులు ఆపై అక్కడి నుంచి పరారయ్యారు. తమ ఇళ్లలో దొంగతనం జరిగినట్లు గుర్తించిన బాధితులు వెంటనే మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీంతో కలిసి ఆధారాలను సేకరించే పనిలో పడ్డారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. చోరీ జరిగిన ప్రాంతాల్లో సీసీటీవీ ఫుటేజ్, ఇతర ఆధారాల ఆధారంగా దొంగలను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. పండుగ సమయంలో చాలా మంది స్వస్థలాలకు వెళ్లిపోవడంతో ఇళ్లు ఖాళీగా ఉండటాన్ని అదునుగా భావించి దొంగలు ఈ చర్యకు పాల్పడినట్లు పోలీసులు అంచనా వేస్తున్నారు. కాగా.. సంక్రాంతి సమయంలో స్వగ్రామలకు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలని, పొరుగువారికి సమాచారం ఇవ్వాలని, సీసీటీవీలు, అలారం సిస్టమ్స్ ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచనలు చేశారు. త్వరలోనే దొంగల ముఠాను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

# బస్సులెక్కితేనే ప్రభుత్వ బడులు!

- **లేదంటే పూర్తిస్థాయిలో సర్కారీ స్కూళ్లు మూత**
- **గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి లేక పట్టణాలకు వలసలు**
- **విద్యార్థులు లేక మూతబడుతున్న పాఠశాలలు**
- **జీఓ 25తో లాభమా నష్టమా..?**
- **రేషనైలైజేషన్ వల్ల విద్యారంగానికి తీవ్ర నష్టమని విద్యావేత్తల ఆందోళన**



**మిద్దెల సత్యనారాయణ (రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే ప్రక్రియలో భాగంగానే జీఓ25ను తీసుకొచ్చిందని, రేషనలైజేషన్ వల్ల విద్యారంగానికి తీవ్ర నష్టం జరుగుతుందని ఉపాధ్యాయ పూర్వపు ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రేషనైలేషన్ హేతుబద్ధంగా జరగాలని చెప్పారు. పలు ఉపాధ్యాయ సంఘాలతో పాటు 'జనంసాక్షి'తో నర్సిరెడ్డి తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కొత్తబడులు అవసరం లేదని, ఉన్న బడులను బాగు చేయండి అని మాజీ ముఖ్యమంత్రికి వివరించామని గుర్తుచేశారు. కానీ ప్రభుత్వ బడులను వదిలిపెట్టి కొత్తగా 650కి పైగా రెసిడెన్షియల్ పాఠశాలలను అద్దె భవనాల్లో ప్రారంభించారని, అయినా తొమ్మిదిన్నర సంవత్సరాల పాలనలో ప్రభుత్వ బడులలో చదివే విద్యార్థుల సంఖ్య 7లక్షల పైగా తగ్గిందని వివరించారు. ప్రస్తుతం ఈ ప్రభుత్వ హయాంలో అద్దె భవనాల్లో ఉన్న రెసిడెన్షియల్ స్కూల్ కోసం యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్స్ పేరిట భవనాలను నిర్మించుటకు ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 60 లక్షల మంది విద్యార్థులు ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు చదువుతున్నారని రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఐదు లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని 55 లక్షల మంది విద్యార్థులను ప్రైవేటు చదువులకు వదిలి వేస్తారా? అని ప్రశ్నించారు. ప్రభుత్వ మండల పరిషత్, జిల్లా పరిషత్, గిరిజన సంక్షేమ పాఠశాలలను అభివృద్ధి చేసి ముఖ్యమంత్రితో పాటు మంత్రిమండలి సభ్యులు ఎమ్మెల్యేలు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు తల్లిదండ్రులకు భరోసా ఇచ్చినట్లయితే ప్రభుత్వ బడుల్లో ఎన్‌రోల్‌మెంట్ తప్పనిసరిగా పెరుగుతుంది. తల్లిదండ్రులకు చదువు ఆర్థిక భారం తగ్గుతుంది. తెలంగాణ రాష్ట్రంలో సగం గ్రామీణ మిగతా సగం పట్టణాల్లో ప్రజలు నివసిస్తున్నారు. విద్యార్థుల ఎన్‌రోల్ ప్రకారం 75% విద్యార్థులు పట్టణ ప్రాంతాల్లో, 25శాతం విద్యార్థులు మాత్రమే గ్రామీణ ప్రాంతంలో చదువుతున్నారు. ప్రభుత్వ బడులు మాత్రం సంఖ్యాపరంగా గ్రామీణ ప్రాంతంలో ఎక్కువగా ఉన్నాయి. పట్టణ ప్రాంతాల్లో తక్కువ. విద్యా హక్కుచట్టం ప్రకారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తరగతు గదులతో సంబంధం లేకుండా 60లోపు విద్యార్థులు ఉంటే ఇద్దరు టీచర్లను ఇవ్వాలి. 60 నుండి 90 వరకు ఉంటే ముగ్గురు, 90 నుండి 120 ఉంటే నలుగురు టీచర్లు ఉండాలని 25 జీవో చెబుతోంది. జీరో నమోదైన ప్రాథమిక పాఠశాలలు ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 1441 మూతపడి ఉన్నాయి. ఈ పాఠశాలలో విద్యార్థులు లేరు, ఉపాధ్యాయులు లేరు. ఇక 600 పాఠశాలల్లో పిల్లలు లేకపోవడంతో ఉన్న టీచర్లను వేరే ప్రాంతాలకు డిప్యూటేషన్ ఇచ్చిన పరిస్థితి ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను పంపించేందుకు ఇష్టపడడం లేదు. బస్సు ఎక్కిస్తేనే బడికి వెళ్లినట్టు అనుకుని ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలకు రావడానికి కూడా బస్సులు ఏర్పాటు చేస్తే తప్ప పిల్లలు బడులకు వచ్చే పరిస్థితి లేదు.

### రేషనలైజేషన్ దడ..

ఓవైపు విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం ప్రతి ఒక్క కిలోమీటరకు ఒక్క ప్రాథమిక పాఠశాల ఉండాలి. మూడు కిలోమీటర్లకు ప్రాథమికోన్నత, ఐదు కిలో మీటర్లకు ఉన్నత పాఠశాల ఉండాలి. కానీ బడిలో పిల్లలు లేరనే సాకుతో బడులను మూసివేసే ప్రయత్నం జరుగుతోంది. విద్యార్థులు ఎందుకు రావడం లేదనే అంశాలను చర్చింకుండా, ప్రజలతో విద్యావేత్తలతో సమాలోచన చేయాల్సిన అవసరాన్ని సర్కారు విస్మరిస్తోంది. పిల్లలను సర్కారీ బడులకు రప్పించుకోవడంలో పూర్తి వైఫల్యం సాగుతోందని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో కేవలం ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారననే అపోహతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు కాకుండా ప్రైవేటు పాఠశాలలకు పంపించే పరిస్థితి ఏర్పడుతోంది. ఈ కారణంగా ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగయ్యే దుస్థితి నెలకొనే అవకాశం లేకపోలేదు. ప్రతి తరగతికి ఒక్క ఉపాధ్యాయుడు, కనీసం ఐదు మంది ఉపాధ్యాయులు ఉండాలని ఆయాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. విద్యాశాఖలో పూర్తిస్థాయిలో పాఠశాలల పర్యవేక్షణ కోసం డిప్యూటీ డిఈవోలు, ఎంఈఓలు ఉండాల్సింది పోయి ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కేవలం సుమారు 12 మంది రెగ్యులర్ ఎంఈఓలు పనిచేస్తున్నారు.

### రీ ఆర్గనైజ్ చేయాలి : అలుగుబెల్లి నర్సిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ




ప్రభుత్వ బడులను రీ ఆర్గనైజ్ చేయాలి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి. ప్రైవేటు పాఠశాలల్లో సౌకర్యాలు ఎలా ఉన్నాయో అలాంటి సౌకర్యాలు కల్పిస్తే తప్ప భవిష్యత్తులో ప్రభుత్వ బడులు నిలబడే పరిస్థితి లేదు.

### రేషనలైజేషన్ హేతుబద్ధంగా జరగాలి : చావ రవి, టీఎస్ యూటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు



ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 25ప్రకారం నిర్వహిస్తున్న రేషనలైజేషన్ హేతుబద్ధంగా జరగాలి. గ్రామీణ గిరిజన ప్రాంత విద్యార్థులకు పేద విద్యార్థులకు అన్యాయం జరగకుండా చూడాలి. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా కొన్ని వందల సంఖ్యలో ప్రభుత్వ బడులు మూతపడ్డాయి. మరోసారి అలా జరగొద్దు. ప్రభుత్వం బడ్జెట్ మిగిలించుకోవడం కోసం పాఠశాలలను మూసివేసే ప్రక్రియ కొనసాగుతున్నది. ఈ జీవో అమలు జరిగితే విద్యారంగానికి తీవ్ర నష్టం. పేద విద్యార్థులకు పూర్తిగా విద్య అందకుండా పోతుంది.

### భవిష్యత్తులో బడులు ఉండవు :బిజిలి సత్యం, యూటీఎఫ్ ఫరూఖ్ నగర్ మండల ప్రధాన కార్యదర్శి



ఈ జీఓ అమలు జరిగితే భవిష్యత్తులో బడులు అనేవి ఉండవు. ఉపాధ్యాయులు అనేవారే కనిపించరు. గ్రామాల్లో, ఆవాసా గిరిజన ప్రాంతాల్లో బడీడు పిల్లలు ఉన్నట్లయితే బడులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు రాకపోవడానికి గల కారణాలను విశ్లేషించుకొని ప్రజాప్రతినిధులు, యువత అందరూ సహకరించాలి. ప్రతినెలా తల్లిదండ్రుల సమావేశానికి హాజరై బడి గురించి చర్చించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# మేడారంలో విద్యుత్ పనులన్నీ దాదాపు పూర్తి

- **మేడారం పార్కింగ్ కొరకు ఏర్పాటు చేసిన స్థలాల విద్యుత్ సరఫరా పనులు పూర్తి**
- **మొట్టమొదటి సారిగా కవర్డ్ కండక్టర్ ఏర్పాటు,11 కెవి 26 కిలోమీటర్లు,33 కెవి 11 కిలోమీటర్లు పూర్తి**
- **జంపన్న వాగు ఇరువైపులా లైన్లకు సేఫ్టీ గార్డులు....**
- **జాతర విద్యుత్ సరఫరా పనులను స్వయంగా పర్యవేక్షించిన ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి**



**ములుగు బ్యూరో,జనవరి16(జనం సాక్షి):** రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం 18న మేడారంలో జరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం మేడారం జాతరకు విద్యుత్ సరఫరా పనులను ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి స్వయంగా పర్యవేక్షించారు.మేడారంలో జరుగుతన్న విద్యుత్ పనులన్నిదాదాపు పూర్తి అయ్యాయని స్పష్టం చేశారు.ఈ పర్యవేక్షణలో సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ భద్రత విషయంలో రాజి పడకుండా మొట్టమొదటి సారిగా కవర్డ్ కండక్టర్ ఏర్పాటు చేశామని,11 కెవి 26 కిలోమీటర్లు,33 కెవి 11 కిలోమీటర్లు పూర్తి అయ్యాయని చెప్పారు.6 టవర్ల పనులన్నీ పూర్తి అయ్యాయని,జంపన వాగు ఇరువైపులా లైన్లకు సేఫ్టీ గార్డింగ్ పెడుతున్నామని చెప్పారు.ఇప్పటి వరకు వివిధ సామర్థ్యం గల ట్రాన్స్ఫార్మర్లు 200 వరకు పెట్టడం జరిగిందని, ట్రాన్స్ఫార్మర్లకు సేఫ్టీ మీటర్లు,ఏఎంఆర్ లు అమర్చి నిరంతరం ట్రాన్స్ఫార్మర్ల మీద లోడ్ ఎంత ఉందని నిరంతరం కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షిస్తారని చెప్పారు.అవసరం మేరకు పెట్టాల్సిన ట్రాన్స్ఫార్మర్ల పనులు పూర్తి చేయాలన్నారు.మేడారం పార్కింగ్ స్థలాలలో పనులన్నీ పూర్తి అయ్యాయని చెప్పారు.కన్నెపల్లి అమ్మవారి దేవాలయం వద్ద లైన్లను తనిఖీ చేశారు.ట్రాన్స్ఫార్మర్ల అన్నింటికీ ఫెన్సింగ్ పూర్తి చేయాలని ఆదేశించారు.విద్యుత్ భద్రత దృష్ట్యా ఎల్టి లైన్లలో స్పేసర్స్ పెట్టడం జరిగిందని వివరించారు.జాతర సమయంలో ఎక్కడ అంతరాయం లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పారు.దాదాపు 350 మంది స్టాఫ్ జాతరలో విధులు నిర్వర్తిస్తున్నారని, ఏజెన్సీలు కూడా ఇందులో ఉంటారని తెలిపారు.అందరికి డ్యూటీ చార్ట్ లు వేశామని చెప్పారు.జాతర కొరకు కొత్తగా నిర్మిస్తున్న33/11 కెవి నార్లాపూర్ సబ్ స్టేషన్లో మిగిలిపోయిన పనులు వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ముందుగానే అన్ని పనులు పూర్తి చేశామని ,జాతరను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ప్రాజెక్ట్స్ వి.మోహన్ రావు,చీఫ్ ఇంజనీర్ కె.రాజు చౌహాన్, ములుగు ఎస్ఈ ఆనందం , భూపాలపల్లి ఎస్ఈ మల్చూరు, డిఈ ములుగు పి.నాగేశ్వర రావు, డిఈ ఎంఆర్టి ఽ కంస్ట్రక్షన్ సదానందం, డ్.ఈ టెక్నికల్ భాస్కర్,ఈఈ సివిల్ వెంకట్ రామ్,ఏడీఈ లు రాజేష్, వేణుగోపాల్, సందీప్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

# వరద ప్రభావిత ప్రాంతాలలో కేంద్ర బృందం పర్యటన

- **హనుమకొండ జిల్లాలో భారీ వర్షాలతో దెబ్బతిన్న పంటలు, రోడ్లు, ఇండ్లను పరిశీలించిన బృందం ప్రతినిధులు**



హనుమకొండ ప్రతినిధి జనవరి 16 (జనం సాక్షి) :అక్టోబర్ నెలలో మొంథా తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా వరద ముంపు, కోతకు గురైన రోడ్లు, కూలిన ఇండ్లను కేంద్ర అధికారుల బృందం హనుమకొండ జిల్లాలో శుక్రవారం పరిశీలించారు.జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాలలో జరిగిన పంట నష్టం, రోడ్లు, విద్యుత్, ఇండ్ల నష్టం పై అంచనా వేసేందుకు క్షేత్రస్థాయిలో కేంద్ర వ్యవసాయ శాఖ, రైతు సంక్షేమ డైరెక్టర్ కె.పొన్నుస్వామి నేతృత్వంలో కేంద్ర బృందం పర్యటించింది. ముందుగా ధర్మసాగర్ మండలం దేవునూరు గ్రామ ప్రధాన రహదారి వరద ధాటికి దెబ్బతిన్న రోడ్డును కేంద్ర అధికారుల బృందం, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ తో కలిసి పరిశీలించారు. గ్రామంలో దెబ్బతిన్న పంటల వివరాలను రైతులు, స్థానికులను కేంద్ర అధికారుల బృందం ప్రతినిధులు అడిగి తెలుసుకున్నారు. రైతులు స్థానికులతో మాట్లాడి ఏయే పంటలకు ఎంత నష్టం వాటిల్లింది, ఎంత మేరకు రోడ్లు దెబ్బతిన్నాయనే వివరాలను సంబంధిత శాఖల అధికారులను, స్థానికులను అధికారుల బృందం అడిగి తెలుసుకున్నారు. వరద ధాటికి దెబ్బతిన్న రోడ్లు, పంట పొలాలకు సంబంధించిన ఛాయా చిత్ర ప్రదర్శనను కేంద్ర బృందం పరిశీలించింది. దేవునూరు నుండి ముప్పారం గ్రామం మధ్యలో ఉన్న లో లెవెల్ బ్రిడ్జి సమీపంలో పంట నష్టం జరిగిన ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముప్పారం గ్రామంలో భారీ వర్షాల కారణంగా తోట కమలమ్మ కు చెందిన ఇల్లు కూలిపోగా ఆ ఇంటిని పరిశీలించి ఆ మహిళతో మాట్లాడారు. అక్కడనుండి హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం విశ్వనాథ కాలనీలో వరదలకు దెబ్బతిన్న కాలువను పరిశీలించారు. కొప్పూరు లో వర్షాలకు కూలిన ఇంటిని పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న హనుమకొండ సమ్మయ్య నగర్, గోపాల్ పూర్ ఊర చెరువు కట్ట, వరద ముంపునకు గురైన అమరావతి నగర్ ప్రాంతాలను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, జిడబ్ల్యూఎంసి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ లతో కలిసి కేంద్ర అధికారుల బృందం పరిశీలించారు. తుఫాను వల్ల వాటిల్లిన పంట నష్టం, ఆస్తి, ఇండ్లు, పశు సంపద కోల్పోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు, బాధితులు కేంద్ర బృంద ప్రతినిధులను కోరారు. ఈ సందర్భంగా కేంద్ర అధికారుల బృందం వెంట జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, హనుమకొండ ఆర్డిఓ రాథోడ్ రమేష్, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, పంచాయతీ రాజ్ ఈఈ ఆత్మారామ్, విద్యుత్ శాఖ ఎస్ఈ మధుసూదన్, ఆర్ అండ్ బి అధికారులు గోపికృష్ణ, ఉదయ్, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# పిల్లర్లను కూల్చిన దుండగులు

- **చర్యలు తీసుకోవాలంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు**

**వరంగల్ ఈస్ట్, జనవరి 16 (జనం సాక్షి) :** తన సొంత జాగాలో కదుతున్న ఇంటికి సంబంధించిన పిల్లర్లను, ప్రహరీని దౌర్జన్యంగా కూల్చేసిన దుండగులపై చర్యలు తీసుకోవాలని బాధితుడు సముద్రాల స్వామి మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధితుడు స్వామి తెలిపిన వివరాల ప్రకారం. వరంగల్ నగరంలోని అండర్ రైల్వే గేట్ ఉరుసు శివారు సర్వేనెంబర్ 270, 271, 272 లో గల సుమారు 200 గజాల ప్లాట్ లో నెలరోజుల క్రితం నుండి ఇంటి నిర్మాణం కోసం పిల్లర్లు తీసి నిర్మాణం చేస్తున్నట్లు చెప్పాడు. ఈనెల 14న అర్ధరాత్రి ఎవరు లేని సమయంలో ప్లాట్ మీదికొచ్చి ప్రొక్లైన్ తో పిల్లర్లను, ప్రహరీని కూల్చివేయడం జరిగిందని బాధితుడు స్వామి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు చెప్పాడు. తన ప్లాటుకు సంబంధించిన దస్తావేజులు కూడా పోలీస్ స్టేషన్లో అందజేసినట్లు తెలిపాడు.

# మద్యం కోసం బెల్టు షాపుకు వెళ్లిన వారిపై దాడి!

- **ఒకరి పరిస్థితి విషమం..**

**చెన్నారావుపేట, జనవరి 16 (జనంసాక్షి) :** మద్యం కోసం బెల్టు షాపు వద్దకు వెళ్లిన వారిపై దాడి చేసి కొట్టిన సంఘటన చెన్నారావుపేట గ్రామ శివారులోని ఈర్య తండాలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. చెన్నారావుపేట గ్రామానికి చెందిన రాధారపు గణేష్, తన బావ లింగాల వరుణ్, తన మిత్రుడు ధరంసోతు సురేష్ లు ముగ్గురు కలిసి ఈర్య తండాలో అజ్మీర రాజు కల్పన దంపతులకు చెందిన బెల్ట్ షాపు వద్దకు వెళ్లారు. బీర్లు కావాలని అడిగారు. దీంతో బీర్లు లేవని కల్పన తెలిపింది. బీర్లు కావాలని ఇతరులు షాపుకు వస్తే వారికి ఇస్తుంది. కానీ వీరికి మాత్రం ఇవ్వడం లేదు. మాకు బీర్లు లేవని చెప్పావు వారికి ఇస్తున్నావు కదా మాకు ఎందుకు ఇవ్వడం లేదని వారు అడిగారు. దీంతో బెల్టు షాపు నిర్వాహకులు అజ్మీర రాజు కల్పన దంపతులు, అదే తండాకు చెందిన గుగులోతు యాకు అనే ముగ్గురు వ్యక్తులు కలిసి గణేష్, వరుణ్, సురేష్ లపై దాడి చేశారు. అంతేకాక ఇనుప రాడ్లతో గణేష్ తలపై తీవ్రంగా కొట్టారు. దీంతో గణేష్ తలకు బలమైన దెబ్బ తగలడంతో స్పృహ తప్పి కింద పడిపోయాడు. వరుణ్, సురేష్ లకు కూడా స్వల్ప గాయాలయ్యాయి.

# అమెరికా రౌడీయిజం.. ఇరాన్‌కు ప్రాణసంకటం

ఇరాన్ నుండి వచ్చే వార్తా చిత్రాలు ఆ దేశంలో మిన్నుముట్టిన ఒత్తిడిని చిత్రిస్తున్నాయి. బెదరిపోతున్న మధ్యతరగతి వర్గం, విలువ కోల్పోతున్న కరెన్సీ, ప్రభుత్వంచేపట్టే దమన చర్యలు... ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రజా స్వేచ్ఛ కోసం పోరాడుతున్న ఇరానియన్లకు "సహాయం దారిలో ఉంది " అని ప్రకటించడం, అమెరికాను మళ్లీ విమోచకుడిగా చిత్రించడానికి చేసే ప్రయత్నం. కానీ ఈ ప్రకటనలు మరుగున పెట్టే వాస్తవం ఏమిటంటే, ప్రస్తుత అస్థిరత అనేది అమెరికా దశాబ్దాలుగా విధించిన ఆర్థిక యుద్ధం యొక్క సహజ పరిణామం అని అందరికీ తెలిసిందే. ఇరాన్ "కూలిపోతుందా" అనే ప్రశ్నకు జవాబు చెప్పాలంటే, విదేశీ ఒత్తిడి దేశ సమాజాన్ని ఎలా వికృతం చేసిందో, ఎలైట్లను ఎలా సంపన్నుల్ని చేసిందో, ప్రజలను ఒక మూలకు ఎలా నెట్టిందో అర్థం చేసుకోవాలి.

ఈ సంక్షోభం మూలాలు చరిత్రలోనే ఇమిడి ఉన్నాయి. 1953లో సీఐఏ సహాయంతో జరిగిన ప్రజా ప్రభుత్వ పతనం నుంచి 1979 విప్లవం వరకు, ఈర్ష్య, ప్రతిఘటన చరిత్రగా సృష్టించబడింది. నలభై సంవత్సరాలుగా, ఆర్థిక నిరోధాలు అమెరికా ప్రధాన ఆయుధం. 2015 లో అణు ఒప్పందం (న్యూక్లియర్ డీల్) నుండి ఏకపక్షంగా వైదొలిగిన తర్వాత ట్రంప్ పాలనలో మరింత ఉగ్ర రూపం దాల్చిన "గరిష్ఠ ఒత్తిడి" (మాక్సిమమ్ ప్రెషర్) విధానం, ఇరాన్ ఆర్థిక వ్యవస్థను పూర్తిగా నాశనం చేయడానికి రూపొందించబడింది.

సైద్ధాంతికంగా, ఇది భయంకరంగా సాఫల్యం పొందింది. ఇరాన్ ఆర్థిక జీవనాడి అయిన చమురు ఎగుమతులు 2018 తర్వాత 60-80 శాతం కుప్పకూలాయి. జాతీయ కరెన్సీ రియాల్ విలువ పూర్తిగా కోల్పోయింది. వార్షిక ద్రవ్యోల్బణం (ఇన్ఫ్లేషన్) 40 శాతాన్ని మించింది. ఆహార ధరలు 70 శాతానికి పెరిగాయి. ప్రపంచ బ్యాంక్ (వరల్డ్ బ్యాంక్) ఆర్థిక సంక్షోభం రెండు సంవత్సరాలు కొనసాగుతుందని అంచనా వేస్తోంది.

అయినా, రాజకీయ లక్ష్యాలు, ప్రభుత్వం పతనం లేదా దాని ప్రాంతీయ, అణు విధానాల్లో మార్పు ... పూర్తిగా విఫలమయ్యాయి. బదులుగా, ఈ నిరోధాలు ఒక విషపదార్థంలా పనిచేసి, పౌర సమాజం యొక్క పునాదులను కరిగించగా, భద్రతా రాజ్యం (సెక్యూరిటీ స్టేట్) గోడలను మరింత బలోపేతం చేశాయి. అత్యంత బలమైన బలి ఇరాన్ మధ్యతరగతి. పరిశోధనలు చూపిస్తున్నట్లుగా, 2012 మరియు 2019 మధ్య, నిరోధాలు మధ్యతరగతి వర్గం పరిమాణాన్ని దాని సంభావ్య పరిమాణం కంటే సగటున 17 శాతం పాయింట్లను తగ్గించాయి. ఇది ట్రంప్ యొక్క "గరిష్ఠ ఒత్తిడి" తర్వాత 28 శాతం పాయింట్ల వరకు విస్తరించింది. ఉపాధ్యాయులు, సివిల్ సర్వెంట్లు, వేతనం తీసుకునే ప్రొఫెషనల్స్ తమ కొనుగోలు శక్తిని పూర్తిగా కోల్పోయి, "అరక్షిత ఉపాధి" మరియు అనధికారిక శ్రమలోకి నెట్టబడ్డారు. ఈ ఆర్థిక శ్మశానం, 2025 చివర్లో కరెన్సీ రికార్డు పతనంతో ప్రారంభమైన నిరసనలకు దారితీసింది.

రాజ్యం ప్రతిస్పందన ఊహించినట్లుగా క్రూరమైనది, ఇది విదేశీ వ్యవస్థాపన (ఐసోలేషన్) యొక్క రెండవ విపరీతమైన పరిణామాన్ని వెల్లడి చేస్తుంది.



ప్రజలు బాధపడుతున్నప్పుడు, "నిరోధ ఆర్థిక వ్యవస్థ" (శాన్షన్స్ ఎకనామీ) అనుకూలం గల ఎలైట్లకు అభివృద్ధి చెందింది. యు.ఎస్. ట్రెజరీ డిపార్ట్మెంట్ యుఎఇ నుండి సింగపూర్ వరకు ఫ్రంట్ కంపెనీలను ఉపయోగించి, చమురు ఆదాయాల్లో బిలియన్ల డాలర్లను వెలికితీసే "షాడో" బ్యాంకింగు నెట్వర్క్లను వివరిస్తుంది. ఈ నిధులు, ప్రజా ఇబ్బందిని తగ్గించడానికి బదులుగా, రాష్ట్ర నిర్బంధాన్ని ఆర్థిక సహాయం చేయడానికి మరియు విదేశాల్లో ప్రాక్సీ సమూహాలకు (ప్రాక్సీ గ్రూప్స్) మద్దతు ఇవ్వడానికి ఉపయోగించబడ్డాయి. నిరోధాలు రివల్యూషనరీ గార్డ్స్ యొక్క ఆర్థిక సామ్రాజ్యాన్ని బలహీనం చేయలేదు; అవి దాని విస్తరణను నిషిద్ధ, అనధికారిక వాణిజ్యంలోకి ప్రోత్సహించాయి.

ఇక్కడే అమెరికా ప్రస్తుత ప్రవర్తన యొక్క విపరీతమైన విరోధాభాసం ఉంది. ట్రంప్ నిరసనకారులపై హింసను సమన్వయం చేసినందుకు అలీ లారిజానీ వంటి అధికారులపై నిరోధాలు విధిస్తున్నాడు, అదే సమయంలో ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని పునరుద్ధరించినట్లయితే సైనిక చర్యకు ఉపక్రమిస్తా అని ట్రంప్ బెదిరిస్తున్నాడు. అతను తన విధానాలు నాశనం చేయడానికి సహాయపడిన ఇరానియన్ జనాభాకు సహాయం అందిస్తాడు. ఈ ద్వంద్వత్వం ఒక ప్రాథమిక దోషాన్ని బహిర్గతం చేస్తుంది: ఆర్థిక ముట్టడి వ్యూహాలు (ఎకనామిక్ సీజ్ టాక్టిక్స్) ప్రజాస్వామ్య విప్లవాలను ఉత్పత్తి చేయవు; చాలా తరచుగా, అవి విఫల రాష్ట్రాలు, మానవీయ విపత్తులు మరియు మరింత పాతుకుపోయిన సర్వాధికారవాదాన్ని ఉత్పత్తి చేస్తాయి. ఇరాన్లో అత్యవసర మందుల కొరతకు నిరోధాలు సంబంధం కలిగి ఉన్నాయి.

ఇరాన్ లొంగిపోతుందా? ఈ రాజ్యం ఒక ఖచ్చితమైన తుఫానును ఎదుర్కొంటోంది: ఆర్థిక విపత్తు, చారిత్రక ప్రజా కోపం, బలహీనమైన 86 ఏళ్ల సుప్రీం లీడర్, మరియు నిరాయుధంగా ఉండటానికి అపూర్వమైన ఒత్తిడి కింద ఉన్న "ప్రతిఘటన అక్షం". అయినప్పటికీ, దీనికి నమ్మకంగా, బాగా నిధులు సమకూర్చబడిన భద్రతా యంత్రాంగం మరియు అంతర్గిత అశాంతిని అధిగమించే చరిత్ర కూడా ఉంది. మరింత సంబంధిత ప్రశ్న ఇది: కూలిపోయిన తర్వాత ఏమి వస్తుంది? ఈ ప్రాంతంలో రాజ్యం మార్పు (రిజిమ్ చేంజ్) కోసం యు.ఎస్.కు విపత్తు రికార్డ్ ఉంది, మరియు వేటి కోసమైనా వేచి ఉన్న ఏకీకృత, సమర్థవంతమైన ప్రతిపక్షం లేదు. మరింత సంభావ్య దృశ్యం అనేది హఠాత్తు పతనం కాదు, కానీ సుదీర్ఘమైన, బాధాకరమైన క్షయం -- ఒక ఖాళీ చేయబడిన రాష్ట్రం దారిద్ర్యంతో ఉన్న, ఆఘాతం పొందిన జనాభాపై పాలన చేస్తుంది.

ముందుకు వెళ్ళే మార్గం మరిన్ని "గరిష్ఠ ఒత్తిడి" లేదా విమోచన ఖాళీ వాగ్దానాలలో లేదు. ఈ విధానం యొక్క దశాబ్దాలు కేవలం బాధ మరియు ఎక్కువ అస్థిరతను తీసుకువచ్చాయని గుర్తించడం ద్వారా ఇది సాధ్యమవుతుంది. ఇరానియన్ ప్రజలకు నిజమైన సహాయం దౌత్య ధైర్యం ధృవీకరించదగిన అణు నిర్బంధాలకు బదులుగా మరియు ప్రాంతీయ భద్రతపై సంభాషణ కోసం నిరోధ ఆర్థిక వ్యవస్థను విప్పడానికి నిజాయితీ ప్రతిపాదన. ప్రత్యామ్నాయం ఏమిటంటే, ఒక గొప్ప దేశం నెమ్మదిగా ఊపిరి ఆడకుండా చూసుకోవడం, దాని ప్రజలు ముగింపు లేని భౌగోళిక రాజకీయ గతులేఖ కోసం అత్యధిక ధర చెల్లిస్తారు. విజయం లేదా పరాజయం గురించి ఎక్కువగా లెక్కించకుండా, మానవీయ ముప్పు గురించి ఆలోచించాల్సిన సమయం ఇది.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328497

# విశ్వ శక్తులు - మానవ ఆలోచనలు శాస్త్రీయ ఆలోచన

మానవ జీవితం విశ్వంతో విడదీయలేని సంబంధంలో కొనసాగుతున్నదనే భావనకు ఆధునిక శాస్త్రం క్రమంగా దగ్గరవుతోంది. భూమి మీద జీవుల ఉనికి సూర్యుని శక్తిపై ఆధారపడి ఉన్నదనే విషయం 1800 తరువాతి పరిశోధనలతో స్పష్టమైంది. సూర్యుని నుండి భూమికి చేరే కిరణజాలం పరిమాణంలో స్వల్ప మార్పులు సంభవించినప్పుడు వాతావరణ సమతుల్యత దెబ్బతింటున్నదని 1975 నాటి అధ్యయనాలు సూచించాయి. ఈ మార్పుల ప్రభావం జీవుల శరీర వ్యవస్థలపై కూడా కనిపిస్తున్నదని శాస్త్రవేత్తలు గుర్తించారు.

భూమి అయస్కాంత క్షేత్రంలో ఏర్పడే మార్పులు మానవ నర వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయనే అంశం 1988 తరువాత ఎక్కువ ప్రాధాన్యత పొందింది. ఆ సంవత్సరంలో జరిగిన పరిశోధనలో నిద్రలేమితో బాధపడుతున్న వ్యక్తులలో సుమారు 15% మందికి భూమి అయస్కాంత క్షేత్రంలో వచ్చిన హెచ్చు తగ్గులతో సంబంధం ఉన్నట్లు నిర్ధారించారు. నిద్ర సరైన స్థాయిలో లేకపోతే మెదడు ఆలోచనా సామర్థ్యం తగ్గిపోతుంది. దీని ఫలితంగా భావోద్వేగ అస్థిరత పెరుగుతుంది. అటువంటి పరిస్థితుల్లో ప్రతికూల ఆలోచనలు అధికమవుతాయి.

ఆలోచనలు శరీరంపై చూపే ప్రభావాన్ని శాస్త్రీయంగా కొలవడం 1990 తరువాత సాధ్యమైంది. మెదడులో ఉత్పత్తి అయ్యే రసాయన ద్రవ్యాలు భావోద్వేగ స్థితిని నిర్ణయిస్తున్నాయని 1992 నాటి పరిశోధన స్పష్టం చేసింది. సానుకూల ఆలోచనలు కలిగిన వ్యక్తులలో ఆనందాన్ని కలిగించే రసాయ నాల స్థాయి సుమారు 30% పెరుగుతున్నట్లు గణాంకాలు చూపించాయి. అదే సమయంలో భయాన్ని కలిగించే ఒత్తిడి రసాయనాల స్థాయి సుమారు 20% తగ్గింది. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే ఆలోచనలు పూర్తిగా అంతర్గత ప్రక్రియ మాత్రమే కావు. అవి బయట వాతావరణ పరిస్థితుల ప్రభావానికి లోబడి ఉంటాయి. కాంతి తీవ్రత, ఉష్ణోగ్రత మార్పులు, కాలచక్ర పరిణామాలు మానవ మానసిక స్థితిపై ప్రభావం చూపుతున్నాయని 2005 నాటి అధ్యయనంలో వెల్లడైంది. సహజ కాంతి తక్కువగా లభించే ప్రాంతాలలో నివసించే ప్రజల్లో నిరుత్సాహ భావం సుమారు 25% అధికంగా నమోదైంది.

భూమిపై జీవనానికి మూలాధారం అయిన సూర్య శక్తి మానవ శరీరంలో జరిగే జీవక్రియలను సమన్వయం చేస్తుంది. సూర్య కాంతి సరిపడా లభించినప్పుడు శరీరంలో కాల్షియం శోషణ పెరుగుతుంది. దీని ప్రభావంగా ఎముకల బలం మెరుగవుతుంది. 2012 నాటి పరిశోధన ప్రకారం సరైన కాంతి లభించిన వ్యక్తులలో శారీరక చురుకుదనం సుమారు 18% పెరిగింది. శారీరక చురుకుదనం పెరిగినప్పుడు మానసిక స్థిరత్వం కూడా మెరుగుపడుతుంది. శరీరంలోని ప్రతి కణం సూక్ష్మ స్థాయిలో విద్యుత్ సంకేతాలపై ఆధారపడి పనిచేస్తుంది. ఈ సంకేతాల సమతుల్యత దెబ్బతిన్నప్పుడు వ్యాధులు ఏర్పడతాయని జీవ భౌతిక శాస్త్రం చెబుతోంది. 1999 నాటి అధ్యయనంలో దీర్ఘకాలిక ఆందోళనతో బాధపడుతున్న వ్యక్తుల కణస్థాయి విద్యుత్ చర్యలు అసమతుల్యంగా ఉన్నట్లు గుర్తించారు. అదే అధ్యయనంలో ధ్యానం చేసే వ్యక్తులలో ఈ అసమతుల్యత సుమారు 40% తగ్గినట్లు నమోదు చేశారు.

ధ్యానం సమయంలో శ్వాస నియంత్రణ జరుగుతుంది. శ్వాస నియంత్రణ వల్ల రక్తంలో ఆక్సిజన్ పరిమాణం పెరుగుతుంది. ఇది మెదడుకు సరైన పోషణ అందిస్తుంది. మెదడు ఆరోగ్యంగా పనిచేసినప్పుడు ఆలోచనలు సహజంగా సానుకూల దిశలో సాగుతాయి. 2018 నాటి గణాంకాల ప్రకారం రోజుకు కనీసం 20 నిమిషాలు ధ్యానం చేసిన వ్యక్తుల లో ఆందోళన స్థాయి సుమారు 32% తగ్గింది. విశ్వంలో జరిగే మార్పులు భూమి జీవనంపై పరోక్షంగా ప్రభావం చూపుతున్నా యనే భావనకు ఖగోళ శాస్త్ర పరిశోధనలు బలమిస్తున్నాయి. సూర్య ఉపరితలంపై ఏర్పడే పేలుళ్ల తీవ్రత పెరిగిన సంవత్సరాలలో భూమి వాతావరణంలో అస్థిరతలు ఎక్కువగా నమోదయ్యాయి. 2001 సంవత్సరంలో ఈ పేలుళ్ల ప్రభా వంతో భూమి అయస్కాంత క్షేత్రం సుమారు 7% వరకు మార్పులకు గురైంది. అదే సంవత్సరంలో నిద్ర సమస్యలపై ఫిర్యాదులు ప్రపంచవ్యాప్తంగా పెరిగినట్లు గణాంకాలు చూపించాయి. ఈ పరిశీలనలు ఒక విషయాన్ని స్పష్టంగా సూచిస్తున్నాయి. మానవ జీవితం పూర్తిగా స్వతంత్ర వ్యవస్థ కాదు. అది విశ్వంలోని శక్తి ప్రవాహాలతో అనుసంధానమై ఉంది. అయితే ఈ అనుసంధానం ప్రత్యక్ష నియంత్రణ రూపంలో కాకుండా పరోక్ష ప్రభావాల రూపంలో పనిచేస్తోంది. పాజిటివ్ ఆలోచ నలు కలిగిన వ్యక్తులు ఈ ప్రభావాలకు తక్కువగా లోనవుతున్నారని 2016 నాటి అధ్యయనం వెల్లడించింది. సానుకూల దృక్పథం ఉన్నవారు ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనే సామర్థ్యం ఎక్కువగా కలిగి ఉంటారు. ఈ సామర్థ్యం మెదడులో ఏర్పడే అనుకూల నాడీ మార్గాల వల్ల ఏర్పడుతుంది. దీర్ఘకాలంగా సానుకూలంగా ఆలోచించే వ్యక్తుల మెదడులో ఈ మార్గాలు బలపడతాయని 2020 నాటి నాడీ శాస్త్ర అధ్యయనం నిర్ధారించింది. ఈ వ్యక్తులలో నిర్ణయ సామర్థ్యం సుమారు 27% మెరుగ్గా ఉన్నట్లు తేలింది. ఈ మొత్తం విశ్లేషణ చూస్తే ఒక విషయం స్పష్టమవు తుంది. కోస్మిక్ స్థాయిలో ఉన్న శక్తులు భూమి జీవనానికి నేపథ్యంగా పనిచేస్తున్నాయి. మానవ ఆలోచనలు శరీర వ్యవస్థలను ప్రభావితం చేస్తున్నాయి. ఈ రెండు మధ్య సమన్వయం ఏర్పడినప్పుడు జీవన నాణ్యత మెరుగుపడుతుంది. శాస్త్రం ఇప్పటికీ అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వలేక పోయినా, ఇప్పటివరకు లభించిన గణాంకాలు ఈ దిశలో బలమైన సూచనలను అందిస్తున్నాయి. భవిష్యత్తులో 2030 నుంచి 2050 మధ్య జరిగే పరిశోధనలు ఈ అనుసంధానాన్ని ఇంకా స్పష్టంగా వివరించే అవకాశం ఉంది. అప్పటికి మానవ శరీర శక్తి వ్యవస్థలపై మరింత లోతైన అవగాహన ఏర్పడుతుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తు న్నారు. అప్పటివరకు పాజిటివ్ ఆలోచనలు కలిగిన జీవనశైలి అనుసరించడం శాస్త్రీయంగా సురక్షితమైన మార్గమని చెప్పవచ్చు.



డాక్టర్. రక్కిరెడ్డి ఆదిరెడ్డి
సీనియర్ పాత్రికేయులు

# రాసే రాతలు, వారి వ్యక్తిత్వం వేరుకాదు

తెలుగులో రాసినంత ఈజీగా మాట్లాడలేను నేను. బహుశా అది ఈ మధ్యకాలంలో తెలుగు సాహిత్యాన్ని కాస్త చదవడం రాయడం మూలంగా నేను తెలుగులో బానే రాయగలుగుతున్నాను గాని, మహారాష్ట్రలో పుట్టి పెరగడం వల్ల కేవలం ఇంటికి మాత్రమే పరిమితమైన తెలుగుని నేను బయట ఎక్కడా పెద్దగా ఎవరితోనూ మాట్లాడకపోవడం వల్ల కాబోలు తెలుగు మాట్లాడటం కాస్త కష్టంగానే వుంటుంది నాకు. అందులోనూ ఇక సాహిత్య భాషలో అంటే ఒకరకంగా నాకది పెద్ద ఛాలెంజ్ అనే చెప్పాలి. లిపిది ఏమైనా నా సైడ్ నుండి ఇదొక నెగటివ్ పాయింట్ అని ఒప్పుకోవాలి నేను.రి అయినప్పటికీ నా రెండు మాటల్ని చాలా ఓపిగ్గానే విన్నారు అక్కడున్న వాళ్ళంతా. కానీ నేను మాట్లాడాల్సిన విషయాలు ఇంకా ఎన్నో మిగిలి పోయాయి కదా అనిపించి, ఈ సందర్భంగా మరోసారి నా వాయిస్ ని వినిపించాలనే ఉద్దేశంతో ఇది రాస్తున్నాను.

"సాహిత్యం అంటే కేవలం అక్షరాల కూర్పు కాదు, భావాలను ప్రభావితం చేసే, మనసును మార్చే, ఆలోచనలకు ప్రేరణనిచ్చే వాస్తవిక కళ!" అని ఎవరి ఫేస్బుక్ గోడ మీదనో చదివినట్టు గుర్తు నాకు. అలాగే "దేశం కోసం మరణించే వాళ్ళు వీరులు, దేశాన్ని నిలబెట్టేది సాహిత్యం.!" అంటే సాహిత్యకారులు అని మహాకవి శ్రీ శ్రీ అన్నారు. నిజంగా ఎంత నిజం కదా, సాహిత్యానికి ఎంత బలం వుందో కదా అనిపిస్తుంది నాకు. ఎందుకంటే అమ్ముడు పోయిన మీడియా, రాజ్యం చేతిలో కీలుబొమ్మై ఆడుతున్న చోట నేడు సాహిత్యమే ఈ ఫాసిస్ట్ ప్రభుత్వపు కపటత్వాల్ని, రహస్యాల గుట్టును విప్పి చెప్తుంది. ప్రజల్ని అదెలా దోపిడీ చేస్తుందో, నయా ఉదారవాదం పేర ప్రభుత్వరంగాలన్నింటినీ ఎలా ప్రైవేట్ పరం చేస్తుందో. ప్రభుత్వ సంస్థలన్నింటినీ తీసుకెళ్ళి ఒకడి చేతిలో పెట్టి సింగల్ మోనోపలీ కింద చేసిపడేసి దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తూ, మతం పేర సమాజాన్ని ధ్వంసం చేస్తూ, ప్రజల మీద ఎంతటి భారాన్ని మోపుతుందో లాంటి అనేక అంశాలని బహిర్గతం చేస్తూ.. ప్రజల్లో ఇప్పుడు ఆ ఎరుకని కలుగజేస్తున్నది కేవలం సాహిత్యం మాత్రమే.

ఇప్పుడే కాదు ఎన్నో ఏండ్లుగా సాహిత్యం సమాజంలోని అసమానతల గురించి మాట్లాడుతుంది, స్త్రీ-పురుష సమానత్వం గురించి, దళిత, బహుజన, స్త్రీల హక్కుల గురించి మాట్లాడుతుంది. అణచివేయబడ్డ, అణగారిన వర్గాల గొంతుకై నిలుస్తూ వస్తుంది. నిజాన్ని నిక్కచ్చిగా నిర్భయంగా మాట్లాడాల్సిన జర్నలిజం అమ్ముడు పోలైన కారణంగా నేడు సాహిత్యం మాత్రమే ఆదివాసీల తరపున అండగా నిలబడింది, రాజ్యం కుట్రకు బలైపోతున్న అమరుల త్యాగాల్ని తన భుజానేసుకొని మోస్తుంది. న్యాయమని గొంతెత్తిన పాపానికి అన్యాయంగా జైలు పాలవుతున్న విద్యార్థులు, మహిళలు, ప్రొఫెసర్లు, మేధావుల తరపున పాటై గర్జిస్తుంది. కాలేజీ క్యాంపస్లలో డప్పై మోగుతుంది. ఇక్కడ మనం సంతోషించాల్సిన ఇంకో విషయం ఏంటంటే నిజాల్ని కప్పి పుచ్చాలనే పన్నాగాలు పన్నుతున్నా, రాజ్యాన్ని ఎదిరించి నేడు ఎంతోమంది యువకులు, మహిళలు, బుద్ధిజీవులు సోషల్ మీడియా ప్లాట్ఫారం ద్వారా వారి ఆగ్రహాన్నీ, ఆక్రోషాన్నీ చూపిస్తున్నారు. నిజాన్ని బట్టబయలు చేస్తూ, న్యాయాన్ని కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. ఇది ఈ జనరేషన్ లో వచ్చిన ఒక విప్లవాత్మక మార్పు అంటాన్నేను.

చివరగా ఒక మాట. యంగ్ అండ్ ఎక్స్పీరియన్స్ కవులు, రచయితలు ఎవరైనా రాసే రాతలు, వారి వ్యక్తిత్వం వేరు కాదని గుర్తుంచుకోవాలి. మీరు రాసే సాహిత్యం మీ వ్యక్తిత్వానికి విరుద్ధంగా వుంటే, మీ వ్యక్తిత్వాన్ని, మీ రాతల్ని వేరుగా చూడలేం ఎందుకంటే చలించే హృదయం ఉన్నవాడు, ఎదుటి వ్యక్తి దుఃఖాన్ని తనదిగా భావించేవాడు, సమాజ పురోగతిని ఆశించేవాడు మాత్రమే, అభ్యుదయ, విప్లవ కవితల్ని రాయగలడు, రచనల్ని చేయగలడు అండ్ అలాంటివాడెపుడూ ఎదుటి మనిషి పట్ల అసభ్యంగా ప్రవర్తించలేదు. కనీసం అటువంటి ఆలోచన కూడా చేయలేడు. అలా కాకుండా వాడు కాకమ్మ కథలు ఎన్ని చెప్పినా, వాడు నిజం కాదని అర్థం. వాడి రాతలు, మాటలు అంతా మోసం. అలాంటి వాళ్ళు క్షమాపణకి ఎట్టి పరిస్థితుల్లోనూ అర్హులు కారు. వారిని వెనకేసుకొచ్చే వారు కూడా (కారణం ఏదైనా కావచ్చు). ఎందుకంటే సాహిత్యం కేవలం అవార్డులు, రివార్డుల కోసం రాసుకొని వచ్చిన పేరుని, ఇచ్చిన పతకాల్ని ఇంటి గోడలకి వేళాడదీసుకొని చూసి మురిసిపోయేందుకు కాదు. అదొక బాధ్యత. సమాజాన్ని మార్చే కర్తవ్యాన్ని నిత్యం నెత్తిన మోసుకు తిరిగే ముందుతరాల చరిత్ర. కాబట్టి ఈ విషయంలో సాహిత్యకారులంతా యువకులు, పెద్దలు కూడా ఒళ్ళు దగ్గర పెట్టుకొని మసలుకుంటే మంచిది లేదా చరిత్ర మీ ఘనకార్యాన్ని కూడా రికార్డు చేస్తుంది అనడంలో ఎలాంటి సందేహమూ లేదు.

అండ్ ఇష్టాల్ని-కష్టాల్ని, నా ఆశల్ని-అనుభూతుల్ని, బాధని-దుఃఖాన్ని అన్నింటినీ నాకు తోచిన పద్దతిలో..

అక్షరీకరించిన తీరులో ఆ ఎమోషన్స్ని అర్థం చేసుకొని ఆ వచన కవిత్వాల్ని మెచ్చి వాటికి పురస్కారాన్ని అందజేసిన కవిత కుందుర్తి గారికి బోలెడు థాంక్స్. 1958 లో కుందుర్తి ఆంజనేయులు గారు 'వచన కవిత్వా'న్ని ప్రోత్సాహిస్తూ ఫ్రీ వర్స్ సంస్థని స్థాపించి, ప్రతి ఏటా ఉత్తమ వచన కవిత్వానికి అవార్డు ప్రకటించే కార్యక్రమం గత కొనేళ్ళు మధ్యలో ఆగిపోయినా మళ్ళీ ఇప్పుడు ఆ లెగసీ నీ కొనసాగించాలని కుందుర్తి ఆంజనేయులు గారి మనవరాలైన కుందుర్తి కవిత 'కుందుర్తి పురస్కారం' పేరుతో మళ్ళీ ముందుకు రావడం.. అందులోనూ ఈ 'కుందుర్తి' పేర మొదటి పురస్కారానికి నన్ను ఎంపిక చేయడం నిజంగా చాలా గొప్ప అనుభూతి నాకు. ఎందుకంటే ఇది 'కుందుర్తి పురస్కారా'నికి మాత్రమే మొదటి పురస్కారం కాదు. నేను కూడా నా లైఫ్ లో తీసుకున్న మొదటి పురస్కారం. కాబట్టి ఇదెప్పటికీ నా జీవితంతో ఒక గొప్ప మెమరీగా నిలిచిపోతుంది.

నా బాధని, భావాల్ని ఏదో నాకు నచ్చినట్టుగా రాసుకుంటు పోయాను గానీ.. నిజంగా వీటిని మీరింతగా ఆదరిస్తారని గానీ, అర్థం చేసుకుంటారని గానీ నేనేప్పుడూ ఊహించలేదు. ఆ వచన కవిత్వంలోని భావాల్ని అర్థం చేసుకొని నన్ను ప్రోత్సహించిన శ్రీరామ్ పుప్పాల గారికి, అనిల్ డ్యాని గారికి, ఫ్రీ వర్స్ అండ్ హోరు టీమ్ కి కూడా ప్రత్యేక ధన్యవాదాలు. నేను రాసిన మొదటి రెండు పుస్తకాలు..'కనురెప్పల మాటున', 'ప్రపంచ స్త్రీల కవిత్వం' ఈ రెండింటి ఆధారంగానే నాకు ఈ పురస్కారం అందజేయడం జరిగింది కాబట్టి ఇవి రాసింది, అనువదించింది నేనే అయినప్పటికీ ఈ పుస్తకాలు రాడానికి తెర వెనకుండి ఎంతో కృషి చేసిన, ప్రూఫ్ దిద్ది, వాటికో పుస్తకం రూపం ఇచ్చి పుస్తకాలుగా తీసుకొచ్చిన శ్రమ మాత్రం మిత్రుడు దేవిడ్ దే. తన సహాయం వల్లే ఈ పుస్తకాలు మీ ముందుకొచ్చాయి, నేను మీ అందరికి ఒక కవయిత్రిగా, రచయిత్రిగా పరిచయం అయ్యాను. కాబట్టి నేను ఈ అవార్డుని మిత్రుడు దేవిడ్‌కే అంకితం ఇస్తున్నాను. థాంక్యూ దేవిడ్ ఫర్ బీయింగ్ మై సైడ్ ఆల్ ది టైం.




దియా విఘ్నేష్


# అపహాస్యం పాలవుతున్న అమెరికా ప్రజాస్వామ్యం

టారిఫ్‌ల విషయంలో అమెరికా ఫెడరల్ కోర్టు నిర్ణయం ట్రంప్‌కు శరాఘాతమనే చెప్పాలి.వివిధ దేశాలపై అమెరికా విధిస్తున్న వాణిజ్య సుంకాలపై ఫెడరల్ కోర్టు ట్రంప్ కు వ్యతిరేకంగా తీర్పు చెప్పడం హర్షదాయకం. ఇతర దేశాలపై దాడులకు పాల్పడే ట్రంప్ ను అమెరికా న్యాయస్థానాలు నిలువరించాలి. హిట్లర్ ను మించిన నియంతగా ట్రంప్ పేరు చరిత్రలో నిలిచిపోయే అవకాశమున్నది. ట్రంప్ వైఖరి వలన అమెరికా ప్రజాస్వామ్యం అపహాస్యం పాలవుతున్నది.వెనిజులా సార్వభౌమత్వం పై ట్రంప్ జరిపిన సాయుధ దాడి ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యంగా చెప్పవచ్చు. మరోవైపు ట్రంప్ యుద్ధోన్మాదంతో మధ్య ప్రాచ్యం రణరంగంలా మారుతున్నది. ఇరాన్ పై అమెరికా కత్తులు నూరుతుంటే, ఇజ్రాయిల్ పాలస్తీనా పై దాడులకు సిద్ధంగా ఉంది. చైనా తైవాన్ ఆక్రమణకు సంసిద్ధంగా ఉంది. బంగ్లాదేశ్,పాకిస్తాన్ లు భారత్ ను లక్ష్యంగా చేసుకుని పావులు కదుపుతుంటే, రష్యా- ఉక్రెయిన్ల మధ్య నాలుగు సంవత్సరాలుగా నిరంతర యుద్ధం జరుగుతున్నది. డోనాల్డ్ ట్రంప్ తనకు తానుగా శాంతి దూతగా వర్ణించు కుంటూ, ఎనిమిది యుద్ధాలను ఆపగలిగానని ప్రగల్భాలు పలుకుతూ, మరో వైపు ఇరాన్ అస్థిత్వాన్ని ప్రశ్నిస్తూ, యుద్ధానికి సై అంటున్నాడు. వెనెజువెలా సార్వభౌమత్వాన్ని దెబ్బతీసి తానే ఆ దేశానికి తాత్కాలిక అధ్యక్షుడినంటూ ప్రకటించుకున్న డోనాల్డ్ ట్రంప్ ఇతర దేశాలను కూడా ఇదే విధంగా గుప్పెట్లో పెట్టుకోవాలని కుటిల నీతి ప్రదర్శిస్తున్నాడు. వెనిజులా సార్వభౌమత్వాన్ని మంటగలిపిన ట్రంప్ ను ఆ దేశ ప్రతిపక్ష నాయకురాలు మారియా కొరినా మచాడో సమర్ధించడం,నోబెల్ కమిటీ నిర్ణయానికి వ్యతిరేకంగా తనకు దక్కిన నోబెల్ శాంతి బహుమతిని ట్రంప్ కు బహూకరించడం విడ్డూరం. వెనిజులా లో ప్రజాస్వామ్య పునరుద్ధరణకు ప్రయత్నించకుండా అధికార దాహంతో వెనిజులా నాయకులు అధికార పీఠం కోసం ప్రాకులాడడం సిగ్గుచేటు. ఇపటికే వెనెజువెలా తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. ఆర్థిక అంతరాలు విపరీతంగా పెరిగి పోయాయి. కేవలం కొద్దిమంది చేతుల్లోనే సంపదంతా కేంద్రీకృతమైపోయింది. భారీ సంఖ్యలో ప్రజలు పేదరికం తట్టుకోలేక ఇతర దేశాలకు వలస పోతున్నారు. వెనిజులాలో ఇలాంటి అస్తవ్యస్త మైన పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో స్వేచ్ఛగా ఎన్నికలు జరగాలని,పారదర్శకమైన ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడాలని ప్రజలు కోరుకుంటున్న తరుణంలో అమెరికా వెనిజులా అధ్యక్షుడిని నిర్బంధించి న్యూయార్క్ కు తరలించుకుపోవడం వెనిజులా సార్వభౌమత్వాన్ని పరిహసించడం కాదా? నార్కో టెర్రరిజం పేరుతో మదురో పై నిందారోపణలు చేసిన అమెరికాకు అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా అందుకు తగిన విధమైన చర్యలు తీసుకునే అవకాశమున్నా, అందుకు విరుద్ధంగా కారకాస్ పై దాడిచేయడం గతంలో ట్రంప్ పై మదురో చేసిన వ్యాఖ్యలకు ప్రతీకార ధోరణి తీర్చుకున్నట్టుగా ఉంది.వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో పదవీచ్యుతి,నిర్బంధం తర్వాత ప్రపంచ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమైనాయి. అమెరికా దౌర్జన్యాన్ని కొన్ని ప్రపంచ దేశాలు ఖండించాయి. కొన్ని దేశాలు ట్రంప్ కు భయపడి గుంభనంగా ఉండిపోయాయి. అమెరికా శత్రు దేశాలతో సహా, కొన్ని మిత్ర దేశాలు,మరికొన్ని నాటో సభ్య దేశాలు ట్రంప్ తీరును తీవ్రంగా తప్పు బట్టాయి. రష్యా,చైనా,ఇరాన్, ఉత్తర కొరియా వంటి దేశాలు అంతర్జాతీయ చట్టాలకు వ్యతిరేకంగా కారకాస్ పై అమెరికా సాగించిన సాయుధ దుస్సాహసాన్ని ప్రపంచ శాంతికి విఘాతం లా పేర్కొన్నాయి. అమెరికాలోని కొంత మంది విపక్ష సభ్యులతో పాటు, స్వపక్షం లోని నేతలు, అమెరికా ప్రజలు ట్రంప్ ను వ్యతిరేకిస్తూ నిరసనలు తెలిపారు. అయితే ఇంత తతంగం జరుగుతున్నా, వెనెజువెలా అమెరికా గుప్పెట్లోకి జారిపోయినా, తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ సైతం అమెరికా చెప్పుచేతల్లోనే పని చేసి, అమెరికాకు చమురు దోచి పెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నా, వెనిజులా ప్రజలు మాత్రం అమెరికా దాడిని,జరుగుతున్న సంఘటనలను పెద్దగా పట్టించు కోవడం లేదు. పైగా మదురో నిర్బంధం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ వీధుల్లోకి వచ్చి ఆనందం వ్యక్తం చేస్తూ,నియంత పీడ విరగడైనదని ఆనందంతో సంబరాలు జరుపుకున్న తీరు ఆశ్చర్యంగా ఉంది ఎందుకిలా జరుగుతున్నది? అసలు వెనెజువెలా లో ఏం జరిగింది? ఏం జరగబోతున్నది? వెనిజులా ప్రజలు తమ దేశ సార్వభౌమత్వ పరిరక్షణ విషయంలో ఎందుకు మౌనంగా ఉన్నారు? అనే అంశాలపై సునిశిత పరిశీలన చేసి,విశ్లేషణ జరపడం అవసరం.

నిజానికి అపారమైన చమురు నిల్వలు గల వెనెజువెలా అత్యంత సంపన్న దేశంగా ఉండాలి. కాని పరిస్థితులు తద్విరుద్ధంగా ఉన్నాయి.వెనెజువెలా ఆర్థికంగా వెనకబడే ఉంది.కారుచౌకగా చమురు ఎగుమతులు చేయడం వలన ఇతర చమురు సంపన్న దేశాల కంటే,వెనెజువెలా కు చమురు వలన లభించే ఆదాయం పడిపోయింది.కేవలం చమురు మీద ఆధార పడడం, ఇతర రంగాలను నిర్లక్ష్యం చేయడం చమురు ధరలు తగ్గినప్పుడు తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కోవడం వంటి పరిణామాలు అక్కడ జరుగుతున్నాయి. అమెరికా ఆంక్షలు కూడా వెనెజువెలా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసాయి.ఆదాయం తగ్గి,ద్రవ్యోల్బణం తీవ్రస్థాయికి చేరింది.సౌదీ అరేబియా, అమెరికాల కంటే వెనెజువెలా లో అధిక నిరూపిత చమురు నిల్వలు (ప్రోవెన్ ఆయిల్ రిజర్వ్స్) కలిగి ఉన్నా, ఆదాయం మాత్రం అతి తక్కువగానే ఉంది. "రిచ్ ఇన్ ఆయిల్- పూర్ ఇన్ వెల్త్ గా వెనిజులా ఆర్థిక ముఖచిత్రం మారింది. ఒకప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో 10 వ బలమైన ఆర్థిక వ్యవస్థగా బలమైన ఆదాయ వనరులున్న దేశంగా ఎదిగి స్వర్గ ధామంలా విలసిల్లిన వెనిజులా నేడెందుకు దీనంగా మారింది? వెనెజువెలాలో చమురు



వెలికి తీయడం, శుద్ధి చేయడం వంటి ప్రక్రియ ఖరీదైన వ్యవహారం కావడంతో కార్పోరేట్లు ఈ అవకాశం అంది పుచ్చుకుని దేశాభివృద్ధిలో పాలు పంచుకున్నారు. ఇది నచ్చని అప్పటి వెనెజువెలా అధ్యక్షుడు హ్యూగో చావెజ్ చమురు బావులను ప్రైవేటు పెట్టుబడి దారుల నుండి దూరం చేసాడు. పెట్టుబడిదారులను వెళ్ళగొట్టాడు. ప్రజలను ఉచిత పథకాల పేరుతో బిచ్చగాళ్లుగా చేసి, వారిని పని చేయనీయ కుండా సోమరి పోతులుగా మలచి,ఇంటికే పరిమితం చేసి తాను ఆడిందే ఆటగా పాడిందే పాటగా దేశాన్ని ఆర్థికంగా నాశనం చేసి, ప్రజలను ఉచితాలతో మభ్యపెట్టాడు.సుఖాలకు అలవాటు పడ్డ వెనెజువెలా ప్రజలు చావెజ్ ను మెచ్చుకుంటూ, కాలక్షేపం చేసారు. దేశం లో ఉత్పాదక శక్తి క్షీణించి పోయింది. పని చేయడం బద్ధకంగా మారింది. అన్ని రంగాలు క్షీణించాయి. ద్రవ్యోల్బణం పెరిగింది. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయి. ప్రజలు ఆకలితో అలమటించి, పొట్ట చేత పట్టుకుని దేశం వదలిపోయారు. బలమైన ఆర్థిక వ్యవస్థ అప్పుల పాలైనది. పెట్టుబడులు పెట్టేవారు కరువైనారు. చావెజ్ ప్రజల మానసిక దౌర్భల్యాన్ని ఉచిత పథకాలతో మాయ చేసి తనకు అనుకూలంగా మలచుకుని అధికారం చెలాయించాడు. శ్రమ శక్తిని విచ్ఛిన్నం చేసి, శ్రమించడాన్ని తెలివి తక్కువ తనంగా భావించి, ప్రజలను ఉచితాల విందులో తేలియాడించి , దేశాన్ని అధోగతి పాలు చేసాడు. చివరకు అత్యధిక విలువ గల అతి పెద్ద నోటును వెనెజువెలా ప్రభుత్వం ముద్రించింది. తిండి పెట్టలేని కరెన్సీ నోట్ల కట్టలను ప్రజలు చెత్త కుప్పల్లో పడేశారు. చావెజ్ మరణానంతరం నికోలస్ మదురో వెనిజులా అధ్యక్షుడై,నియంతగా మారి,ఎన్నికలను బూటకంగా మార్చి, ప్రతిపక్షాలను అణచి వేసి పాలన సాగించాడు.ఉచితాలను మరిగిన ప్రజలు దేశం దివాళా తీయడంతో గగ్గోలు పెట్టారు. దేశంలో ఆకలి కేకలు మిన్నంటాయి. దాదాపు 80 శాతం మందికి పైగా ప్రజలు ఉపాధి లేక,తిండి లేక బ్రెజిల్,కొలంబియా,అర్జెంటీనా దేశాలకు వలస పోయారు. సంపన్న దేశం పాలకుల అధికార దాహంతో, దూరదృష్టి లేని పాలనతో అడుక్కుతినే పరిస్థితిలోకి నెట్టబడింది. వెనిజులా ఆర్థిక పతనానికి దారితీసిన పాలకుల అనాలోచితమైన ఆర్థిక విధానాల ఘోర వైఫల్యాల ఫలితాన్ని అక్కడి ప్రజలు అనుభవిస్తున్నారు. చైనా బిలియన్ల డాలర్ల కొద్దీ వెనెజువెలా లో పెట్టుబడులు పెట్టింది. వెనెజువెలా తీసుకున్న అప్పులకు బదులుగా చైనా వెనిజులా నుండి కారుచౌకగా చమురు కొనుగోలు చేస్తున్నది. చమురు క్షేత్రాలపైనే కాకుండా, పలు రంగాల్లో చైనా పెట్టుబడులు పెట్టింది.వెనెజువెలా పై అమెరికా జరిపిన దాడి వలన, వెనెజువెలా అమెరికాకు పాదాక్రాంతం కావడం వలన చైనా కు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఏర్పడింది. ఒకప్పుడు వెనిజులా నుండి భారత్ భారీ స్థాయిలో చమురు కొనుగోలు చేసింది. కాని వెనిజులా పై అమెరికా ఆంక్షలు విధించడంతో భారత్ వెనిజులా నుండి చమురు దిగుమతులను తగ్గించుకుంది. మారిన పరిస్థితుల నేపథ్యంలో వెనిజులా భారత్ కు చమురు సరఫరా చేస్తుందా? ఇందుకు అమెరికా అంగీకరిస్తుందా?ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికా ఒత్తిడికి తలొగ్గి రష్యా నుండి భారత్ చమురు కొనుగోళ్ళు తగ్గించుకున్నా, అందుకు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలి.గయానా నుండి భారత్ భారీగా ఆయిల్ దిగుమతులు జరిపే అవకాశముంది. వర్తమాన పరిస్థితుల నేపథ్యంలో వెనెజువెలా గనుక భారత్ కు చమురు సరఫరా చేస్తే భారత్ కు మేలు జరుగుతుంది.మరి రష్యా సంగతేంటి? రష్యాతో గల అవినాభావ సంబంధాన్ని భారత్ తెంచుకోగలదా? అందుకు భారత ప్రజలు అంగీకరిస్తారా? అమెరికా దురహంకారం భారత్ కు సంకటం లా మారింది.భారత్ ఎన్నో ఆటు పోట్లను ఎదుర్కొని అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్న తరుణంలో డోనాల్డ్ ట్రంప్ రూపంలో భారత్ అనేక క్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నది. అమెరికా విధిస్తున్న టారిఫ్ లను తట్టుకుంటూ వేరే మార్గంలో ఆదాయ మార్గాలను అన్వేషిస్తూ, దేశం ఆర్థికంగా ముందుకు సాగడానికి కృషి చేస్తున్నది. ట్రంప్ భారత్ ను "డెడ్ ఎకానమీ" గా అభివర్ణించినా, అమెరికా కంపెనీలు భారత్ లో పెట్టుబడులు పెట్టవద్దని హెచ్చరించినా, భారతీయ విద్యార్థులపై, ఉద్యోగులపై వీసాల భారం మోపుతూ, భారతీయుల ఉద్యోగాలకు ఎసరు పెట్టాలని చూస్తున్నా ఇంతవరకు భారత్ అమెరికాను గాని ట్రంప్ ను గాని పల్లెత్తు మాట అనకుండా, బలవంతునితో వైరం ప్రమాదకరమన్న రీతిలో సహనం పాటించడాన్ని ప్రతిపక్షాలు తప్పుబడుతున్నాయి. ప్రపంచం ఒకప్పటిలా గిరిగీసుకుని కూర్చునే పరిస్థితులు లేవు. ప్రతీ దేశానికి ఇతర దేశాలతో అవసరం ఏర్పడింది. వాణిజ్య,సాంకేతిక రక్షణావసరాలు ప్రపంచ దేశాల మనుగడకు అవసరం. అయితే అమెరికా లో ట్రంప్ పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారింది. తనను వ్యతిరేకిస్తున్న దేశాలతో ఎవరూ సంబంధాలు పెట్టుకోవద్దంటూ ట్రంప్ బెదిరించడం,అందుకు తగ్గట్టుగానే కక్ష సాధింపు చర్యలకు దిగడం వలన భారత్ తో పాటు అనేక దేశాలు ఆందోళన చెందుతున్నాయి. ఈ పరిస్థితులు మారాలని ప్రపంచ దేశాలు ఎదురుచూస్తున్నాయి. వెనిజులా దుస్థితి తమకు రాకూడదని చిన్న చితకా దేశాలు మౌనంగా ఉంటున్నాయి. వెనిజులా విషయంలో అమెరికా ఘోర తప్పిదం చేసిందని అనేక దేశాలు భావిస్తున్నప్పటికీ, బహిరంగంగా ఈ విషయాన్ని చెప్పడానికి భయపడుతున్నాయి. మదురో ను వెంటనే విడుదల చేయాలని రష్యా డిమాండ్ చేసింది. వెనిజులా ను ఆక్రమించాలన్న దురుద్దేశ్యం తమకు లేదని, కేవలం నేరారోపణల పైనే మదురో ను అరెస్టు చేసామని అమెరికా ఒకవైపు చెబుతూనే, వెనెజువెలా చమురును తమ ప్రత్యర్థి దేశాలకు విక్రయించవద్దని,రష్యా చైనా,ఇరాన్,క్యూబా దేశాలను పక్కన బెట్టాలని అమెరికా హుకుం జారీ చేయడం దేనికి సంకేతం? ఒక వైపు వెనెజువెలాపై సాయుధ దాడి చేయడం, మరోవైపు గ్రీన్ లాండ్ ఆక్రమణకు సంసిద్ధం కావడం, క్యూబా,మెక్సికో లను హెచ్చరించడం అమెరికా దురహంకార ఆధిపత్య ధోరణికి దర్పణం పడుతున్నది. ప్రస్తుతం ఇరాన్- అమెరికాల మధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు ఏర్పడ్డాయి. ట్రంప్ ధోరణి మధ్య ప్రాచ్యంలో అశాంతికి పురిగొల్పుతున్నది. ఈ పరిస్థితులనుండి ప్రపంచాన్ని కాపాడేవారెవరు? ట్రంప్ ధోరణి ఇలాగే కొనసాగితే చైనా,రష్యాలతో పాటు మరికొన్ని అమెరికా వ్యతిరేక దేశాలు కూటమిగా ఏర్పడే అవకాశాలున్నాయి. ప్రస్తుత పరిస్థితులు మరో మహా సంగ్రామం వైపు దారితీయవచ్చు. ఈ సారి ప్రపంచ యుద్ధం గనుక సంభవిస్తే అణుబాంబులతో యావత్ భూగోళం భస్మీపటలం కాక తప్పదు.



సుంకవల్లి సత్తిరాజు
(సామాజిక విశ్లేషకులు, మోటివేషనల్ స్పీకర్)
సంగాయగూడెం,తూ. గో.జిల్లా.
మొ : 9704903463

# గెలుపు, ఓటములు సమానంగా స్వీకరించాలి

- సైబర్ నేరాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి
- వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి
- హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ సత్యనారాయణ
- విజయవంతంగా ముగిసిన కేపీఎల్ సీజన్ - 7 టోర్నమెంట్

**యాచారం, జనవరి 16 (జనం సాక్షి) :** ఆటల పోటీల్లో గెలుపు ఓటములు సమానంగా స్వీకరించాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ సత్యనారాయణ అన్నారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యాచారం మండల పరిధిలోని కురుమిద్ద గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నిర్వహించిన కేపీఎల్ సీజన్ - 7 క్రికెట్ టోర్నమెంట్ గురువారం సాయంత్రం విజయవంతంగా ముగిసింది. మొత్తం ఈ టోర్నీలో 8 జట్లు పాల్గొనగా, అందులో పంజాబ్ కింగ్స్ జట్టు విజేతగా నిలవగా, లక్నో జట్టు రన్నరఫ్‌గా నిలిచింది. థర్డ్ ప్రైజ్ చెన్నై సూపర్ కింగ్స్ జట్టు నిలిచింది. ఈ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సభకు హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ... క్రీడాకారులు క్రీడా




స్ఫూర్తిని ప్రదర్శించి పోటీలలో మెరుగైన ప్రతిభను కనబరచాలన్నారు. క్రీడలతో స్నేహభావం, గెలుపు ఓటములను సమానంగా తీసుకోవడం, ఏకాగ్రత పెరుగుతుందని, శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కలుగుతాయని పేర్కొన్నారు. యువత చదువుతో పాటు క్రీడారంగంలో రాణించాలని, క్రీడలతో క్రమశిక్షణ అలవడుతుందని అన్నారు. క్రీడలు ఆడటం వల్ల అనేక రుగ్మతలు తొలగిపోతాయని అన్నారు. క్రీడల వల్ల స్నేహ సంబంధాలు పెరుగుతాయని అన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా యువత డ్రగ్స్, గంజాయి, చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దని సూచించారు. యువత క్రీడలవైపు ఆసక్తి చూపుతూ క్రీడల్లో రాణించి, శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదగాలని ఆకాంక్షించారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. భవిష్యత్తులో కురుమిద్ద గ్రామ రెవెన్యూ ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. త్వరలో ఈ ప్రాంత రూపురేఖలు శరవేగంగా మారనున్నాయని తెలిపారు. అనంతరం గెలుపొందిన మొదటి, ద్వితీయ, తృతీయ జట్లకు మెమోంటోలను, ప్రైజ్ మనీ అందజేశారు. ఈ సందర్భంగా టోర్నీకి సహకరించిన నీలం శ్రీవిద్య శ్రీరాములు, బందే రాజేందర్ రెడ్డి, మూలి కృష్ణ, నేనావత్ శ్రీకాంత్, నీలం శ్రీకాంత్, కళ్లేపల్లి రవీందర్, మహేందర్, రాజు, బైకని శివకుమార్, కె.జాన్, జి.పవన్, శివ, గణపతి, ప్రతి ఒక్కరికీ ఆర్గనైజర్స్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం గ్రామపంచాయతీ పాలకవర్గం క్రీడాకారులకు భోజనాల సదుపాయం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వంశీ, గ్రామ సర్పంచ్ నీలం శ్రీవిద్య శ్రీరాములు, మాజీ ఉప సర్పంచ్ గోపాలి జోసెఫ్, వార్డు సభ్యులు గోపాలి కల్పన మహేందర్, మడ్డి సురేష్, సముద్రాల ప్రవీణ్, నాయకులు నీలం శ్రీకాంత్, కల్లెపల్లి రవీందర్, మహేందర్, టోర్నమెంట్ ఆర్గనైజర్స్ పంది శ్రీను, తాండ్ర కిరణ్, శ్యామ్, కే.సురేష్, శేఖర్, గణేష్, శివ, అరవింద్, మహేందర్, బలరాం, బాబురావు, ప్రసాద్, సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.

## ఆకునూరు గ్రామసభలో సమస్యలపై తీర్మానం



**చేర్యాల, జనవరి 16 (జనంసాక్షి) :** మండలంలోని ఆకునూరు గ్రామంలో నెలకొన్న సమస్యలపై శుక్రవారం సర్పంచ్ కొమ్ము రవి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో పలు సమస్యలపై తీర్మానం చేశారు. వార్డుల వారిగా సమస్యలను వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు గ్రామసభ దృష్టికి తీసుకురావడంతో పరిశీలించి సత్వరమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం, వీధిలైట్లు, త్రాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తామని తెలిపారు. గ్రామపంచాయతీ షెట్టర్లు వేలం పాట నిర్వహిస్తామని, రైతులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లే దారిని వెడల్పు చేయాలని సభ దృష్టికి తీసుకెళ్లగా పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. తదితర సమస్యలపై గ్రామసభలో తీర్మానం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కొయ్యడ సందీప్, ఉప సర్పంచ్ కడారి పల్లవి, వార్డు సభ్యులు నూనె శేఖర్, అందె లక్ష్మి, సూర అనిత, జూపల్లి కార్తీక్ రెడ్డి, తాటికొండ శేఖర్ యాదవ్, ఎండి.హైమద్, భూమని భాస్కర్, గణపురం బాల నరసమ్మ, సుంచు హేమ, మంతపురి భాగ్య, గ్రామ పెద్దలు పందిళ్ళ నర్సయ్య, వెలుగల రఘువీర్, అందే అశోక్, గడిపె బాల నరసయ్య, ఘనపురం అంజయ్య, ముచ్చాల శ్రీనివాస్, అంగన్వాడి టీచర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జి రాంజీ పథకాన్ని రద్దు చేయాల్సిందే..!



**మంథని, జనవరి 16 (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా మంథని మండలం బిట్టుపల్లి గ్రామంలో వరి నాట్లు వేస్తున్న కూలీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం మహాత్మా గాంధీ పేరుతో ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దుచేసి పార్లమెంటు తమకున్న మందబలంతో జి రామ్ జి పేరుతో పథకాన్ని పార్లమెంట్లో ఆమోదించుకున్నారని అన్నారు 60 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం ఇస్తుందని 40 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని ఈ పథకంలో చెప్పారని అన్నారు ఉపాధి పనులను కూలీలతో కాకుండా కాంట్రాక్టర్లకు అప్పజెప్పి యంత్రాల ద్వారా పనులు చేస్తారని ఆన్నారు. దీంతో గ్రామాల్లో కూలీలకు పని దొరికే పరిస్థితి లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ మేట్ రమేష్ తో పాటు కూలీలు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి రేవంత్ రెడ్డి కృషి

- చేవెళ్ల ఎమ్మెల్యే కాల యాదయ్య

**మొయినాబాద్, జనవరి 16 (జనంసాక్షి) :** గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని చేవెళ్ల ఎమ్మెల్యే కాల యాదయ్య అన్నారు. శుక్రవారం మైనా బాద్ మున్సిపల్ పరిధిలోని ఆయా గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మున్సిపల్ కమిషనర్ కాజా మైనది ఆధ్వర్యంలో కలిసి శంకుస్థాపన పనులు ప్రారంభించారు ఈ సందర్భంగా మైనా బాద్ మున్సిపల్ పరిధిలోని ఎనికేపల్లి మృతుజగూడ వరంగల్ మైనా బాద్ అమీర్ గూడ పెద్ద మంగళారం అప్పోజిగూడ చిలుకూరు గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలు సిసి బిటి రోడ్లు మురుగు కాలువలకు ప్రభుత్వ నిధులతో శంకుస్థాపనలు ప్రారంభించి ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ ఆయాంలో అభివృద్ధి సంక్షేమంగా కృషి చేస్తుందని పేర్కొన్నారు రాష్ట్ర లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాలు ఎంతో అభివృద్ధి పథంలో సాగుతున్నాయని పేర్కొన్నారు గడిచిన సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల అధికంగా గెలుపొందారు అని పేర్కొన్నారు అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి ప్రజలు ఆకర్షితులుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అభినందిస్తున్నారని పేర్కొన్నారు అభివృద్ధి సంక్షేమ పథకాలను గ్రామాలలో ఉపయోగించుకొని గ్రామాలను



ఆదర్శవంతంగా అభివృద్ధి చేసుకోవాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ కాజా మొయినాద్దిన్ మున్సిపల్ మేనేజర్ జమీల్ డి ఈ పురుషోత్తం రావు టి పి సి సి కరవర్గ సభ్యులు షాబాద్ దర్శన్ మాజీ జెడ్పిటిసి కాలేజ్ శ్రీకాంత్ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఎన్నికపల్లి అమర్నాథ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద మంగళారం మల్లారెడ్డి. రామకృష్ణ గౌడ్ హనుమంత యాదవ్ సరికొండఅనంతరెడ్డి మునగాల రవీందర్ రెడ్డి సురంగల్ గడ్డం వెంకట్ రెడ్డి జైపాల్ రెడ్డి ఈగ రవీందర్ రెడ్డి హాస్ ల భాస్కర్ చారి. ఎనికె పల్లి శ్రీశైలం యాదవ్ చంద్రయ్య రమేష్ అశోక్ రెడ్డి అధికారులు నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## గృహజ్యోతి పథకం పేద ప్రజలందరికీ వరం లాంటిది



**మోమిన్‌పేట, జనవరి 16 (జనం సాక్షి) :** గృహజ్యోతి పథకం ద్వారా ఎన్నో నిరుపేద కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు తెలంగాణ ప్రాంత ప్రజలు ఎల్లప్పుడూ రుణపడి ఉంటారని వికారాబాద్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ముస్తఫా (టీపు) పేర్కొన్నారు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గృహ జ్యోతి పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని పట్టణ ప్రాంతాల్లోని అనేకమంది పేద ప్రజలు లబ్ధి పొందుతున్నారని ఈ పథకం పట్ల 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం సహకా నిర్ణయమని ఆయన అన్నారు గత ప్రభుత్వాలు పేద ప్రజలను విస్మరించి కాలయాపన చేస్తూ పబ్బం గడిపారని ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి నాయకత్వంలో పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వాటిని పక్కలబందిగా అమలుపరుపున్న ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే దక్కుతుందన్నారు 6 గ్యారంటీ పథకాలతో పాటు అనేక అభివృద్ధి పనులు చేస్తున్న ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు సాధించుకొని కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడం ఖాయమన్నారు.

## అత్తాపూర్‌లో ఎండీఎంఏ డ్రగ్స్ పట్టివేత

- ఇద్దరు నిందితుల అరెస్ట్




**రాజేంద్రనగర్, జనవరి 16 (జనంసాక్షి) :** అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం ఎండీఎంఏ డ్రగ్స్ అక్రమ రవాణా ఘటన వెలుగులోకి వచ్చింది. అత్తాపూర్ ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు సమాచారం మేరకు అత్తాపూర్ ఎస్ఐ కుమారి పి. పార్వతి ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. సులేమాన్ నగర్ నుంచి పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే వైపు వెళ్తున్న ఎరుపు రంగు మారుతీ బ్రెజ్జా కారును నిలిపివేసి తనిఖీ చేయగా, అందులో 7.45 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్ స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఏ2 అన్వర్ హుస్సేన్, ఏ3 బుర్ర సంపత్ అనే ఇద్దరిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి మారుతీ బ్రెజ్జా కారు, మూడు మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ తూకం యంత్రం, మోజో రోలింగ్ పేపర్ బాక్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు గత రెండు నెలలుగా ఎండీఎంఏ డ్రగ్ అమ్మకాలు చేస్తున్నట్టు విచారణలో ఒప్పుకున్నారు. బెంగళూరుకు చెందిన చరణ్ ఏ--1 వద్ద నుంచి డ్రగ్ కొనుగోలు చేసినట్టు వెల్లడించారు. చరణ్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. ఈ మేరకు క్రైం నం.45/2026, ఎన్‌డీపీఎస్ చట్టం సెక్షన్ 8(సి) ఆర్/ డబ్ల్యూ 21, 22బి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## గ్లోబల్-26 ఆర్టిస్ట్స్ టు వాచ్ ప్రచారం

- ఆవిష్కరించిన అమెజాన్ మ్యూజిక్

**ఖైరతాబాద్, జనవరి 16 (జనం సాక్షి) :** గ్లోబల్-26 ఆర్టిస్ట్స్ టు వాచ్ ప్రచారాన్ని ఆవిష్కరించినట్లు అమెజాన్ మ్యూజిక్ గ్లోబల్ హెడ్ పాల్ ఫిర్త్ శుక్రవా రం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పే ర్కొన్నారు ఆయన మాట్లాడుతూ ప్రముఖ కళాకా రులు-2026లో సంగీతాన్ని ఆవిష్కరించుటకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. వీరిలో ప్రపంచ వ్యా ప్తంగా 28 ముఖ్యమైన ప్లేలిస్ట్స్ లో ఉన్న డెస్టిన్ కాన్రాడ్, సెయి వైబ్స్, ఏజెయ్, మార్క్స్ స్టైలర్, ప్రెసి డెంట్, న్యూడాడ్, మియావ్, ఆడం క్లోబి, వెంగా యో, ఫ్రిక్టావో, జాక్ జాన్ కింగ్, క్లో కిషా, జామీ మెక్? డొనాల్డ్, జేడాన్, బెబో డ్యూమాంట్, అషెన్ నుండి ఎనిమిది కొత్త అమెజాన్ మ్యూజిక్ ఒరిజినల్స్ కూడా ఉన్నాయన్నారు. వివిధ దేశాల నుండి వృద్ధి లోకి వస్తున్న గళాలు ఉన్న ఈ సంవత్సరపు ఆర్టి స్ట్స్ టు వాచ్, 'కంట్రీ హీట్స్', 'ప్లాటినో', 'రొటేషన్స్', 'కే-పాప్ నౌ' ఇంకా మరెన్నో ప్లేలిస్ట్స్ తో కలుపుకొని 28 అమెజాన్ మ్యూజిక్ యొక్క ఉత్తమ ప్లేలిస్ట్స్ లో ఉంటుందని తెలిపారు. కళాకారులకు మద్ధతు ఇవ్వడంతో పాటు వారిని తమ కెరీర్ లోని కీలకమై న దశలో సమర్థించడం కోసం తాము ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 49 అసాధారణ కళాకారులను ప్రజల దృష్టికి తీసుకొచ్చి వారికి సహకారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు.

# రోడ్డు భద్రత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి

**మేడ్చల్ మల్కాజిగిరి, జనవరి 16 (జనం సాక్షి) :** రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పది రోజుల 'అరైవ్ అలైవ్ 2026' ప్రచార కార్యక్రమంలో భాగంగా, రోడ్డు భద్రత ప్రమాణాలను ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్, ట్రాఫిక్ ఎస్సై లతో కలిసి అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, వాహన ఫిట్‌నెస్ సర్టిఫికేట్, కాలుష్య నియంత్రణ ధ్రువీకరణ పత్రం, బీమా పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. రోడ్డు నిబంధనల పాటనే ప్రమాదాల నివారణకు ప్రధాన ఆయుధమన్నారు. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ వెంకట రెడ్డి మాట్లాడుతూ, రోడ్డు భద్రతలో పౌరుల ప్రవర్తన మార్పు, అవగాహన కీలకమని అన్నారు. 2025 సంవత్సరంలో దేశవ్యాప్తంగా ఐదు లక్షలకుపైగా రోడ్డు ప్రమాదాలు జరిగాయని, వాటిలో దాదాపు రెండు లక్షల మంది ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సందేహాలను నివృత్తి చేస్తూ 'రహదారి భద్రత ప్రతిజ్ఞ'



చేయించారు. షామీర్పేట్ సీఐ శ్రీనాథ్ మాట్లాడుతూ, హెల్మెట్ పట్టీ సరిగా బిగించుకోకపోవడం, సీటుబెల్ట్ ధరించకపోవడం వంటి చిన్న నిర్లక్ష్యాలు కుటుంబాలకు తీరని నష్టాన్ని కలిగిస్తాయని హెచ్చరించారు. సెల్‌ఫోన్‌తో వాహనం నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, తప్పు దారుల్లో ప్రయాణించడం వల్ల జరిగే ప్రమాదాలను వివరించారు. ట్రాఫిక్ ఎస్సై నవీన్ రెడ్డి మాట్లాడుతూ, వేగ నియంత్రణ, భద్రతా ప్రమాణాలపై ప్రభుత్వ ఉద్యోగులు ముందుండి ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ భారత్ యాత్రలో భాగంగా సుస్థిర అభివృద్ధికి చక్రాలపై వినూత్న కార్యక్రమం



**మేడ్చల్ మల్కాజిగిరి, జనవరి 16 (జనం సాక్షి) :** స్వచ్ఛ భారత్ యాత్రలో భాగంగా తెలంగాణ ప్రభుత్వ సహకారంతో స్విట్చెకో సంస్థ నిర్వహిస్తున్న సుస్థిర అభివృద్ధి కార్యక్రమాలను మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి పరిశీలించారు. జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియతో కలిసి స్విట్చెకో సంచార వాహన పనితీరును ఆయన పరిశీలించారు. జనవరి 11 నుంచి ఫిబ్రవరి 15, 2026 వరకు కొనసాగనున్న ఈ స్వచ్ఛ భారత్ యాత్రలో భాగంగా వికేంద్రీకృత వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన వినూత్న సాంకేతికతను ఈ సంచార వాహనం ద్వారా ప్రదర్శిస్తున్నారు. ప్లాస్టిక్ బాటిళ్ల కుదింపునకు ఉపయోగించే బెయిలింగ్ యంత్రం, సానిటరీ న్యాప్కిన్‌లను నిర్వీర్యం చేసే ఇన్సినరేటర్, బయో వ్యర్థాలను ఎరువుగా మార్చే కంపోస్టింగ్ విధానం వంటి పర్యావరణ హితమైన ప్రక్రియలను ఈ వాహనంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్విట్చెకో బృందం జిల్లా అధికారులకు, కలెక్టరేట్ సిబ్బందికి వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించగా, అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞను చేయించారు. స్విట్చెకో యాత్రలో భాగంగా ప్రతిరోజూ సుమారు 40 కిలోమీటర్లు ప్రయాణిస్తూ ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తామని, ఈ సంచార వాహనాన్ని ప్లాస్ట్ ఇండియా 2026 అంతర్జాతీయ ప్రదర్శన, సదస్సు, సదస్సు సమ్మేళనంలో ప్రదర్శనకు ఉంచనున్నట్లు స్విట్చెకో బృందం వెల్లడించింది. స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణలో ఇటువంటి కార్యక్రమాలు ప్రజలకు అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తాయని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# చించల్‌పేట్ గ్రామంలో ఎమ్మెల్యే కాలే యాదయ్య అనుచరుల వీరంగం..!!

- ఉప సర్పంచ్ బేగరి రాజుపై దాడి చేసిన ఎమ్మెల్యే అనుచరులు.

**నవాబుపేట్, జనవరి 16 (జనం సాక్షి) :** నవాబుపేట్ మండల పరిధిలోని చించల్ పేట్ గ్రామంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా స్థానిక సంస్థ ఎన్నికల్లో ఎమ్మెల్యే కాలే యాదయ్య ఆధ్వర్యంలో సర్పంచి అభ్యర్థిగా నాంచార్ రవీందర్ రెడ్డినీ రంగంలోకి దింపాడు. రవీందర్ రెడ్డిపై174 ఓట్ల మెజార్టీతో పోటీగా ఉన్నసర్పంచి అభ్యర్థిగా గుడిసె అనసుజా అనంత రాములు భారీ మెజార్టీతో గెలుపు. సొంత గ్రామంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఓటమి కావడంతో ఎమ్మెల్యే కాలే యాదయ్య సర్పంచ్ గా గెలుపొందిన అభ్యర్థి అనుసుజ అనంతరాములు పై పెంచుకున్నాడు ఎమ్మెల్యే యాదయ్య ఆయన అనుచరులు నాంచార్ రవీందర్ రెడ్డి, నరసింహారెడ్డి, రాజిరెడ్డి, మహేందర్ రెడ్డి మునమల్కాపురం మహేందర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ శ్రీధర్ రెడ్డి టీంతో కలిసి ఎమ్మెల్యే కాలే యాదయ్య గురువారం రాత్రి స్థానికంగా గెలుపొందిన ఉప సర్పంచ్ బేగరి బాలరాజుపై దాడి చేశారు. ఉప సర్పంచ్ బేగరి బాలరాజ్ గురువారం సాయంత్రం తన పొలం పనికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా గ్రామంలో గ్రామానికి చెందిన మూలమడ గోపాల్ రెడ్డితో నాంచారి రవీందర్ రెడ్డి గొడవ పడుతుండగా అక్కడికి చేరుకున్న ఉపసర్పంచ్ బాలరాజ్ అక్కడికి చేరుకొని ఎందుకు గొడవ పడుతున్నారని వారిద్దరితో మాట్లాడుతుండగా వెంటనే రవీందర్ రెడ్డి బూతుమాటలతో ఉప సర్పంచ్‌పై దాడి చేశారు. వెంటనే ఉప సర్పంచ్ సర్పంచి సుజాత అనంతరంలకు సమాచారం ఇవ్వగా గ్రామస్తులంతా ఏకమై గొడవకు దారి తీశారు. గొడవ జరుగుతుండగా వెంటనే రవీందర్ రెడ్డి ఎమ్మెల్యే కాలే యాదయ్యకు సమాచారం ఇచ్చారు. ఎమ్మెల్యే కాలే కూడా ఉప సర్పంచ్ పై ఏమి పీకుతావ్ రా లంజా కొడుకా అంటూ బూతు మాటలతో దాడి చేశారు. గ్రామంలో ఉన్న బ్యానర్స్ ఎమ్మెల్యే అనుచరులు చించివేశారు. వెంటనే 2 వర్గాలు ఏర్పడి పెద్దగా గొడవ చేశారు. వెంటనే సర్పంచి,ఉప సర్పంచ్ నవాబుపేట్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సర్పంచ్ ఎలక్షన్లో సొంత గ్రామంలో తను నిలబెట్టిన అభ్యర్థి ఓటమి జీర్ణించుకోలేక ఇవన్నీ చేస్తున్నాడని బాధితులు ఆరోపణతన అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీ బ్యానర్లు చించివేత ఇటీవల జరిగిన సర్పంచ్ ఎలక్షన్లో ఎమ్మెల్యే కాలే యాదయ్య సొంత గ్రామంలో ఆయన నిలబెట్టిన అభ్యర్థి రవీందర్ రెడ్డి పైన అనంతరాములు అనే వ్యక్తి భారీ మెజారిటీతో గెలవడం ఎమ్మెల్యే కాలే యాదయ్య ఇప్పటికి జీర్ణించుకోలేకపోతున్నారు. గెలిచిన వ్యక్తి ఇటీవల చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ భీమ్ భరత్ మరియు మాజీ ఎమ్మెల్సీ యాదిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరాడు. అప్పటినుండి సర్పంచ్ అనంతరాములు మరియు ఉప సర్పంచ్ బేగరి బాల్రాజు మరియు కాంగ్రెస్ పార్టీ కి చెందిన సీనియర్ నాయకులు కార్యకర్తల పైన అనునిత్యం ఏదో ఒక విధంగా రెచ్చగొడుతూ వారితో గొడవ పడుతూ గ్రామంలో ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. సంక్రాంతి పండుగ సందర్భంగా చించ ల్ పేట్ గ్రామంలో సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ బ్యానర్లు వేయించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన అన్ని బ్యానర్లను ఎమ్మెల్యేదగ్గరుండి



చించి వేశారు. ఉప సర్పంచ్ బేగరు రాజుకు ఫోన్ చేసి లంజాకొడకన సంబోధిస్తూ ఇష్టం వచ్చినట్లు పెట్టి ఎక్కడున్నా ఉన్న దగ్గర రావాలని చెప్పేసి పిలిపించుకొని, ఎమ్మెల్యే మరియు ఆయన అనుచరులు అందరు కలిసి ఉప సర్పంచ్ రాజు పైన అదే విధంగా సర్పంచ్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకుల పైన దాడి చేయడం చేశారు. ఎమ్మెల్యే స్థాయి వ్యక్తీ ఇలాంటి చిల్లర పనులు చేయడం చాలా సిగ్గు చేటు అని సర్పంచ్ మరియు ఉప సర్పంచ్ గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. ఉప సర్పంచ్ బాలరాజ్ పై దాడి చేసిన రవీందర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, ఎండి గౌస్ లపై శుక్రవారంనవాబుపేట్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఎస్సై పుండ్లిక్ ను వివరణ కోరగా చంచల్పేట్ గ్రామానికి వెళ్లి పంచాయతీ కార్యాలయంలో సీసీ కెమెరా ఫుటేజ్ ద్వారా పరిశీలన చేసి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్సై పుండ్లిక్ తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
17 జనవరి 2026

# ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

- జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు



**మెదక్ జిల్లా బ్యూరో, జనవరి 16 (జనం సాక్షి) :** ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి... నిబంధనలు అతిక్రమిస్తే ఫైన్ తో పాటు లైసెన్సు రద్దుకు చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు శుక్రవారం ఎరైవ్ అలైవ్ రోడ్డు భద్రతా కార్యక్రమంలో భాగంగా హెల్మెట్ వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు "నో హెల్మెట్ -- నో ఎంట్రీ " కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందేనని స్పష్టం చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చే సిబ్బంది, ప్రజలు హెల్మెట్ ధరించకుండా వస్తే కార్యాలయ ప్రాంగణంలోకి అనుమతి ఉండదని తెలిపారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్‌లకు ద్విచక్ర వాహనాలపై వచ్చే వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆదేశించారు. ఈ నిబంధనను కఠినంగా అమలు చేస్తామని పేర్కొన్నారు. హెల్మెట్ ధరించకపోవడం, రాంగ్ రూట్‌లో వాహనం నడపడం వంటి ట్రాఫిక్ ఉల్లంఘనలు ప్రాణాలకు ప్రమాదకరమని జిల్లా ఎస్పీ తెలిపారు. ఇటువంటి నిబంధనల ఉల్లంఘనపై ఎలాంటి ఊపేక్ష లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొదటి సారి పట్టుబడితే ఫైన్ విధిస్తామని, అదే తప్పిదాన్ని మరోసారి చేస్తే కేసును మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కు రాసి డ్రైవింగ్ లైసెన్స్‌ను రద్దు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల్లో అనవసరంగా ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితిని నివారించాలంటే ప్రజల సహకారం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. హెల్మెట్ ధరించడం చట్టపరమైన బాధ్యత మాత్రమే కాకుండా, మన జీవితాన్ని రక్షించే ముఖ్యమైన భద్రతని ప్రజలు గుర్తించాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించినప్పుడే ఎరైవ్ అలైవ్ లక్ష్యం సాకారం అవుతుందని తెలిపారు. చివరగా జిల్లా ఎస్పీ సిబ్బందితో కలిసి నేను భారతదేశ పౌరుడిగా, మోటారు వాహనాల చట్టంలో పొందుపరచిన రోడ్డు నియమ నిబంధనలను పాటిస్తానని, ఇతరుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని తోటి రోడ్డు వినియోగదారులను గౌరవిస్తానని, రోడ్డు ప్రమాదాలు జరగకుండా నా కర్తవ్యాలను శ్రద్ధతో, అంతఃకరణశుద్ధితో నిర్వహిస్తానని, రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ట్రాఫిక్ నియమాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉల్లంఘించనని, ప్రజలందరూ మన రోడ్లపై సురక్షితంగా ప్రయాణం చేయడానికి నా వంతు సహకారం అందిస్తానని దృఢసంకల్పంగా ప్రమాణం చేస్తున్నాను అని రహదారి భద్రతా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ అదనపు ఎస్పీ ఎస్ మహేందర్, ఏఆర్ డియస్పి రంగా నాయక్, సీఐ లు సందీప్ రెడ్డి, కృష్ణ మూర్తి, ఎసై లు, పోలీస్ కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వెంకటలక్ష్మమ్మ-భూలక్ష్మమ్మ జాతరలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ప్రత్యేక పూజలు



**సంగారెడ్డి టౌన్/కంది, జనవరి 16 (జనం సాక్షి) :** కంది మండలంలోని జుల్కల్ గ్రామంలో వెంకటలక్ష్మమ్మ, భూలక్ష్మమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ భక్తిశ్రద్ధలతో పాల్గొని ప్రత్యేక పూజలు శుక్రవారం నిర్వహించారు. జాతర లో భక్తులతో కిక్కిరిసిపోగా, ఎమ్మెల్యే అమ్మవార్లకు మొక్కులు చెల్లించి దీవెనలు కోరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భక్తులతో కలిసి సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. జాతర నిర్వాహకులు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ని ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, అమ్మవారి దీవెనలు అందరిపై ఉండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని, ఎలాంటి కష్టాలు తలెత్తకుండా అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సి డి సి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ జడ్పీటీసీ కొండల్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభాకర్, శివరాజ్ పాటేల్, ఆర్ వెంకటేశ్వర్లు, జీవి శ్రీనివాస్, విఠల్, విష్ణు, సర్పంచ్ లు జుబేర్, భూమయ్య, పి ఏ సి ఎస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ హైదర్ తదితరులు ఉన్నారు.

## బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలి



**మక్తల్, డిసెంబర్ 16 (జనంసాక్షి) :** బంగ్లాదేశ్ లో హిందువులపై దాడులు చేస్తూ, చిత్ర హింసలు పెడుతున్నారని ధర్మ జాగరణ సమితి జిల్లా నాయకులు దొరోల్ల కృష్ణయ్య బిజ్వార్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడి ప్రభుత్వం సంబంధిత అధికారులు హిందువులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. గత నెల రోజులలో 15 మంది హిందువులను రకరాలుగా హత్యలు చేశారని తెలిపారు. మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతున్నారని అన్నారు. హిందూ ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ లపై దాడులు చేస్తూ బలవంతంగా ఖాళీ కాగితాలపై ప్రభుత్వ ఉద్యోగాలకు రాజీనామా పత్రాలు వ్రాయించుకంటున్నారని విచారం వ్యక్తం చేశారు. హిందూ ఉద్యోగుల ఇళ్లకు నిప్పు పెడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఈ దాడులను,హత్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని అన్నారు.హిందువులను హత్య చేసిన వారిని,హిందువులపై దాడులు చేసిన వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని అన్నారు. ఈ సమావేశంలో 6వ వార్డు సభ్యులు యన్.రాఘవేంద్ర, హెచ్.నర్సింహా, వాకిటి శివ కుమార్ పాల్గొన్నారు.

# అడిషనల్ ఎస్పీ 37 ఏళ్ల పోలీస్ సేవా ప్రస్థానం

**మెదక్ జిల్లా బ్యూరో, జనవరి 16 (జనం సాక్షి) :** అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ 37 ఏళ్ల పోలీస్ సేవా ప్రస్థానానికి పలువురు అభినందనలు తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు తో పాటు పోలీస్ సిబ్బంది కేకు కట్ చేశారు. అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ 1989లో పోలీస్ శాఖలో చేరి 37 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.పోలీస్ శాఖలో సుదీర్ఘ కాలం పాటు నిర్విరామంగా సేవలందిస్తూ, క్రమశిక్షణ, నిబద్ధత, ప్రజాసేవలో ఆదర్శంగా నిలిచిన అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ సేవలను జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు కొనియాడారు. పోలీస్ శాఖ అభివృద్ధి, ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణలో ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా సిబ్బంది అదనపు ఎస్పీతో కేక్ కట్ చేసి, ఆయన సేవా ప్రయాణానికి అభినందనలు తెలిపారు. జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు మాట్లాడుతూ, అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ 37 సంవత్సరాల పాటు పోలీస్ శాఖకు అంకితభావంతో, నిబద్ధతతో సేవలందించడం ప్రశంసనీయమని అన్నారు. క్రమశిక్షణ, విధినిబద్ధత, ప్రజాసేవలో ఆయన చూపిన నాయకత్వం పోలీస్ శాఖకు ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. అలాగే, యువ పోలీస్ అధికారులకు ఆయన సేవా ప్రయాణం ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు. అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ తన సేవా ప్రయాణంలో తనకు సహకరించిన ఉన్నతాధికారులు, సహోద్యోగులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. పోలీస్ శాఖలో పని చేయడం తనకు గర్వకారణమని,



ప్రజల సేవే లక్ష్యంగా భవిష్యత్తులోనూ అంకితభావంతో విధులు నిర్వహిస్తానని పేర్కొన్నారు.

## మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**మహబూబ్‌నగర్ టౌన్, జనవరి 16 (జనం సాక్షి) :** మహబూబ్‌నగర్ నగరంలోని కిద్వాయిపేట, 47వ వార్డులో ముడా నిధులు రూ.10 లక్షలు వెచ్చించి మహిళాసంఘం భవనంలో మిగిలిన పనులు పూర్తి చేయగా, ఆ భవనాన్ని గౌరవ మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళాసంఘాల సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇలాంటి భవనాలు ఎంతో దోహదపడతాయని, మహిళాసంఘాల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని, మహిళల సాధికారతకు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ గోవింద్, నాయకులు చిన్న రాజు, బాసిత్, చంద్రమౌళి, ఖాజా, పార్టీ నాయకులు, మహిళాసంఘాల సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## ఊర్కొండను కల్వకుర్తి రెవెన్యూ డివిజన్‌లోనే కొనసాగించాలి

- 7వ రోజుకు చేరిన జేఏసీ నిరహార దీక్ష



**ఊర్కొండ, జనవరి 16 (జనం సాక్షి) :** ఊరుకొండ మండలాన్ని కల్వకుర్తి రెవిన్యూ రెవిన్యూ డివిజన్లోని ఉంచాలని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి అసెంబ్లీలో మాట్లాడిన మాటలు వినికి తీసుకోవాలని మండల కేంద్రంలో జాతీయ రహదారిపై జేఏసీఆధ్వర్యంలో చేస్తున్న నిరాహార దీక్ష ఏడవ రోజుకు చేరింది. మండలంలో ఉన్న ప్రజలు తాజా మాజీ ప్రజాప్రతినిధులు తెలంగాణ ఉద్యమకారులు ఈ ఉద్యమంలో కలిసి రావాలని బిజెపి ఓబీసీ జిల్లా అధ్యక్షులు వాగుల్ దాస్ నిరంజన్ గౌడ్ తెలిపారు. శుక్రవారం 7వ రోజుకు రిలే నిరాహార దీక్ష చేరుకున్న సందర్భంగా నోటికి గుడ్డలు కట్టుకుని మౌనంగా దీక్షా చేపట్టారు .ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ లోనే ఊరుకొండ మండలం ఉండాలని, కల్వకుర్తి తాలూకాను జిల్లాగా ఏర్పాటు చేయాలని మాట్లాడడం జరిగింది . దీనిపైన జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా మాట్లాడిన మాటలను వాపస్ తీసుకోవాలని మాట్లాడడం జరిగింది. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఇంకా తీవ్రతరం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి తాలూకా జేఏసీ చైర్మన్ కానుగుల జంగయ్య, తాడెం చిన్న, బోల్గాం నరేందర్ గౌడ్, బుడుమ జంగయ్య , బక్క మన్యం, పయ్యావుల జంగయ్య, బండారి శివుడు, తిరుపత్ రెడ్డి,డాన్ శివ, కటికం ఆనంద్ గౌడ్, రాజునారంరెడ్డి పాల్గొన్నారు.

## న్యాయబద్ధంగా రావలసిన రిజర్వేషన్లను దళితులకు కల్పించాలి

**మహబూబ్‌నగర్ టౌన్, జనవరి 16 (జనం సాక్షి) :** మహబూబ్నగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో జరిగిన ఎస్సీ రిజర్వేషన్ ప్రక్రియ పూర్తిగా ఎస్సీలను చెందాల్సిన రిజర్వేషన్ ప్రక్రియను అన్యాయం జరిగింది ఈ విషయాన్ని మంత్రివర్యులు జిల్లా ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో మారువల్ల సాయిబాబా రిజర్వేషన్ల ప్రక్రియలో మున్సిపల్ కమీషనర్ నిర్లక్ష్య ప్రక్రియ వల్లనే 60 డివిజన్ల గాను ఎస్సీ రిజర్వేషన్ ప్రకారము 9 రావాలి కానీ గతంలో 49 వాళ్లు ఉన్న రిజర్వేషన్లు ఆరు ఇవ్వాలి కానీ నాలుగు రిజర్వేషన్ చేయడం జరిగింది ఇప్పుడు 60 డివిజన్లకు 9 కావాలి కానీ ఉన్న నాలుగులో ఒకటి తగ్గించి మూడు చేయడం జరిగింది ఇది పూర్తిగా దళితుల పట్ల వివక్షతను చూపించినట్లుగా కమిషనర్ చర్యలు ఉన్నాయి కావున ఈ ప్రక్రియను పునరాలోచానా చేసి చేసి న్యాయబద్ధంగా రావలసిన రిజర్వేషన్లను దళితులకు కల్పించాలని విన్నపించడం జరిగింది మరుగాళ్ల సాయిబాబా ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మరియు కిషన్ నాయక్‌గా తదితరులు పాల్గొన్నారు.



# అరైవ్ అలైమతో రోడ్డు ప్రమాదాల నివారణ

- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

**మెదక్ జిల్లా బ్యూరో, జనవరి 16 (జనం సాక్షి) :** అరైవ్ అలైవ్ నినాదం రక్షణాత్మకంగా డ్రైవ్ చేయడానికి అర్థమని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణి హాల్ నందు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో, అరైవ్ అలైవ్ కార్యక్రమం రోడ్డు ప్రమాదాల నివారణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. అదనపు ఎస్పీ మహేందర్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ విజయలక్ష్మి, మెదక్, నర్సాపూర్, తూప్రాన్ ఆర్డీవోలు రమాదేవి, మహిపాల్ రెడ్డి, జై చంద్రారెడ్డి, రూరల్ సీ.ఐ జార్జ్ తో కలిసి అదనపు కలెక్టర్ నగేష్ పాల్గొన్నారు. కలెక్టరేట్ కార్యాలయ అధికారులు ఉద్యోగులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించిన 'అరైవ్ అలైవ్ కార్యక్రమం రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా తీసుకున్న ముఖ్యమైన చర్యగా పేర్కొన్నారు. అరైవ్ అలైవ్' రోడ్డు ప్రమాదాల నివారణపై కలెక్టరేట్ కార్యాలయ ఉద్యోగులు అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ నిబంధనలు ఉద్యోగులు పాటిస్తూ మరొకరికి ప్రచారం చేస్తూ స్ఫూర్తిగా నిలవాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి వి రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలని చెప్పారు. ప్రజా సహకారం రోడ్డు భద్రతలో కీలకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్ మాట్లాడుతూ అరైవ్ – అలైవ్ కార్యక్రమాన్ని ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తికి చేరవేసి ప్రమాదరహిత జిల్లాగా నిర్మించేందుకు పోలీసులు



కట్టుబడి ఉన్నారని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ భద్రతా నియమాలను పాటిస్తే ప్రమాదాలు తగ్గుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు దేహదారుఢ్యానికి దోహదపడతాయి



**సదాశివపేట, జనవరి 16 (జనం సాక్షి) :** క్రీడలు దేహ దారుఢ్యానికి దోహదపడతాయని సర్పంచ్ షాబుద్దీన్ పేర్కొన్నారు. శుక్రవారం సదాశివపేట మండలంలోని మెలిగిరి పేట గ్రామంలో సంక్రాంతి సందర్భంగా మెలిగిరి పేట్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ షాబుద్దీన్ మాట్లాడుతూ.. క్రీడా స్ఫూర్తితో పోటీలను నిర్వహించడం అభినందనీయం అన్నారు. క్రీడలతోనే దేహదారుఢ్యం, మానసిక ఉల్లాసం సాధ్యమవుతుందన్నారు. గ్రామాలలో యువకుల నైపుణ్యాన్ని వెలికి తీయడానికి ఇలాంటి పోటీలు ఉపయోగపడతాయని అన్నారు. పోటీల్లో ఆరు జట్లు తలపడగా, ఫైనల్లో ప్రశాంత్ రెడ్డి జట్టు, నిజాముద్దీన్ జట్టు పోటీ పడగా, ప్రశాంత్ రెడ్డి జట్టు గెలుపొందారు. గెలుపొందిన జట్టుకు రూ. 5000 నగదు తో పాటు ట్రోఫీని, రన్నర్ కు మూడు వేల నగదు తో పాటు రన్నర్ ట్రోఫీనీ అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ రామ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మధుకర్ రెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ యాదయ్య, పంచాయతీ కార్యదర్శి రాములు, వార్డ్ మెంబర్లు, ఫ్రెండ్స్ యూత్ సభ్యులు,గ్రామస్థులు, పాల్గొన్నారు.

## పండుగలు...పూర్వీకులు మనకు ఇచ్చిన కానుకలు

- టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



**సంగారెడ్డి టౌన్ జనవరి 16 (జనం సాక్షి) :** సంగారెడ్డి రామ్ నగర్ రామ్ మందిర్ లో జగ్గారెడ్డి ఆధ్వర్యం లో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పండుగ సందర్భంగా తన చిన్ననాటి మిత్రులతో కలిసి పతంగులు ఎగరవేశారు. అనంతరం పాత పాటలకు స్టెప్పులు వేస్తూ సందడి చేశారు. ఉదయం 12 గంటలకు మొదలుకుని సాయంత్రం 5 గంటల వరకు ఈ సంబరాలు కొనసాగాయి. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. పండుగలు మనకు పూర్వీకులు ఇచ్చిన కానుకలని, కష్టాలను, బాధలను మర్చిపోయి పండుగ రోజు అందరూ కుటుంబాలతో సంతోషంగా గడుపుతారన్నారు. సంక్రాంతి పండుగ ను ప్రజలందరూ సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, నాయకులు కూన సంతోష్, కిరణ్, రామ్ మందిర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# బుల్డోజర్ రాజకీయాలు చేయడం సిగ్గుచేటు

- సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు

**సంగారెడ్డి టౌన్, జనవరి 16 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లాలో బుల్డోజర్ రాజకీయాలు చేయడం సిగ్గుచేటని, ప్రజా పాలన అంటూనే దళితులపై బుల్డోజర్ రాజకీయాలు చేయడం ఏంటని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అన్నారు. శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులతో కలిసి పోలీసులు కార్యాలయంలో ఎస్పి ఆర్ఐ రమేష్‌కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ కోహీర్ మండలం సజ్జాపూర్ గ్రామంలో దళితుడు రాములు తమ స్వంత భూమిలో మేము ఇల్లు నిర్మించుకుంటే అక్రమంగా మా ఇంటి నిర్మాణాన్ని కూల్చివేసిన ప్రసాదరెడ్డి అతని అనుచరులను వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. బాధిత దళిత కుటుంబంపై పెట్టిన అక్రమ కేసును ఎత్తివేయాలన్నారు. మొన్న జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఓటు వేయలేదని కక్ష సాధింపు చర్యల్లో బాగంగా ఇలాంటి ఘటనకు పాల్పడటం హేయమైన చర్యగా పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో నిర్మాణం జరుగుతున్న రాములు ఇంటినీ జేసీబీ తో తొలగించారన్నారు. పెత్తందారి వర్గాలకు కొమ్ముకాస్తున్న పంచాయతి కార్యదర్శినీ తక్షణం సస్పెండ్ చేయాలని అన్నారు. తక్షణమే బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని తన స్థలంలోనే ఇంటి నిర్మాణం చేసుకునేందుకు అధికారులు అన్ని రకాల అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి



వర్గ సభ్యులు మానిక్, నాయకులు కృష్ణ, అశోక్, శివ, మహేశ్, కుమార్, బాధితులు రాములు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ రూరల్, జనవరి15 (జనం సాక్షి) :** ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట ఏర్పాట్లను చేసినట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. శుక్రవారం జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన ఉన్నందున గురువారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఎస్పీ జానకి షర్మిల తో కలిసి పొన్కల్ బ్యారేజీ ప్రారంభోత్సవ కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కడ కూడా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా బ్యారేజీ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సంబంధించిన వివరాలన్నింటినీ అధికారులను అడిగి తెలుసుకొని హెలిప్యాడ్‌ను పరిశీలించారు. ఇంకా ఏవైనా పనులు మిగిలి ఉంటే తక్షణమే పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం నిర్మల్ పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తో కలిసి ముఖ్యమంత్రి బహిరంగ సభ నిర్వహణ ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను తనిఖీ చేశారు. వేదిక,మీడియా గ్యాలరీ, తదితర ప్రదేశాలను పరిశీలించారు. అధికారులు సమన్వయంతో పని చేస్తూ తమకు కేటాయించిన బాధ్యతలను నిర్వర్తిస్తూ, బహిరంగ సభను ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి చేయాలని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ పరిశీలనలలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్,ఏఎస్పీలు సాయికిరణ్, రాజేష్ మీనా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ ఆర్డిఓ రత్న కళ్యాణి ప్రజాప్రతినిధులు, అధికారులు,సిబ్బంది తదితరులు ఉన్నారు

# ప్రభుత్వ అదాయానికి గండికొట్టిన 15 మంది నిందితుల అరెస్ట్

- మరో 9 మంది పరారీ
- వివరాలు వెల్లడించిన సిపి సన్‌ప్రీత్ సింగ్



**వరంగల్ బ్యూరో, జనవరి 16 (జనం సాక్షి) :** రాష్ట్రంలో సంచలం సృష్టించిన జనగామ, యాదాద్రి జిల్లాల్లో ధరణి, భూభారతీ రిజిస్ట్రేషన్లలో 3.90కోట్ల రూపాయల కుంభకోణంలో ప్రభుత్వ అదాయానికి గండి కొట్టిన మొత్తం ముఠాలోని 15 మందిని జనగామ పోలీసులు అరెస్టు చేయగా, మరో తొమ్మిది మంది ప్రస్తుతం పరారీలో వున్నారు. ఈ ముఠా సభ్యుల నుండి పోలీసులు స్వాధీనం చేసుకున్నవి 63.19 లక్షల నగదు, బ్యాంక్లో 1లక్ష రూపాయలు, సుమారు ఒక కోటి రూపాయల విలువైన ఆస్తి పత్రాలు, ఒక కారు, రెండు ల్యాప్ టాప్లు, ఐదు డెస్క్ టాప్ కంప్యూటర్లు, 17 సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.పోలీసులు అరెస్టు చేసిన వారిలో: 1.పసునూరి బసవ రాజు, వయసు: 32 సంవత్సరాలు యాదాద్రి జిల్లా. 2. జెల్లా పాండ, వయసు: 46 సంవత్సరాలు, యాదాద్రి జిల్లా.3.మహేశ్వరం గణేష్ కుమార్, వయసు: 39 సంవత్సరాలుఇయాదాద్రి జిల్లా. 4. ఈగజులపాటి శ్రీనాథ్ వయసు: 35 సంవత్సరాలు, జనగామ. 5. యెనగంధుల వెంకటేష్, జనగామ. 6. కోదురి శ్రావణ్ వయసు: 35 సంవత్సరాలు, జనగామ. 7. కొలిపాక సతీష్ కుమార్ వయసు: 36 సంవత్సరాలు, కొడకండ్ల (ఎం), జనగామ. 8. తడూరి రంజిత్ కుమార్ వయసు 39 సంవత్సరాలు, నర్మెట్ట, జనగామ. 9. దుంపల కిషన్ రెడ్డి, వయసు: 29 సంవత్సరాలు, ఆత్మకూర్ (ఎం), యాదాద్రి జిల్లా, 10. దశరథ మేఘావత్ వయసు: 28 సంవత్సరాలుతురుపల్లి. 11. నారా భాను ప్రసాద్, వయసు: 30 సంవత్సరాలు, యాదగిరిగుట్ట, 12. గొపగాను శ్రీనాథ్, వయసు: 32 సంవత్సరాలు, శివ కుమార్, వయస్సు 33, అమంగల్, నల్లగొండ. 15. అలేటి నాగరాజు, వయస్సు 32, యాదాద్రి జిల్లాకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు.యాదాద్రి జిల్లా, 13. ఒగ్గు కర్నాకర్, వయసు: 42 సంవత్సరాలు, యాదాద్రి జిల్లా. 14. కమల్ల ఈ అరెస్టు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ప్రీత్ సింగ్ వివరాలను వెల్లడిస్తూ ఈ కుంభకోణంలో ప్రధాన నిందితులైన పసునూరి బసవరాజు, జెల్లా పాండు ఇరువురు యాదాద్రి-భువనగిరి జిల్లా యాదగిరి గుట్టలో అన్లైన్ సర్వీస్ నిర్వహించేవారు ఇందులో నిందితుల్లో ఒకడైన గణేష్ తనకు తాను అన్లైన్ సెంటర్లతో పరిచయం చేసుకోని చెల్లించాల్సన మొత్తాన్ని ఎన్.ఆర్.ఐ ఖాతా పే చేస్తానని చెప్పి రైతుల నుండి మొత్తం డబ్బులను మీ సేవ వ్యక్తుల ద్వారా వసూలు చేయించి అట్టి వసూలు చేసిన డబ్బు నుండి అన్లైన్ సర్వీస్ వ్యక్తులకు మరియు మద్యవర్తులకు కమిషన్ చొప్పున డబ్బు అందజేస్తూ ఇ చాలాన్ని ప్రధాన నిందితుడుకి పంపిచేవాడు. ఇలా వచ్చిన చలాన్లను బసవరాజు అట్టి ధరణీ/భూభారతీ వెబ్సైట్లో ఇన్స్పెక్ట్ " ఎడిట్ అప్లికేషన్ ఉపయోగించి చాలన్ రుసుము తగ్గించేవాడు. అనంతరం అట్టి ఛలాన్ను మొబైల్ ద్వారా ఎడిట్ చేసి తిరిగి రైతులకు పంపేవాడు.ఇదే క్రమంలో నిందితులు మొబైల్ అప్లికేషన్ను ఉపయోగించి నిందితులు ప్రభుత్వానికి చెల్లించిన రుసుము కు సంబంధించి వెబ్సైట్లో జారీ అయిన రసీదులను చెల్లించాల్సిన దాని కంటే తక్కువగా మార్పు చేసి అనంతరం మార్పు చేసిన రుసుమును మాత్రమే ప్రభుత్వానికి చెల్లించిన నకిలీ చలాన్లను స్థానిక యం.ఆర్.ఓ/ రిజిస్ట్రేషన్ కార్యాలయములో మద్యవర్తుల ద్వారా సమర్పిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొదుతూ మోసాలకు పాల్పడేవారు. ఈ విధంగా ప్రధాన నిందితులు ఇద్దరు సులభంగా డబ్బు సంపాదించడానికి అలవాటు పడి కావున జనగామ, యాదాద్రి జిల్లాల్లో మీ సేవ, ఆన్లైన్ సర్వీసులు, మద్యవర్తుల వద్ద నమోదు కావాల్సిన ధరణీ, భూ భారతి రిజిస్ట్రేషన్ పత్రాలను ప్రధాన నిందితులు తమ వద్దనే వెబ్ సైట్లో నమోదు చేసేవారు. ఇందుగాను ప్రధాన నిందితులు మిగితా వారికి పది శాతం నుండి 30శాతం వరకు కమిషన్ చెల్లించేవారు. ఈ కేసుకు సంబంధించి జనగామ, యాద్రాద్రి జిల్లాల్లో 1,080 పత్రాలకు సంబందించిన లావా దేవిల్లో నిందితులు మోసాలకు పాల్పడ్డారు. అలాగే ఈ రెండు జిల్లాలో జరిగిన ఈ కుంభకోణానికి సంబంధించి 22 కేసులు నమోదు కాబడ్డాయి. ఇందులో జనగామ జిల్లాలో 7కేసులు, యాదాద్రి జిల్లాలో 15 కేసులు నమోదు కాబడ్డాయని వరంగల్ పోలీస్ కమిషనర్ వెల్లడించారు.ఈ ముఠా పట్టుకోవడం ప్రతిభ కనబరిచిన జనగామ డిసిపి రాజమహేంద్ర నాయక్, ఏ. ఎస్పీ పందరి చేతన్. జనగామ ఇన్స్పెక్టర్ సత్యనారయణ రెడ్డి, రఘునాథ్పల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డితో ఇతర ఎస్.ఐలు, సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు.

# చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తాం

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, జనవరి 15 (జనంసాక్షి):** జిల్లాలోని గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా మంచిర్యాల నియోజకవర్గంలోని సాగు భూములలో చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందిస్తామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని దండేపల్లి మండలంలోని తానిమడుగు వద్ద గల గూడెం ఎత్తిపోతల పథకం నుండి మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, నీటిపారుదల శాఖ, ఇతర అధికారులతో కలిసి సాగునీటి పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో గూడెం ఎత్తిపోతల పథకం నుండి సాగు భూముల చివరి ఆయకట్టు వరకు పంట సాగుకు అవసరమైన నీటిని అందించడం జరుగుతుందని తెలిపారు. రైతులకు అవసరం అయిన నీటిని ప్రణాళిక బద్ధంగా విడుదల చేయడం జరుగుతుందని, ఈ నీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో వరి ధాన్యం సాగు సకాలంలో ప్రారంభించాలని, ఆలస్యంగా సాగు చేయడం వలన ఇబ్బందులు ఎదురవుతాయని, సాగుకు అవసరమైన నీటిని సకాలంలో అందిస్తామని తెలిపారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులో 20 టి ఎం సి ల నీరు ఉందని, కార్యచరణ ప్రకారం సాగునీరు, త్రాగునీటికి వినియోగించడం జరుగుతుందని తెలిపారు. మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ మంచిర్యాల నియోజకవర్గ పరిధిలో పంట సాగుకు అవసరమైన సాగునీటిని పూర్తి స్థాయిలో చివరి ఆయకట్టు వరకు అందించేందుకు అవసరమైన ప్రణాళిక రూపొందించడం జరిగిందని తెలిపారు. ఇందులో భాగంగా పైప్ లైన్ల మరమ్మత్తులను చేపట్టి పనులు పూర్తి చేసి సాగునీటి సరఫరాకు అవసరమైన చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు.

# చెన్నూర్ నియోజకవర్గం అభివృద్ధికి కట్టుబడి ఉంటాం

- రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద



**మంచిర్యాల, జనవరి 15 (జనంసాక్షి):** చెన్నూర్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. గురువారం జిల్లాలోని చెన్నూర్ మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, చెన్నూర్ మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ లతో కలిసి శంకుస్థాపనలు చేశారు. రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ చెన్నూర్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని, అతి తక్కువ కాలంలో నియోజకవర్గంలోని అంతర్గత రహదారులు, మురుగు కాలువల అభివృద్ధి చేపట్టడంతో పాటు ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన నిరుపేదలకు పథకం ఫలాలు అందించేందుకు అధికార యంత్రాంగం సమన్వయంతో చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. పేద ప్రజలను గుర్తించి రేషన్ కార్డులు అందించడం జరిగిందని, ప్రజాపంపిణీ వ్యవస్థలో చౌక ధరల దుకాణాల ద్వారా అర్హులైన రేషన్ కార్డుదారులకు ప్రతి నెల సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. అమృత్ పథకంలో ఇంటింటికీ నల్లా కనెక్షన్ ద్వారా నిరంతరం శుద్ధమైన త్రాగునీటిని అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. చెన్నూర్ మున్సిపాలిటీకి 15 కోట్ల రూపాయల నగర అభివృద్ధి నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని, వీటితో పాటు 25 కోట్ల రూపాయల టిఎఫ్ఐడిసి, డి ఎం ఎఫ్ టి, సి ఎస్ ఆర్ నిధుల ద్వారా పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.



# సీఎం రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేయాలి

**నిర్మల్ బ్యూరో, జనవరి 15 (జనంసాక్షి) :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్మల్ జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇన్చార్జి కూచాడి శ్రీహరి రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో గురువారం పర్యటించి కాంగ్రెస్ నాయకులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి హోదాలో మొట్టమొదటిసారి సీఎం రేవంత్ రెడ్డి జిల్లాలో శుక్రవారం పర్యటిస్తున్నారని పేర్కొన్నారు. మామడ మండలం పొన్కల్ గ్రామంలో గోదావరి నదిపై నిర్మించిన సదర్మట్ బ్యారేజ్ ని ప్రారంభిస్తారని తెలిపారు. మధ్యాహ్నం పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో భారీ బహిరంగ సభ ఉంటుందని కాంగ్రెస్ నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు.

# కాలానుగుణ ఫ్లూ వ్యాప్తి

- అప్రమత్తంగా ఉండాలి
- యశోద హాస్పిటల్ వైద్యులు సాయిరెడ్డి




**నిర్మల్ బ్యూరో, జనవరి16 (జనంసాక్షి) :** ఫ్లూ (ఇన్ఫ్లుయెంజా) అనేది వైరస్ వల్ల కలిగే అంటువ్యాధి ప్రముఖ యశోద హాస్పిటల్ వైద్యులు సాయిరెడ్డి తెలిపారు. శుక్రవారం నిర్మల్ జిల్లా కేంద్రంలో స్థానిక ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యంగా శీతాకాలంలో ఈ వ్యాధి ఎక్కువగా వ్యాపిస్తుండటంతో దీనిని కాలానుగుణ (సీజనల్) ఫ్లూ అని పిలుస్తారని. దగ్గు, తుమ్ములు, మాట్లాడేటప్పుడు వెలువడే బిందువుల ద్వారా ఈ వైరస్ వేగంగా వ్యాపిస్తుందని ఆయన తెలిపారు. ఆకస్మికంగా జ్వరం రావడం, గొంతు నొప్పి, తలనొప్పి, పొడి దగ్గు, ముక్కు దిబ్బడ, అలసట, ఆకలి తగ్గుదల వంటి లక్షణాలు ఫ్లూకు ప్రధాన సూచనలు అని పేర్కొన్నారు. సాధారణంగా వైరస్ సోకిన 1 నుంచి 3 రోజుల్లో లక్షణాలు మొదలై, ఒక వారం లోపు తగ్గుముఖం పడతాయని అన్నారు. 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, ఐదు ఏళ్లలోపు చిన్నారులు, గర్భిణీలు, గుండె జబ్బులు, ఆస్మా, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులతో బాధపడేవారు ఫ్లూ బారిన పడితే తీవ్రంగా ప్రభావితమయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని హెచ్చరించారు. ఫ్లూ అనుమానం ఉన్నవారు ఇంటివద్ద విశ్రాంతి తీసుకోవడంతో పాటు ఎక్కువగా నీరు తాగాలని, అవసరమైతే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైద్యుల సూచన మేరకు యాంటీవైరల్ మందులు, జ్వరం తగ్గించే మందులు వాడాలని, చిన్నారుల్లో నీటి లోపం రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఫ్లూ పట్ల నిర్లక్ష్యం చేయకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు.

# వరంగల్‌లో కేంద్ర బృందం పర్యటన

- మొంత తుఫాన్ నష్టం అంచనా వేసి కేంద్ర ప్రభుత్వానికి పంపనున్న బృందం



**వరంగల్ బ్యూరో, జనవరి 16 (జనం సాక్షి) :** జిల్లాలో ఇటీవల సంభవించిన మోంథా తుఫాన్ ప్రభావంతో జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వ బృందం శుక్రవారం వరంగల్ జిల్లా మరియు వరంగల్ నగరంలోని పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించింది. నలుగురు ప్రతినిధులు పొన్ను స్వామి, నిశాంత్ మిశ్రా, శశివర్ధన్, రాహుల్ బఖేటిలతో కూడిన కేంద్ర బృందం, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మరియు జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయిలతో కలిసి వరంగల్ నగరంలోని ఎన్.ఎన్. నగర్, ఎన్టీఆర్ నగర్, మైసయ్య నగర్ తదితర కాలనీల్లో పర్యటించింది. ఈ సందర్భంగా తుఫాన్ ప్రభావంతో నీట మునిగిన నివాస గృహాలు, గృహాలకు జరిగిన నిర్మాణ నష్టం, వాహనాలు, గృహ సామగ్రి నష్టం, నీట మునిగిన ట్రాన్స్‌ఫార్మర్లు, కూలిపోయిన విద్యుత్ స్తంభాలు తదితరాలను కేంద్ర బృందం పరిశీలించింది. బాధితుల నుంచి నేరుగా సమాచారం సేకరించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంది. అనంతరం వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని చంద్రుగొండ, బొగ్గులకుంట తండా, దీక్షకుంట గ్రామాల్లో పర్యటించిన కేంద్ర బృందం, తుఫాన్ కారణంగా ధ్వంసమైన రోడ్లు, కల్వర్టులు, బ్రిడ్జీలు, నీట మునిగిన వరి పంట, దెబ్బతిన్న పంట పొలాలు, పశువుల నష్టం తదితరాలను క్షుణ్ణంగా పరిశీలించింది. దీక్షకుంట గ్రామంలో కూలిపోయిన ప్రభుత్వ పాఠశాల భవనాన్ని కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు తమ పంటలకు జరిగిన నష్టాన్ని కేంద్ర బృందానికి వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ విజయలక్ష్మి, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ గౌతమ్, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా పశుసంవర్ధక అధికారి బాలరాజు, ఆర్డీఓ సుమా, డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, జిల్లా సంక్షేమ అధికారి, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీర్ ఇజ్జగిరి, జీడబ్ల్యూఎంసీ ఎస్ఈ సత్యనారాయణ, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఇరిగేషన్, రెవెన్యూ, విద్యాశాఖలతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. తుఫాన్ వల్ల జరిగిన నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసి, నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు కేంద్ర బృందం తెలిపింది.

# మల్లికార్జున స్వామి గుడి నిర్మాణానికి కృషి చేస్తా



**గూడూరు, జనవరి 15 (జనంసాక్షి):** మల్లికార్జున స్వామి గుడి నిర్మాణానికి అన్ని విధాలుగా కృషి చేస్తానని మానుకోట ఎమ్మెల్యే మురళీ నాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మచ్చర్ల గ్రామంలో ఏడాదికోసారి జరిగే మల్లన్న జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే కు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొట్టెం వసంత కృష్ణ,చిట్టె మండల అధ్యక్షులు వెంకటేశ్వర్లు, అర్రేమ్ వీరాస్వామి,బూడిగే సతీష్ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు, ఆవుల రాములు, కడబోయిన నర్సయ్య,జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన

# మంత్రి ధనసరి అనసూయ సీతక్క



**ములుగు బ్యూరో,జనవరి16(జనం సాక్షి):** ఈ నెల 18వ తేదీన రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మేడారం పర్యటన ఏర్పాట్లను శుక్రవారం సాయంత్రం రాష్ట్ర పంచాయతీ రాజ్,గ్రామీణాభివృద్ధి,గ్రామీణ నీటి సరఫరా, మహిళా,శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క,జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్,ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ లతో కలిసి పరిశీలించారు.ముఖ్య అతిథుల కోసం ఏర్పాటు చేస్తున్న హెలిపాడ్ స్థలాన్ని, టెంట్ సిటీ,సాంస్కృతిక కార్యక్రమాల సభ ప్రాంగణాన్ని, క్యూ లైన్స్ షెడ్స్, మీడియా టవర్ నిర్మాణాలను, ప్రధాన ఆర్చి ఫ్లోరింగ్ పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క అధికారులతో మాట్లాడుతూ ముఖ్య మంత్రి పర్యటన సందర్భంగా అన్ని ఏర్పాట్లు శనివారం సాయంత్రం లోపు పూర్తి చేయాలని ఆదేశించారు.సభ ప్రాంగణ పరిసరాలలో రాతి నిర్మాణాల వ్యర్థాలను వెంటనే తొలగించాలని రహదారుల వెంట భక్తులకు తాగునీరు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు,ఆర్డిఓ వెంకటేష్, డీఎస్పీ రవీందర్ అధికారులు, పాల్గొన్నారు.

# కొత్తకొండ వీరభద్ర స్వామి ఆలయానికి రూ.70 కోట్ల హామీ

- మంత్రి కొండా సురేఖ
- రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి
- భద్రకాళి-బాసర వరకు ఆలయాల అభివృద్ధికి చర్యలు : మంత్రి కొండా సురేఖ



**భీమదేవరపల్లి, జనవరి 16 (జనం సాక్షి) :** రాష్ట్రంలోని అన్ని ప్రముఖ ఆలయాలను ప్రభుత్వం సమగ్రంగా అభివృద్ధి చేస్తోందని రాష్ట్ర పర్యావరణ, అటవీ,దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో గురువారం మంత్రి కొండా సురేఖ,రాష్ట్ర రవాణా--బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ,ఉత్తర తెలంగాణలో ప్రసిద్ధి చెందిన కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు వచ్చే బడ్జెట్లో రూ.70 కోట్ల నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు.ఆలయ అభివృద్ధికి సంబంధించి మాస్టర్ ప్లాన్‌తో పాటు అన్ని అనుమతులు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో పనులు ప్రారంభిస్తామన్నారు. కోర మీసాల వీరభద్ర స్వామిగా ప్రసిద్ధి చెందిన ఈ ఆలయానికి ప్రతి సంవత్సరం లక్షలాది భక్తులు తరలివస్తారని తెలిపారు.భక్తుల సౌకర్యార్థం వసతి దర్శన ఏర్పాట్లు, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు.జాతరను ప్లాస్టిక్‌రహితంగా నిర్వహించాలని సూచించారు. భద్రకాళి నుంచి బాసర వరకు ఆలయాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తోందని ఇందుకోసం సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు వెల్లడించారు. వేములవాడ భద్రకాళి, సమ్మక్క-సారలమ్మ ఆలయాల అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామి ఆలయం ఉత్తర తెలంగాణ ప్రజల విశ్వాస కేంద్రంగా నిలిచిందన్నారు. దేవాలయ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామాల సునీత, ఆలయ ఈవో కిషన్ రావు,ఆలయ చైర్మన్ బోజ్జపురి అశోక్ ముఖర్జీ, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

# దూ... దూ... బసవన్న...!

- ఇంటింటికి తిప్పుతూ భిక్షాటన చేస్తున్న గంగిరెద్దుల వారు...



**చెన్నారావుపేట, జనవరి 16 ( జనం సాక్షి):** పసిడి పంటల కాంతి సంక్రాంతి... పంటలన్నీ ఇంటా చేరిన వేళ... పల్లెలన్నీ ముసిన హేళ... ఆనందోత్సాహాల నడుమ జరుపుకునే పండుగ ఇది. ఏ పల్లె చూసినా ముత్యాల హరివిల్లులు... హరిదాసు పాటలు, బసవన్నల ఆటలే కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో గురువారం సంక్రాంతి పండుగను పురస్కరించుకొని చెన్నారావుపేట మండల కేంద్రంలో బసవన్నను ఇంటింటికి తిప్పుతూ గంగిరెద్దుల వారు భిక్షాటన చేస్తుండగా 'జనం సాక్షి' క్లిక్ మనిపించింది.

## ప్రజలకు, ప్రభుత్వానికి వారధి జనంసాక్షి

- జనంసాక్షి దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరించిన అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ



**గద్వాల టౌన్, జనవరి 16 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ జనంసాక్షి దినపత్రిక నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనంసాక్షి దినపత్రిక ప్రజాదరణ పొందుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలుచుందని అన్నారు.జనంసాక్షి దినపత్రిక నిజాలను నిర్భయంగా అధికారులకు చేరవేయడంలో విశ్వసనీయతతో పనిచేస్తుందని ప్రశంసించారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా నాలుగో స్తంభమని సామాన్య ప్రజల గొంతుకగా నిలిచి జనంసాక్షి దినపత్రిక విలువ కాపాడుతున్నదని పేర్కొన్నారు.భవిష్యత్తులో జనంసాక్షి దినపత్రిక ఇలాగే ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జనంసాక్షి సీనియర్ రిపోర్టర్ పెద్ద ఇస్మాయిల్, టౌన్ రిపోర్టర్ సుదర్శన్ గౌడ్, సీనియర్ రిపోర్టర్ ముకుందరావు, రాజ్ న్యూస్ రిపోర్టర్ తీర్థ చారి, ఓరుగల్లు రిపోర్టర్ రాఘవ గౌడ్, క్యూ5 న్యూస్ రిపోర్టర్ రఫీ,సూర్య రిపోర్టర్ సుధాకర్,శ్రావ్యా రిపోర్టర్ దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

# 18న పాలేరుకు సీఎం రేవంత్ రెడ్డి

- రూ. 362 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం
- చారిత్రక ఘట్టం.. మేడారంలో రాష్ట్ర క్యాబినెట్ భేటీ
- మంత్రి పొంగులేటి

**ఖమ్మం రూరల్, జనవరి 16 (జనం సాక్షి) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాత ఉమ్మడి జిల్లాల పర్యటనలో భాగంగా ఈ నెల 18న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పాలేరు నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. శుక్రవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పర్యటనలో భాగంగా మొత్తం రూ. 362 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని తెలిపారు.

### పాలేరు గడ్డపై అభివృద్ధి పండుగ

మద్దులపల్లిలో జేఎన్టీయూ కళాశాలకు శంకుస్థాపన, నర్సింగ్ కళాశాల ప్రారంభోత్సవం చేయడంతో పాటు.. మున్నేరు-పాలేరు లింక్ కెనాల్ నిర్మాణ పనులను సీఎం ప్రారంభిస్తారు.



అదేవిధంగా మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ ను ప్రారంభిస్తారు. అలాగే కూసుమంచిలో నిర్మించిన 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి తదితరులు పాల్గొంటారని వివరించారు. ఇదే వేదికగా రాబోయే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల సన్నద్ధతపై ఉమ్మడి జిల్లా ముఖ్య కార్యకర్తలతో సీఎం దిశానిర్దేశం చేయనున్నారని పొంగులేటి తెలిపారు.

### తొలిసారిగా హైదరాబాద్ వెలుపల క్యాబినెట్ భేటీ..

రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయేలా ఈ నెల 18న మేడారంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం (క్యాబినెట్ మీటింగ్) నిర్వహించనున్నట్లు పొంగులేటి ప్రకటించారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఎన్నడూ లేని విధంగా హైదరాబాద్ వెలుపల క్యాబినెట్ భేటీ జరగడం ఇదే ప్రథమమని పేర్కొన్నారు. "గత ప్రభుత్వంలా ఎన్నికల వేళ బొమ్మలు చూపడం మా అలవాటు కాదు.. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ పనిచేసే ప్రభుత్వమిది" అని స్పష్టం చేశారు.

### కుంభమేళాకు మించి మేడారం ఏర్పాట్లు

సమ్మక్క-సారలమ్మ జాతరను కుంభమేళా కంటే అద్భుతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని మంత్రి తెలిపారు. మేడారంలో కాకతీయుల నాటి వైభవం ఉట్టిపడేలా నిర్మించిన రాతి కట్టడాలను 19వ తేదీ ఉదయం ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని వెల్లడించారు. అలాగే గడువు ముగిసిన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు త్వరలోనే ఎన్నికలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.ఈ కార్యక్రమం లో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటక శాఖ అవార్డు పొందిన యూనస్ ఫర్హాన్

**దేవరకొండ, జనవరి 16 (జనం సాక్షి) :** తెలంగాణ పర్యాటక శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "100 వీకెండ్ వండర్స్ ఆఫ్ తెలంగాణ - క్యాప్చర్ ది అన్‌సీన్ పోటీలలో దేవరకొండకు చెందిన పరిశోధకులు యూనస్ ఫర్హాన్ విజయం సాధించారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన అంతర్జాతీయ కైట్ ఒ స్వీట్ ఫెస్టివల్ వేదికగా తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మరియు చైర్మన్ వల్లూరు క్రాంతి, ఐఏఎస్ యూనస్ ఫర్హాన్‌కు కానసొలేషన్ విన్నింగ్ ప్రైజ్ లెటర్ మరియు అవార్డు మూమెంటో అందజేసి సత్కరించారు. రాష్ట్రంలోని పది విభిన్న థీమ్స్ ఆధారంగా ఈ పోటీ నిర్వహించబడిందనీ పేర్కొన్నారు. యూనస్ ఫర్హాన్ తన పరిశోధనలో భాగంగా దేవరకొండ కోటను ఎంచుకుని, దానికి సంబంధించిన 3 అద్భుతమైన ఫోటోలు, 60 సెకన్ల వీడియో మరియు పర్యాటకులకు ఉపయోగపడేలా దూరం, రవాణా, బడ్జెట్ మరియు భద్రతతో కూడిన 100 పదాల వివరణను సమర్పించారు. ఆయన చూపిన ప్రతిభకు గాను హెరిటేజ్ కేటగిరీలో కానసొలేషన్ ప్రైజ్ లభించింది.

### దేవరకొండ ప్రజలకు అంకితం



ఈ సందర్భంగా యూనస్ ఫర్హాన్ మాట్లాడుతూ ఈ గౌరవాన్ని తన సొంత ప్రాంతమైన దేవరకొండ ప్రజలకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలోనే దేవరకొండ కోట ప్రాంతంలో మరింత పర్యాటక అభివృద్ధి జరుగుతుందని, ఈ గుర్తింపు ద్వారా పర్యాటకుల సంఖ్య పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## పోలీస్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన ఎస్పీ నరసింహా

**సూర్యాపేట ప్రతినిధి, జనవరి 16 (జనంసాక్షి) :** సిబ్బందిని సమన్వయం చేయడంలో పోలీస్ కంట్రోల్ రూమ్ విధులు ముఖ్యమైనవని జిల్లా ఎస్పీ నరసింహ అన్నారు.జిల్లా పోలీస్ కార్యాలయంలోని పోలీస్ సెంట్రల్ కంట్రోల్ రూమ్, పోలీస్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ల పనితీరును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డయల్ 100, పెట్రో కార్, నైట్ పెట్రోలింగ్, హైవే పెట్రోలింగ్, బ్లూ కోట్స్, బీట్ డ్యూటీలను నిరంతరం పర్యవేక్షణ చేస్తూ అప్రమత్తం చేయాలని సూచించారు.ఎక్కడ ప్రమాదాలు సంభవించిన, సమస్యలు వచ్చిన నేరుగా అధిక సంఖ్యలో డయల్ 100కు ఫిర్యాదులు వస్తున్నాయని, ఫిర్యాదుల పట్ల వేగంగా స్పందించి సిబ్బంది బాధితులకు పోలీస్ సేవలు అందించాలని ఆదేశించారు. కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా జిల్లాలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అనుమానిత కదలికలు గమనిస్తూ సంబంధిత పోలీసు వారికి సమాచారం అందించి, నేరాల నివారణలో కృషి చేయాలని అన్నారు. ప్రతి అంశాన్ని సెంట్రల్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా రాష్ట్రస్థాయిలో పర్యవేక్షణ చేస్తున్నారని, వేగంగా సేవలందించడం ద్వారా జిల్లా పోలీస్ శాఖకు గుర్తింపు వస్తుందని అన్నారు.జిల్లా పోలీస్ కంట్రోల్



సెంటర్ నుండి సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం, సమన్వయం చేస్తూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, పోలీస్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సెంటర్ ఆర్ఎస్ఐ రాజశేఖర్, పోలీస్ కంట్రోల్ రూమ్ ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామీణ బ్యాంకులో చోరీకి యత్నం



**కల్లూరు, జనవరి 16 (జనం సాక్షి) :** కల్లూరు పట్టణంలో నేషనల్ హైవే ప్రధాన రహదారి సమీపాన ఉన్న తెలంగాణ గ్రామీణ బ్యాంకులో గుర్తుతెలియని వ్యక్తి చోరీకి యత్నం చేసిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటనకు సంబంధించి బ్యాంకు మేనేజర్ తన్నీరు కార్తీక్ తెలిపిన వివరాల ప్రకారం గురువారం తెల్లవారుజామున బ్యాంక్ కిటికీ నుంచి ఓ దొంగ లోపలికి ప్రవేశించాడు. బ్యాంకు మొత్తం తిరుగుతూ లాకర్ గది తాళాలు పగలగొట్టి లోపలికి వెళ్ళాడు. బ్యాంకులో ఏ వస్తువు చోరీ కాలేదు. బ్యాంకు లోపలికి ప్రవేశించిన వ్యక్తి తిరిగి బయటకు వెళ్లిపోయాడు. గురువారం సెలవు కావడంతో శుక్రవారం బ్యాంకు తెరిచి చూడగా చోరీయత్నం జరిగినట్టు విషయం అర్థమైంది అన్నారు ఈ విషయంపై కల్లూరు పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఖమ్మం సిసిఎస్, క్లూస్ టీమ్ పోలీసులు వచ్చి సంఘటన జరిగిన బ్యాంకు ను పరిశీలించి వివరాలు సేకరించినట్లు తెలిపారు.

## సురక్షిత ప్రయాణమే లక్ష్యం

**సూర్యాపేట, జనవరి 16 (జనంసాక్షి) :** ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే బాధ్యత కలిగిన ఆర్టీసీ డ్రైవర్లు, సిబ్బంది రోడ్డు భద్రతా నియమాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం అన్నారు.జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని టీజీఎస్ ఆర్టీసీ డిపోలో అరైవ్ అండ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ సాయిరాం మాట్లాడుతూ నిత్యం వందలాది మంది ప్రయాణికులతో ప్రయాణించే డ్రైవర్లు రోడ్డుపై అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అతివేగం, అజాగ్రత్త ప్రాణాల మీదకు తెస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించినప్పుడే ప్రమాదాల నివారణ సాధ్యమని అన్నారు.డ్రైవర్ల చిన్నపాటి తప్పిదం ఎన్నో కుటుంబాల్లో విషాదం నింపుతుందని



అన్నారు.వాహనాలు నడిపేటప్పుడు మొబైల్ ఫోన్లు వాడకూడదని, తగినంత విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.ఆర్టీసీ సిబ్బంది క్రమశిక్షణతో వ్యవహరించి సంస్థకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సీఐ సైదులు నాయక్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


## ఘనంగా శతాధిక వృద్ధురాలి జన్మదిన వేడుకలు



**నేరేడుచర్ల, జనవరి 16 (జనంసాక్షి) :** మున్సిపాల్టీ పరిధిలో రామాపురం చెందిన రావిరాల ముత్తమ్మ 100 వ పుట్టిన రోజు వేడుకలు ఆమె కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ముత్తమ్మ కుటుంబ సభ్యులు కుమారులు, కోడళ్ళు, కుమార్తెలు, మనుమండ్లు, మనవరాళ్ళు, మునిమనవళ్ళు,మునిమనవరాలు,ఇలా మూడు తరాల కుటుంబ సభ్యులు 40 మంది ఒకే చోట కలసి వందో పుట్టిన రోజు వేడుకలు చేశారు.ఆమెతో కేక్ కోయించారు.ఆమె కుటుంబ సభ్యులు ఆనందాన్ని వ్యక్తం చేస్తూ పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొని ముత్తమ్మ తో,ఫోటోలు, స్వీయ చిత్రాలు తీసుకొని సందడిగా గడిపారు.

## దేశ సైనికుల త్యాగాలు వెలకట్టలేనివి

- ఘనంగా ఆర్మీ డే నిర్వహించిన సర్పంచ్ మట్ట యాదమ్మ మట్ట వెంకటయ్య గౌడ్



**వెల్దండ జనవరి 16 ( జనంసాక్షి) :** దేశ రక్షణ ప్రజల సంక్షేమమే కోసం అహర్నిశలు పాటు పడుతున్న దేశ సైనికుల త్యాగాలు వెలకట్టలేనివి సర్పంచ్ మట్ట యాదమ్మ మట్ట వెంకటయ్య గౌడ్ అన్నారు గురువారం నాడు వెల్దండ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణంలో సర్పంచ్ మట్ట యాదమ్మ మట్ట వెంకటయ్య గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా ఆర్మీ డే నిర్వహించారు ఆర్మీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు మట్ట చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతులను కంటికి రెప్పలా రక్షించే సైనికులు చిరస్మరణియమని అన్నారు అనంతరం సైనికుల తల్లితండ్రులను ఘనంగా సన్మానించారు అదేవిధంగా ఆర్మీ సైనికులను కూడా శాలువులతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎర్ర శ్రీను వెల్దండ మాజీ సర్పంచ్ ఎన్నం భూపతిరెడ్డి ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా మనీలా సంజీవ్ కుమార్ యాదవ్ మాజీ సర్పంచ్ చిందం కృష్ణయ్య ఆర్మీ సైనికులు పురుషోత్తం చారి ప్రవీణ్ కుమార్ రెడ్డి మురళి మనోహర్ గౌడ్ శ్రీనివాసులు కోటయ్య గణేష్ విజయ్ జానకి రాము సద్దాం ఈ సందర్భంగా సైనిక సంక్షేమ సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్ ను ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో శశి పాల్ రెడ్డి పుష్పగిరి రావు కొయ్యల పుల్లయ్య మట్ట నిరంజన్ గౌడ్ గుద్దేటి కిష్టాల్ మట్ట మధుసూదన్ గౌడ్ మారేపల్లి శ్రీను రేవెల్లి రాజు ఈదులపల్లి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు

## మున్సిపాలిటీలో ఎన్నికల సెగ

- కరపత్రాల కలకలం
- చికెన్ పంపిణీతో హల్‌చల్




**చండూరు, జనవరి 16 (జనంసాక్షి) :** చండూరు మున్సిపల్ ఎన్నికల వేడి అప్పుడే రాజుకుంది. ఓ వైపు ప్రచార ఆర్భాటాలు, మరోవైపు వివాదాలతో రాజకీయం రసవత్తరంగా మారింది. ఓ ప్రముఖ నాయకుడిని టార్గెట్ చేస్తూ... గుర్తు తెలియని వ్యక్తులు విడుదల చేసిన కరపత్రం స్థానికంగా ప్రకంపనలు సృష్టించింది. రాజకీయంగా ఎదుర్కోలేక ఇలాంటి పిరికిపంద చర్యలకు పాల్పడటంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. దీనిపై పోలీసులు సీరియస్ యాక్షన్ తీసుకునేందుకు రంగంలోకి దిగినట్లు విశ్వసనీయ సమాచారం.3వ వార్డులో ఓ జర్నలిస్టు అనుచరులు ఇంటింటికీ 'చికెన్ణ పంపిణీ చేయడం ఇప్పుడు హాట్ టాపిక్. ఆశావాహులు అప్పుడే ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. మున్సిపల్ చైర్మన్ స్థానం 'బీసీ జనరల్ణకు ఖరారైనట్లు ప్రచారం జరుగుతుండగా... మిగిలిన 10 వార్డుల రిజర్వేషన్లు ఎలా ఉండబోతున్నాయన్నది ఆశావాహుల్లో ఉత్కంఠ రేపుతోంది.

## కరాటే విద్యార్థులతో సీఎం కప్ టార్చ్ ర్యాలీ




**కొండమల్లేపల్లి, జనవరి 16 (జనంసాక్షి) :** ప్రభుత్వం నిర్వహిస్తున్న చీఫ్ మినిస్టర్ కప్ గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు క్రీడాకారులను ప్రోత్సహించడం వారి ప్రతిభను వెలికితీయడం గ్రామీణ క్రీడాకారులలో స్ఫూర్తి నింపి క్రీడల యొక్క ప్రాముఖ్యతను చాటి చెప్పడమే చీఫ్ మినిస్టర్ కప్ లక్ష్యం అని కరాటే మాస్టర్ కొండ్రపల్లి సురేష్ అన్నారు. ఈ నెల 17 నుండి ప్రారంభం అయ్యే సిఎం కప్ ర్యాలీని జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి మహమ్మద్ అక్బర్ అలీతో కలిసి టార్చ్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పట్టణ ప్రజలు క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు అనంతరం అయన మాట్లాడుతూ క్రీడాకారులు, కరాటే స్టూడెంట్స్ అందరూ సీఎం కప్పును విజయవంతం చేయాలని కోరారు.

## చెంగిచర్లలో అర్ధరాత్రి దొంగల ముఠా హల్‌చల్

- రెండు కాలనీల్లో 8 ఇళ్లలో చోరీలకు పాల్పడ్డ దొంగలు

**బోడుప్పల్, జనవరి 16 (జనంసాక్షి) :** నగర శివారులోని చెంగిచర్లలో దొంగల ముఠా కలకలం రేపింది. రెండు కాలనీలో అర్ధరాత్రి కత్తులతో తిరుగుతూ ఎనమిది ఇళ్లల్లో ఇంటి తాళాలు పగలగొట్టి సుమారు 80 తులాల బంగారు ఆభరణాలు, 3 కేజీ వెండి వస్తువులతో పాటు రూ.2 లక్షల నగదును దోచుకెళ్లారు. ఈ సంఘటన మేడిపల్లి పోలీస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, బాదితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బోడుప్పల్ సర్కిల్ పరిధి చెంగిచర్ల కనకదుర్గకాలనీ, అనుశక్తి కాలనీలలో నివాసం ఉంటున్న బాధితులు కుటుంబసభ్యులతో కలిసి సంక్రాంతి పండుగకు తమ ఊర్లకు వెళ్లారు. అయితే దొంగతనానికి ముందే ఈ కాలనీలో రెక్కీ చేసి గురువారం సంక్రాంతి పండుగ రోజు అర్థరాత్రి దొంగలు కత్తులతో కాలనీలో సంచరిస్తూ తాళం వేసిన ఇండ్లలో పక్క ప్లాన్తో తెల్లవారు జాము వరకు పాల్పడ్డారు. మరుసటి రోజు ఊరినుంచి వచ్చిన బాధితులు వచ్చి చూసే సరికి ఇంటి తాళాలు పగల గొట్టి ఉండడంతో ఆందోళనకు గురై వెంటనే లోపలకి వెళ్లి చూసేసరికి వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. దీంతో 8 ఇళ్లలో సుమారు 30 తులాల బంగారు నగలు, 8 కిలోల వెండి వస్తువులు, రూ. 2లక్షల నగదు కనిపించక పోవడంతో చోరీకి గురైనట్లు తెలుసుకున్న బాధితులు మేడిపల్లి పోలీసులకు సమాచారం అందించారు.. ఈ మేరకు ఘటన స్థలానికి చేరుకున్న ఉప్పల్ జోన్ డీసీపీ సురేష్కుమార్, మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి. మేడిపలి సీఐ గోవిందరెడ్డి చోరి జరిగిన ఇండ్లను సందర్శించి పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ముమ్మరం: చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. చోరీల్లో ఎంత మంది పాల్గొన్నారు అన్న అంశంపై దర్యాప్తు చేస్తున్నామని. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు. తెలివారు.

## పరిశ్రమలకు నిబంధనల మేరకు అనుమతులు జారీ చేయాలి

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట ప్రతినిధి, జనవరి 16 (జనంసాక్షి) :** పరిశ్రమలకు నిబంధనల మేరకు అధికారులు సకాలంలో అనుమతులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ లో జిల్లా పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ, టిజి ఐపాస్ కమిటీ సమావేశంను జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ పరిశ్రమలకు సంబంధించిన అనుమతుల గురించి సమీక్షించారు. 49 పరిశ్రమలకు గాను 119 అప్రూవల్స్ వివిధ శాఖల ద్వారా వచ్చాయని, వాటిని అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులు నిబంధనల మేరకు ఆమోదించాలని కలెక్టర్ సూచించారు. టీ ప్రైడ్ పథకం కింద 143 మంది లబ్ధిదారులకు రాయితీ మంజూరు చేయడం జరిగిందని తెలిపారు.జిల్లాలోని రైసుమిల్లులు, ఫార్మా, సిమెంట్ పరిశ్రమలు భద్రతా నిబంధనలు, తీసుకుంటున్న జాగ్రత్తలపై త్వరలో అధికారులతో యాజమాన్యంతో సమావేశం నిర్వహించాలని



ఆదేశించారు.ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ టి.సీతారాం, కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ బి.యాదగిరి,డిపిఓ కె.యాదగిరి, ఆర్టిఓ జయప్రకాష్ రెడ్డి, ఎస్సీ డెవలప్మెంట్ ఆఫీసర్ దయానంద రాణి, ఎస్టీ డెవలప్మెంట్ ఆఫీసర్ కె.శంకర్ , అధికారులు పాల్గొన్నారు.






## స్మార్ట్‌ఫోన్, టీవీ, ల్యాప్‌టాప్ ధరలకు
# త్వరలో రెక్కలు!

**న్యూఢిల్లీ:**స్మార్ట్‌ఫోన్, టీవీ, ల్యాప్‌టాప్ కొనే ఆలోచన ఉందా? అయితే మీ జేబులో బరువు కాస్త పెంచండి. రాబోయే రెండు నెలల్లో వీటి ధరలు పెరగనున్నాయి. ఇప్పటికే స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్ ధరలు పెరిగాయి. టీవీ బ్రాండ్లు సైతం ధరలు పెంచేందుకు సిద్ధమవుతున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థల నుంచి మెమొరీ చిప్స్‌కు ఎనలేని డిమాండే ఈ పరిస్థితి కారణం. గత త్రైమాసికంలో మెమొరీ చిప్స్ ధరలు ఏకంగా 50 శాతం మేరకు పెరగ్గా.. జనవరి–మార్చి త్రైమాసికంలో మరో 40–50 శాతం పెంపు ఉంటుందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఏప్రిల్–జూన్‌లో మరో 20 శాతం వరకు పెరగొచ్చని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ వెల్లడించింది. ఈ పరిస్థితుల్లో వివో, నథింగ్ వంటి సంస్థలు తమ స్మార్ట్‌ఫోన్ ధరలను రూ.3 నుంచి రూ.5 వేల వరకు పెంచాయి. శాంసంగ్ వంటి కంపెనీలు పరోక్షంగా ఖర్చులు తగ్గించుకోవడానికి క్యాష్‌బ్యాక్‌లు, డిస్కౌంట్లను నిలిపివేశాయి. మెమొరీ ధరలు మరింత పెరిగే అవకాశం ఉండడంతో స్మార్ట్‌ఫోన్ కంపెనీలు ఆ మేరకు ధరల పెంపు చేపట్టొచ్చనే అంచనాలు వెలువడుతున్నాయి. తాము లాంచ్ చేయబోయే మోడళ్ల ధరలను పెంచనున్నట్లు నథింగ్ సీఈఓ కార్ల్ పై ఇప్పటికే స్పష్టంచేశారు. మరిన్ని బ్రాండ్లు ఇదే బాటలో నడవనున్నాయి. నవంబర్ – డిసెంబర్ నెలల్లో స్మార్ట్‌ఫోన్ ధరలు కనిష్ఠంగా 3 శాతం.. గరిష్ఠంగా 21 శాతం మేర పెరిగాయి. రాబోయే రోజుల్లో మరో 30 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని ఆల్ ఇండియా మొబైల్ రిటైలర్స్ అసోసియేషన్ పేర్కొంది. ఒక్క స్మార్ట్‌ఫోన్లే కాదు.. టీవీలదీ అదే పరిస్థితి. తాము ఆర్డర్ చేసే మెమొరీ చిప్స్‌లో కేవలం పదో వంతు మాత్రమే తమకు అందుతున్నాయని కోడక్, థామ్సన్ వంటి బ్రాండ్లపై టీవీలను విక్రయించే సూపర్ ప్లాస్ట్రోనిక్స్ సంస్థ పేర్కొంది. మెమొరీ చిప్స్ కొరతను ఈ పరిస్థితి తెలియజేస్తోంది. ఇప్పటికే టీవీల ధరలు పెంచామని, ఫిబ్రవరిలో మరో 4 శాతం మేర పెంచాలనుకుంటున్నట్లు ఆ కంపెనీ సీఈఓ అవనీత్ సింగ్ 'ఎకనమిక్ టైమ్స్'కు వెల్లడించారు. ల్యాప్‌టాప్ ధరలు ఇప్పటికే 5–8 శాతం మేర పెరగ్గా.. మరింత పెరిగే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

# 800+ సిబిల్ స్కోరు కొందరికే..

## ఎందుకిలా? మనమెలా అందుకోవాలి?

**న్యూఢిల్లీ:**మంచి క్రెడిట్ స్కోరు ఉంటే తక్కువ వడ్డీకే రుణాలు లభిస్తాయి. రుణ దరఖాస్తులు త్వరగా ఆమోదం పొందుతాయి. రుణాల విషయంలో బ్యాంకులు/ఆర్థిక సంస్థలతో వడ్డీ విషయంలో బేరమాడొచ్చు. క్రెడిట్ స్కోరు 800+ ఉంటే దీర్ఘకాలంలో వడ్డీరేట్లపై పెద్దఎత్తున ఆదా చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. కానీ, సిబిల్ స్కోరు 800కు పైబడి ఉన్నవారి సంఖ్య తక్కువే. దీనికి కారణమేంటి? మరి ఈ స్కోరును ఎలా సాధించాలి? చాలామంది సిబిల్ స్కోరు, క్రెడిట్ స్కోరు ఒకటే అనుకొని పొరబడుతుంటారు. వాస్తవానికి క్రెడిట్ స్కోరును జారీ చేయడానికి వివిధ క్రెడిట్ బ్యూరోలు ఉన్నాయి. ఈక్విఫాక్స్, ఎక్స్‌పీరియన్, సీఆర్ఐఎఫ్ హైమార్క్ వంటి సంస్థలు ఆర్‌బీఐ నుంచి లైసెన్సు పొందాయి. ట్రాన్స్‌యూనియన్ సిబిల్ కూడా అందులో ఒకటి. కానీ, బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఎక్కువగా సిబిల్‌నే ప్రామాణికంగా తీసుకుంటాయి. దీంతో క్రెడిట్ స్కోరు అనే పదానికి సిబిల్ ప్రత్యామ్నాయంగా మారింది.

పరిమిత సంఖ్యలోనే..

సిబిల్ స్కోరు రేంజ్ 300 నుంచి 900 వరకు ఉంటుంది. 800 కంటే ఎక్కువ సిబిల్‌స్కోరు ఉన్నవారు ఎక్సలెంట్ కేటగిరీ కిందకు వస్తారు. కానీ, 800, అంతకంటే ఎక్కువ క్రెడిట్ స్కోరు ఉన్నవారు 10–20 శాతం మధ్యే ఉంటారనేది అంచనా. ఎక్కువమంది 700–750, 750–800 రేంజ్‌లో ఉంటారు. పేమెంట్ హిస్టరీ, క్రెడిట్ యుటిలైజేషన్ రేషియో, క్రెడిట్ హిస్టరీ లెంగ్త్ వంటి అంశాలు స్కోరును ప్రభావితం చేస్తాయి. ఇందులో ఏ ఒక్క విషయంలో తప్పటడుగు పడినా 800 స్కోరు చేరుకోవడం కష్టం. దేశంలో ఇప్పటికీ క్రెడిట్ స్కోరు లేనివారు చాలామందే ఉన్నారు. మరోవైపు దీర్ఘకాలంలో క్రెడిట్ హిస్టరీ లేకపోవడం, వ్యక్తిగత కారణాలతో చెల్లింపులు సకాలంలో చేయకపోవడం వంటివి చాలామందిని 800+ స్కోర్‌కు దూరం చేస్తున్నాయి. కేవలం సంపన్నులు, ఆర్థిక




వ్యవహారాలపై అవగాహన ఉన్నవాళ్లు మాత్రమే మెరుగైన క్రెడిట్ స్కోరును సాధిస్తున్నారు.

800 స్కోరు అందుకోలేమా?

ఆన్‌టైమ్ చెల్లింపులు: క్రెడిట్ స్కోరు పెరగాలంటే క్రెడిట్ కార్డు బిల్లులు, ఈఎంఐలు, ఇతర రుణాలను సకాలంలో చెల్లించాలి. క్రెడిట్ స్కోరు గణనలో పేమెంట్ హిస్టరీ ప్రభావం 30 నుంచి 35 శాతంగా ఉంటుందని చెబుతున్నారు ఆర్థిక నిపుణులు. కాబట్టి మెరుగైన క్రెడిట్ స్కోరు కోసం చెల్లింపులు ఆలస్యం కాకుండా చూసుకోవాలి.

క్రెడిట్ యుటిలైజేషన్ రేషియో: మీకున్న రుణ పరిమితిలో ఎంత మేర వాడుకున్నామో తెలిపేదే క్రెడిట్ యుటిలైజేషన్ రేషియో అధిక సీయూఆర్ రేషియో క్రెడిట్ స్కోర్‌ని తగ్గిస్తుంది. కాబట్టి ఎప్పుడూ ఈ రేషియో 30 శాతానికి మించకుండా చూసుకోవాలి. ఇది ఎంత తక్కువ ఉంటే అంత మంచిది. క్రెడిట్ స్కోర్‌లో సీయూఆర్ రేషియో ప్రభావం 25–30 శాతం వరకు ఉంటుంది.

క్రెడిట్ హిస్టరీ: మీ రుణ చరిత్ర, క్రెడిట్ స్కోరు స్థిరంగా కొనసాగాలంటే.. పాత బ్యాంకు ఖాతాలు, క్రెడిట్ కార్డులను నిర్వహించడమే మంచిది. పాత కార్డులను రద్దు చేసుకొనే విషయంలో ఆచితూచి వ్యవహరించండి. క్రెడిట్ స్కోరులో హిస్టరీ ప్రభావం దాదాపు 15 శాతంగా ఉంటుంది.

క్రెడిట్ మిక్స్: రుణాల్లో హామీ లేనివి, హామీతో కూడిన రుణాలుంటాయి. గృహ, వాహన, బంగారం రుణాలు హామీ రుణాలుగా వ్యవహరిస్తారు. వీటిని సురక్షిత రుణాలు అని కూడా పేర్కొంటారు. క్రెడిట్ కార్డు, పర్సనల్ లోన్, స్టూడెంట్ లోన్ వంటివి అసురక్షిత రుణాలుగా పేర్కొంటారు. ఈ రెండు తరహా రుణాలు ఉన్నప్పుడే స్కోరు పెరిగేందుకు వీలవుతుంది. క్రెడిట్ స్కోర్ లెక్కించేటప్పుడు క్రెడిట్ మిక్స్ ప్రభావం 10–15 శాతం ఉంటుంది.

ఎంక్వైరీలు వద్దు: మీరు రుణం కోసం దరఖాస్తు చేసిన ప్రతిసారీ మీ క్రెడిట్ యోగ్యతను చెక్ చేయడానికి రుణ సంస్థ మీ క్రెడిట్ నివేదిక కోసం ఎంక్వైరీ చేస్తుంది. తక్కువ సమయంలో ఎక్కువసార్లు రుణానికి ప్రయత్నిస్తే.. మిమ్మల్ని ఆర్థిక సమస్యలు ఉన్న వ్యక్తిగా, క్రెడిట్ కోసం తాపత్రయం పడే వ్యక్తిగా బ్యాంకులు పరిగణిస్తాయి. కాబట్టి రుణం కోసం అనేక రుణసంస్థల్లో దరఖాస్తు చేయకుండా అన్ని అంశాలను పరిశీలించి ఒకే సంస్థను ఆశ్రయించడం మంచిది.

రుణ సెటిల్‌మెంట్: రుణ సెటిల్‌మెంట్ అంటే... బ్యాంకు రుణ మొత్తంలో కొంత భాగాన్ని తగ్గించి రుణగ్రహీతతో సెటిల్‌మెంట్ చేసుకుంటుంది. రుణంలో కొంత భాగం చెల్లించాల్సిన అవసరం లేదు కాబట్టి, ఇది రుణగ్రహీతకు ఆకర్షణీయంగా కనిపించొచ్చు. కానీ, ఇది మీ క్రెడిట్ స్కోరును తీవ్రంగా దెబ్బతీస్తుంది. ఒకవేళ 800+ క్రెడిట్ స్కోరు సాధించడం మీ లక్ష్యమైతే ఎట్టి పరిస్థితుల్లోనూ సెటిల్‌మెంట్ జోలికెళ్లొద్దు.

చివరిగా: క్రెడిట్ రిపోర్ట్.. ఆర్థిక చరిత్రను ప్రతిబింబించే అద్దం లాంటిది. మీ క్రెడిట్ రిపోర్ట్‌లో పొరపాట్లు, వ్యత్యాసాలు మీకు సంబంధం లేకుండా జరిగినా మీకే ఇబ్బంది. క్రెడిట్ నివేదికలో రుణ మొత్తం, చెల్లింపుల తేదీలు, బకాయి మొత్తం మొదలైనవి ఉంటాయి. ఒకవేళ మీ క్రెడిట్ నివేదికలో లోన్ రీపేమెంట్ వివరాలు సరిగ్గా నమోదు కాకపోతే.. ఇది మీ క్రెడిట్ స్కోరును తగ్గించే అవకాశం ఉంది. కాబట్టి క్రెడిట్ రిపోర్టును క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి.

## బడ్జెట్ డే..
## తెరుచుకోనున్న స్టాక్ ఎక్ఛేంజీలు

ముంబయి: ప్రముఖ స్టాక్ ఎక్స్ఛేంజీలైన బీఎస్ఈ, ఎన్ఎస్ఈ ఫిబ్రవరి 1న తెరుచుకోనున్నాయి. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెడుతున్న నేపథ్యంలో ఆదివారం అయినప్పటికీ ట్రేడింగ నిర్వహించాలని నిర్ణయించాయి. ఈ మేరకు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలు శుక్రవారం వేర్వేరుగా సర్క్యులర్లు విడుదల చేశాయి. బడ్జెట్ రోజున ఎప్పటిలానే మార్కెట్ లైవ్ ట్రేడింగ్ ఉంటుందని, సాధారణ రోజుల మాదిరిగానే ఉదయం 9.15 గంటల నుంచి సాయంత్రం 3.30 గంటల వరకు మార్కెట్ కార్యకలాపాలు జరుగుతాయని పేర్కొంది. ఫిబ్రవరి 1న ఉదయం 11 గంటలకు కేంద్రం బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఆ రోజు ఆదివారం కావడంతో తేదీ మార్పు ఉంటుందని తొలుత ఊహాగానాలు వినిపించాయి. కానీ కేంద్రం మాత్రం అదే రోజు బడ్జెట్ ప్రవేశపెట్టేందుకే మొగ్గు చూపింది. ఆర్థికమంత్రిగా నిర్మలా సీతారామన్ తొమ్మిదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. జనవరి 29న ఆర్థిక సర్వే వెలువడనుంది. ఇప్పటికే బడ్జెట్‌కు సంబంధించిన పనులు ఓ కొలిక్కి వచ్చాయి.

## వాకీ టాకీ విక్రయాలు..

### అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మీషోకు జరిమానా

**ఢిల్లీ:** చట్టవిరుద్ధంగా వాకీ టాకీలను విక్రయిస్తున్న పలు ఈ–కామర్స్ సంస్థలపై కేంద్ర వినియోగదారుల రక్షణ ప్రాధికార సంస్థ సుమోటోగా చర్యలు చేపట్టింది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మీషో సహా పలు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లపై మొత్తంగా రూ.44లక్షల వరకు జరిమానా విధించింది. వినియోగదారుల రక్షణ, టెలికాం చట్టాలను ఉల్లంఘించి పలు ఈ–కామర్స్ సంస్థలు నిబంధనలకు అనుగుణంగా లేని ఉత్పత్తులను లిస్ట్ చేసి విక్రయిస్తున్నట్లు సీసీపీఏ గుర్తించింది. సాధారణంగా 446.0–446.2 ఓఊళి బ్యాండ్‌లోని పర్సనల్ మొబైల్ రేడియోలకు మాత్రమే లైసెన్స్ మినహాయింపు వర్తిస్తుంది. మిగతా వాటి దిగుమతి, విక్రయాల కోసం తప్పనిసరిగా ఎక్విప్‌మెంట్ టైప్ అప్రూవల్ సర్టిఫికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. అంతేగాక, లైసెన్సింగ్ నిబంధనలకు సంబంధించిన వివరాలను కూడా విక్రయదారులు స్పష్టంగా తెలియజేయాలి. అయితే, ఫ్లిప్‌కార్ట్ అమెజాన్ మీషో జియో మార్ట్ తదితర ఈ–కామర్స్ సంస్థలు ఈ నిబంధనలను ఉల్లంఘించినట్లు అఅఖం తెలిపింది. లైసెన్స్ మినహాయింపు ఫ్రీక్వెన్సీ రేంజ్ దాటి ఉన్న వాకీ టాకీలను ఈ కంపెనీలు విక్రయించినట్లు పేర్కొంది. ఇందుకు గానూ మీషో, మెటా, ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ సంస్థలకు రూ.10లక్షల చొప్పున జరిమానా విధించింది. చిమియా, జియో మార్ట్, టాక్ ప్రో, మాస్క్‌మ్యాన్ టాయ్స్ సంస్థలకు రూ.లక్ష చొప్పున ఫైన్ వేసింది. వీటిలో మీషో, మెటా, చిమియా, జియో మార్ట్, టాక్ ప్రో ఇప్పటికే పెనాల్టీలు చెల్లించినట్లు సీసీపీఏ వెల్లడించింది.

**గుడ్ల ధరలు**

హైదరాబాద్ ₹ 5.40 | వరంగల్ ₹ 5.42

**బంగారం ధరలు** (10 గ్రాములు)
హైదరాబాద్
₹ 1,31,450 (22 క్యారెట్లు) | ₹ 1,43,400 (24 క్యారెట్లు)

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 3,06,000



## గ్రోక్‌లో అశ్లీల చిత్రాలు..
### మస్క్ కంపెనీపై 'ఆమె' దావా!

**వాషింగ్టన్:**సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో కృత్రిమ మేధ ఆధారిత 'గ్రోక్' చాట్‌బాట్ అసభ్య చిత్రాలను రూపొందిస్తుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా అమెరికా రచయిత్రి ఆష్లీ సెయింట్ క్లెయిర్ కూడా.. గ్రోక్‌లో తన అసభ్య చిత్రాలను కొందరు యూజర్లు సృష్టించినట్లు ఆరోపించారు. ఈ క్రమంలోనే ఎక్స్ఏఐ పై న్యాయస్థానంలో దావా వేశారు. తన బిడ్డకు ఎలాన్ మస్క్ తండ్రి అని గతంలో ఆష్లీ ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఎక్స్ఏఐలోని గ్రోక్.. అసభ్య చిత్రాలను సృష్టిస్తోందని ఆష్లీ ఆరోపించారు. తన అనుమతి లేకుండా ఇప్పటికే



డజన్లకొద్దీ అసభ్య, అభ్యంతరకర చిత్రాలను సృష్టించిందన్నారు. ఇటీవల ఓ చిత్రాన్ని ఆ సంస్థ దృష్టికి తీసుకెళ్లానని.. ఆ తర్వాత కూడా అనేక ఇమేజ్‌లు దర్శనమిస్తున్నాయన్నారు. దీంతో న్యూయార్క్ న్యాయస్థానంలో దావా వేసిన ఆమె.. సంస్థపై చర్యలు తీసుకోవడంతోపాటు పరిహారాన్ని డిమాండ్ చేసినట్లు సమాచారం. అయితే, దీనిపై ఎక్స్ ఏఐ నుంచి ఇప్పటివరకు ఎటువంటి స్పందన రాలేదు. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌పై ఆష్లీ క్లెయిర్ గతంలో సంచలన ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. తమ ఇద్దరికి పుట్టిన చిన్నారికి తండ్రిగా తన పేరును బయటపెట్టొద్దని మస్క్ తనను కోరినట్లు ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని దాచిపెట్టేందుకు 15 మిలియన్ డాలర్లను మస్క్ ఆఫర్ చేశారని చెప్పారు. మరోవైపు మహిళలు, చిన్నారుల అసభ్య చిత్రాలను గ్రోక్ సృష్టిస్తుందని భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు ఆరోపిస్తున్నాయి. ఇండోనేసియా, మలేసియా దేశాలు ఇప్పటికే గ్రోక్ వినియోగంపై ఆంక్షలు విధించగా.. బ్రిటన్ సహా పలు యూరప్ దేశాల నుంచి తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటోంది. ఈ క్రమంలో దిద్దుబాటు చర్యలు చేపట్టిన ఎక్స్.. 'గ్రోక్' సాయంతో వ్యక్తుల ఫొటోలను ఇబ్బందికరంగా మార్చే అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఇటీవలే వెల్లడించింది.

# ఇరాన్‌పై దాడికి బ్రేక్..

## ట్రంప్ వెనక్కి తగ్గినట్లేనా?

**వాషింగ్టన్:**ఆందోళనకారులను అణచివేస్తోన్న ఇరాన్‌పై సైనిక చర్యకు సిద్ధమైన అమెరికా.. ప్రస్తుతం కాస్త వెనక్కి తగ్గినట్లు కన్పిస్తోంది. టెహ్రాన్‌పై దాడుల ప్రణాళికలను అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చివరి నిమిషంలో రద్దు చేసుకున్నట్లు సమాచారం. ఉద్రిక్తతలు కాస్త సద్దుమణగడంతో ఇరాన్ తమ గగనతలాన్ని తిరిగి తెరిచినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఇటీవల సైనిక చర్యకు ఉపక్రమించిన అమెరికా.. ఇరాన్‌కు దగ్గరలోని ఖతార్‌లో ఉన్న తమ కీలక అల్–ఉదెయిద్ వైమానిక స్థావరంతో పాటు పశ్చిమాసియా వ్యాప్తంగా పలు సైనిక స్థావరాల నుంచి కొంతమంది సిబ్బందిని ఖాళీ చేయించిన సంగతి తెలిసిందే. ఇప్పుడా సిబ్బంది తిరిగి తమ స్థావరాలకు వెళ్లేందుకు అమెరికా అనుమతినిచ్చినట్లు రాయిటర్స్ కథనం వెల్లడించింది. అంతేకాదు.. అల్–ఉదెయిద్‌లో భద్రతా హెచ్చరికల స్థాయిని కూడా తగ్గించినట్లు పేర్కొంది. ప్రస్తుతానికి తాము దాడి చేయాలనుకోవట్లేదని ట్రంప్ హామీ ఇచ్చినట్లు పాకిస్థాన్‌లోని ఇరాన్ రాయబారి ఒకరు మీడియాకు చెప్పారు. మరోవైపు, అమెరికాతో ఉద్రిక్తతల నేపథ్యంలో తమ గగనతలాన్ని మూసివేసిన ఇరాన్.. నిన్న రాత్రి నుంచి మళ్లీ విమాన రాకపోకలకు అనుమతించింది. ఈ పరిణామాలతో టెహ్రాన్‌పై సైనిక చర్యను అమెరికా తాత్కాలికంగా విరమించుకున్నట్లు కన్పిస్తోంది. ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో గత కొన్ని వారాలుగా ఇరాన్‌లో నిరసనకా రులు పెద్దఎత్తున ఆందోళన చేపడుతోన్న సంగతి తెలిసిందే. వీరిని అడ్డుకునే క్రమంలో భద్రతా బలగాలు, ఆందోళనకారుల మధ్య చెలరేగిన ఘర్షణలు హింసా త్మకంగా మారాయి. వేలాది మంది నిరసనకారులు ప్రాణాలు కోల్పోగా.. అనేకమందిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో చాలా మందికి మరణశిక్ష విధించారని, వారికి శిక్ష అమలు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు కూడా వార్తలు వచ్చాయి. ఈ క్రమంలోనే ట్రంప్ స్పందిస్తూ.. నిరసనకారులను అణచివేస్తే తాము రంగంలోకి దిగాల్సి వస్తుందని పలుమార్లు హెచ్చరించారు. ఈ హెచ్చరి కలతో టెహ్రాన్ మరణశిక్షలపై తమ నిర్ణయాన్ని మార్చుకున్నట్లు అమెరికా చెప్పింది.



## ఒక్క వాయిదా పడినా వచ్చేస్తున్నారు

న్యూఢిల్లీ(జనంసాక్షి):ప్రాథమిక హక్కుల పరిరక్షణ కోసం భారత రాజ్యాంగంలో అత్యంత కీలకమైన ఆర్టికల్ 32ను దుర్వినియోగం చేస్తున్నారంటూ సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైకోర్టుల్లో కేసులు పెండింగ్‌లో ఉండగానే, నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించే అలవాటు ఎక్కువవుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విషయంలో స్పష్టమైన హెచ్చరిక చేస్తూ, ఇలాంటి చర్యలు కోర్టు ప్రక్రియకు విరుద్ధమని తేల్చి చెప్పింది. శుక్రవారం నాడు జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్?తో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. బాంబే హైకోర్టులో ఇదే అంశంపై ఇప్పటికే పిటిషన్ విచారణలో ఉండగానే, అదే విషయాన్ని ప్రస్తావిస్తూ ఒక వ్యక్తి నేరుగా సుప్రీంకోర్టులో ఆర్టికల్ 32 కింద పిటిషన్ దాఖలు చేయడాన్ని ధర్మాసనం తీవ్రంగా తప్పుబట్టింది. ఈ పిటిషన్‌ను కోర్టు ప్రక్రియను, చట్టాన్ని తీవ్రంగా దుర్వినియోగం చేసిన చర్యగా పేర్కొంటూ, వెంటనే కొట్టివేసింది. ఈ సందర్భంగా ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. "ఆర్టికల్ 32ను స్పష్టంగా దుర్వినియోగం చేస్తున్నారు. ఈ ఆర్టికల్ కింద దాఖలయ్యే పిటిషన్ల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రతి చిన్న విషయానికీ, హైకోర్టులో ఒక్క వాయిదా పడితే చాలు, ఇక్కడికి వచ్చి ఆర్టికల్ 32 కింద పిటిషన్ వేస్తున్నారు. ముఖ్యంగా దిల్లీ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ఇలాంటి పిటిషన్లు ఎక్కువగా వస్తున్నాయి. ఇది ఏమిటి? ఇది పూర్తిగా దుర్వినియోగమే" అంటూ అసహనం వ్యక్తం చేసింది.

**ప్రతి సందర్భంలోనూ వినియోగించుకోవడం సరికాదు!**

ఆర్టికల్ 32 అనేది పౌరుల ప్రాథమిక హక్కుల ఉల్లంఘన జరిగినప్పుడు, నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించే హక్కును కల్పిస్తుంది. దీనిని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగానికి హృదయం, ఆత్మగా అభివర్ణించారు. ఈ ఆర్టికల్ ద్వారా పౌరులు తమ హక్కులకు తక్షణ న్యాయ పరిరక్షణ పొందే అవకాశం ఉంది. అయితే, ఈ హక్కును ప్రతి సందర్భంలోనూ వినియోగించుకోవడం సరికాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

## ఇజ్రాయెల్ ఆర్మీలో
# అందమైన భామలు!

**టెల్‌వీవ్:**ప్రపంచంలోనే శక్తిమంతమైన ఆర్మీ కలిగిన దేశాల్లో ఇజ్రాయెల్ ఒకటి. అత్యాధునిక ఆయుధ, సాంకేతిక సంపత్తి ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ సొంతం. ఇజ్రాయెల్ ఆర్మీలో పురుషులతో పాటు మహిళలూ పెద్ద సంఖ్యలో కనిపిస్తారు. వీరికి సంబంధించిన ఫొటోలు నెట్టింట తరచూ దర్శనమిస్తుంటాయి. అయితే, ఇజ్రాయెల్ ఆర్మీలో కేవలం అందమైన అమ్మాయిల్నే ఎంపిక చేస్తారనే ప్రచారం ఉంది. వాస్తవానికి ఇజ్రాయెల్ ఆర్మీ ఎంపికలో ఎక్కడా అందాన్ని ప్రామాణికంగా తీసుకోనప్పటికీ.. సామాజిక మాధ్యమాల్లో దీని గురించి చర్చ నడుస్తుంటుంది. ఇంతకీ ఈ ప్రచారం వెనుక అసలు కారణమేంటి? ఇజ్రాయెల్‌లో పురుషులతో సమానంగా మహిళలకూ మిలిటరీ సర్వీస్ తప్పనిసరి. ఇక్కడ 18 ఏళ్లు నిండిన మహిళలు ఆర్మీలో చేరాల్సి ఉంటుంది. మహిళలు కనీసం 24 నెలల పాటు ఆర్మీలో పనిచేయాల్సి ఉంటుంది. కొన్ని విభాగాల్లో అయితే 30 నెలల పాటు సేవలందించాల్సి ఉంటుంది. 1948 నుంచే మహిళలూ తప్పనిసరిగా పనిచేయాలన్న నిబంధన ఉంది. కాబట్టి 18–20 ఏళ్ల అమ్మాయిలు ఆర్మీలో కనిపిస్తారు. అంతే తప్ప ఆర్మీ ఎంపికలో అందం ఏమాత్రం ప్రామాణికం కాదు. ఇందులో భాగంగానే బాలబాలికలకు చిన్నప్పటి నుంచే మానసికంగా, శారీరకంగా బలంగా మారడానికి శిక్షణ ఇస్తారు. సైన్యంలో చేరిన తర్వాత వారు అన్ని రకాల వాతావరణ పరిస్థితులలో పనిచేయడం నేర్చుకుంటారు. వారికి ఆయుధాలను ఎలా ఉపయోగించాలో నేర్పించడంతో పాటు సాంకేతికత, సైబర్ భద్రత, ఇంజినీరింగ్, ఇంటెలిజెన్స్ వంటి రంగాల్లోనూ శిక్షణ ఇస్తారు.

సోషల్ మీడియా అసలు కారణం..

సైన్యంలో చేరే సమయానికి మహిళల వయసు సుమారు 18 నుండి 21 ఏళ్ల మధ్య ఉంటుంది. ఆ వయసులో వారు సహజంగానే అందంగా, ఆకర్షణీయంగా ఉంటారు. దీనికితోడు ఆర్మీలో ఇచ్చే కఠినమైన శారీరక శిక్షణ వల్ల వారు చాలా ఫిట్‌గా, ఆకర్షణీయంగా కనిపిస్తారు. ఇజ్రాయెల్ సైనికులకు కొన్ని పరిమితులతో స్మార్ట్‌ఫోన్లను వాడే అనుమతి ఉంది. దీంతో చాలా మంది మహిళా సైనికులు తమ యూనిఫాంతో ఉన్న ఫొటోలను ఇన్‌స్టా, టిక్‌టాక్ వంటి ప్లాట్‌ఫామ్‌లలో పోస్ట్ చేస్తుంటారు. ఈ ఫొటోలు ఇంటర్నెట్‌లో వైరల్ అవ్వడం వల్ల ఇజ్రాయెల్ ఆర్మీలో అందమైన అమ్మాయిలను ఎంపిక చేస్తారనే భావన ప్రపంచవ్యాప్తంగా ఏర్పడింది. ఇజ్రాయెల్‌లో సైనికులు తమ సెలవు దినాల్లో లేదా డ్యూటీ తర్వాత ఇంటికి వెళ్లేటప్పుడు కూడా తమ ఆయుధాలతో, యూనిఫాంతోనే ప్రయాణిస్తారు.



ఇజ్రాయెల్‌పై విమర్శలు ఇవీ..

ఆర్మీలో కేవలం అందమైన అమ్మాయిల్నే ఎంపిక చేస్తారన్న భావనతో పాటు.. ఇజ్రాయెల్ తన 'సాఫ్ట్ పవర్'ను పెంచుకోవడానికి ఈ ట్రిక్‌ను ఉపయోగిస్తోందన్న వాదన బలంగా ఉంది. ఆధునిక, ప్రజాస్వామ్య భావాలు కలిగిన దేశంగా తమను తాము ప్రొజెక్ట్ చేసుకోవడానికి 'అందమైన మహిళల ఇమేజ్'లను ఆ దేశం ఉపయోగిస్తుందన్న ప్రచారం ఉంది. దేశంలో మహిళలకు పూర్తి స్వేచ్ఛ ఉంటుందని చెప్పుకోవడానికి ఇజ్రాయెల్ ఈ విధంగా చేయిస్తోందని చెబుతుంటారు. దీనికితోడు సోషల్ మీడియాలో ఇజ్రాయెల్ మహిళా సైనికులు పోస్ట్ చేసే గ్లామరస్ ఫొటోలు, వీడియోల ద్వారా యుద్ధం తాలూకు క్రూరత్వాన్ని కప్పిపుచ్చి, ఆర్మీ అంటే కూల్ అనే భావన కల్పిస్తున్నారనేది మరో విమర్శ. పాలస్తీనా పౌరుల మరణాల నుంచి ప్రపంచం దృష్టిని మరల్చడానికి ఈ గ్లామరస్ ఫొటోలను ఒక 'సాఫ్ట్ పవర్' అస్త్రంగా ఇజ్రాయెల్ వాడుతోందని ఇజ్రాయెల్ ప్రత్యర్థులు ఆరోపిస్తుంటారు.

చివరిగా: వాస్తవానికి అందమైన అమ్మాయిల అంశం ఒక ప్రచారమే తప్ప.. దీనికి సంబంధించి ఎక్కడా ఆధారాల్లేవు. తొలినాళ్లలో ఆర్మీలో చేరిన మహిళలు కేవలం కొన్ని పనులకే పరిమితమయ్యేవారు. కాలక్రమంలో పురుషులతో సమానంగా యుద్ధ భూమిలో పోరాడుతున్నారు

# ఆధ్యాత్మికత ఉట్టి పడేలా పట్టణ, ఆలయ అభివృద్ధి

## మా ప్రభుత్వం పేదల కోసం పని చేస్తుంది





**రాజన్న సీరిసిల్ల జిల్లా ప్రతినిధి జనవరి 16 (జనంసాక్షి):** వేములవాడలో ఆధ్యాత్మికత ఉట్టి పడేలా రాజన్న ఆలయ, పట్టణ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, మా ప్రభుత్వం పేదల కోసం పని చేస్తుందని మంత్రి సీతక్క అన్నారు.శుక్రవారం వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పపూర్ వద్ద జంక్షన్ నిర్మాణానికి రూ కోటి మంజూరు కాగా దానికి భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ .. ప్రజా ప్రభుత్వంలో వేముల వాడ ఎమ్మెల్యేగా అది శ్రీనివాస్ గెలిచినా నాటి నుండి 2 సంవత్సరాలలో వేములవాడ నియోజకవర్గ అభివృద్ధి కొరకు వివిధ శాఖల మంతులందరని కలసి అభివృద్ధి పనుల కొరకు నిధులు మంజూరు చేసుకొని అభివృద్ధి చేస్తున్నాడన్నారు. రాజన్నను దర్శించుకొని మేడారం వెళ్లడం మా ఆనవాయి తని, అదే క్రమంలో మేము స్వామి వారిని దర్శించుకున్నారు. రాజన్న ఆలయం, మేడారం సమ్మక్క, సారక్క ఆలయాల అభివృద్ధి కొరకు వందల కోట్లఎనిధులు సిఏం మంజూరు చేశాడన్నారు.మేడారంలో పూర్వ వైభవని ఉట్టి పడేలా శిలలు నిర్మాణం చేస్తున్నమన్నారు ఏ దేవుడి ప్రత్యేకత ఆదేవుడికి ఉంటుందన్నారు. రాష్ట్రంలో మహిళ సంఘాల భవన నిర్మాణా నికి నిధులు మంజూరు చేస్తున్నమని,మహిళ సంఘాలను బలోపేతం చేయడం ప్రభుత్వ బాధ్యత అన్నారు.రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం కోటి మంది మహిళల ను కోటీశ్వర్లను చేయడం మా బాధ్యత అన్నారు. మహిళా సంఘాలకు పెట్రోలు బంకులు, బస్సు సర్వీసు లు అంద చేశామన్నారు.మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడు కోవలిసిన బాధ్యత మన అందరిపై వుందని మంత్రి సీతక్క తెలిపారు.అనంతరం ప్రభుత్వ విప్ మాట్లాడుతూ తిపాపూర్ మున్సిపల్లో విలీనం అయ్యాయిందన్నారు.జంక్షన్ ఏర్పాటు కొరకు రూ కోటి మంజూరు అయ్యాయన్నారు.వేములవాడను అన్ని రంగలో ముందుకు తీసుకు వెళుతున్నమన్నారు.రాజన్న ఆలయ అభివృద్ధి కొరకు రూ 150 కోట్లతో ఆలయ అభివృద్ధి చేసుకుంటున్నమన్నారు.మేడారం ఆలయ అభివృద్ధితో పాటు రాజన్న ఆలయ అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు.గత ప్రభుత్వం రాజన్న ఆలయానికి ఏటా రూ 100 కోట్లు యిస్తామని చెప్పి మొండి చేయి చూపారన్నారు. వేముల వాడలో 43 కుల సంఘాల భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేపించనాని,పట్టణ,ఆలయ అభివృద్ధిలొ ఎలాంటి లోటు రాకుండా చూస్తున్నామన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.కలెక్టర్ మాట్లాడుతూ వేములవాడ అభివృద్ధి కొరకు రూ 15 కోట్లు మంజూరు అయ్యాయని, దానిలో భాగంగా రూ కోటితో జంక్షన్ ఏర్పాటు చేస్తున్నమన్నారు. ఆలయ అభివృద్ధి పనులు జరుగుతున్న క్రమంలో నేను అభివృద్ధి పనులలో పాల్గొవడం నా అదృష్టంగా బావిస్తున్నామన్నారు. పట్టణ అభివృద్ధి కొరకు నిధులు మంజూరు అవుతున్నా యన్నారు.ఈ కార్యక్రమంలొ ఆర్డివో రాధబాయ్,మున్సిపల్ కమిషనర్ అన్వేష్ ,గ్రంధాలయ సంస్థ చేర్మెన్ నాగుల సత్య నారాయణ గౌడ్,సెస్ డైరెక్టర్ నామల ఉమా లక్ష్మిరాజం, మార్కెట్ కమిటీ చేర్మెన్ రాజు,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాగరం వెంకట స్వామి, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

# మొంత తుఫాను నష్టాలపై కేంద్ర బృందం పరిశీలన



**భీమదేవరపల్లి జనవరి 16 (జనంసాక్షి):** మొంత తుఫాను ధాటికి హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో జరిగిన నష్టాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అంచనా వేయడానికి కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ సంయుక్త డైరెక్టర్ గయా ప్రసాద్ నేతృత్వంలోని కేంద్ర బృందం శుక్రవారం మండలంలో పర్యటించింది. ఈ పర్యటనలో భాగంగా కేంద్ర బృందం ముందుగా విశ్వంద కాలనీని సందర్శించి, భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న కాలువలు నీట మునిగిన వరి పంట పొలాలు ధ్వంసమైన రోడ్ల పరిస్థితిని పరిశీలించింది.పంట చేతికొచ్చే దశలో పూర్తిగా నష్టపోవడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు తమ ఆవేదనను కేంద్ర బృందానికి తెలియజేశారు. కాలువలు తెగిపోవడంతో పొలాల్లోకి వరద నీరు చేరి పంటలు పూర్తిగా మునిగిపోయినట్లు అధికారులు వివరించారు. అనంతరం బృందం కొప్పురు గ్రామాన్ని సందర్శించి, తుఫాను కారణంగా పాక్షికంగా పూర్తిగా ధ్వంసమైన ఇళ్లను పరిశీలించింది. గాలివాన ధాటికి పశువులు మృతి చెందిన ఘటనలపై బాధితులను కేంద్ర బృందం అడిగి తెలుసు కుంది. ఇళ్లతో పాటు పశుసంపద నష్టంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు బృందం దృష్టికి తీసుకువచ్చారు. ఈ పర్యటనలో హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారి, భీమదేవరపల్లి తహశీల్దార్ రాజేష్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీధర్,స్థానిక సర్పంచ్ గద్ద కుమారస్వామి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.నష్ట వివరాలను సమగ్రంగా నమోదు చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు అధికారులు తెలిపారు.

# తెలుగు రాష్ట్రాల ప్రాజెక్టులపై విషం చిమ్ముతున్న బీఆర్ఎస్, వైసీపీ

**కరీంనగర్ టిడిపి పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు వంచ శ్రీనివాసరెడ్డి**




**కరీంనగర్ జిల్లా బ్యూరో, జనవరి 16 (జనంసాక్షి) :** రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు బాగుండాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోరుకుంటే రెండు తెలుగు రాష్ట్రాలు సర్వనాశనం కావాలని టిఆర్ఎస్, వైసిపి నాయకులు విషం చిమ్ముతున్నారని వారి కుట్రలను తిప్పుకొట్టాలని ప్రజలకు, పార్టీ శ్రేణులకు కరీంనగర్ టిడిపి పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షులు వంచ శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. కృష్ణ, గోదావరి జలాలకు సంబంధించి నెలకొన్న వివాదాలపై ప్రజలకు తెలియజేయవలసిన అవసరం ఉందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రాజెక్టుల వివాదాలు చర్చల ద్వారా పరిష్కరించుకుందామని ప్రకటించారు. దానిని బిఆర్ఎస్, వైసిపి నాయకులు మరొక వివాదానికి తెరదీస్తున్నారని, ఈ రెండు పార్టీల ఆగడాలతో తెలుగు ప్రజలను మరింత మోసం చేయాలని చూస్తున్నారన్నారు. ఈ రెండు పార్టీలు ప్రజలను మోసగించిన తీరును ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఈ రెండు పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పిన సిగ్గు రాలేదన్నారు. బీఆర్ఎస్, వైసిపి కుటుంబ పత్రికలతో తెలుగు రాష్ట్రాల ప్రజల మధ్య చిచ్చుపెట్టే కథనాలు రాస్తూ ప్రజలను సెంటిమెంట్తో రెచ్చగొట్టే కుట్రలు చేస్తున్నారన్నారు. వైసీపీ నాయకులకు కేసుల భయం పట్టుకుందని ఆ భయంతో జలవివాదం పేరిట కుట్రలకు తెర తీశారని వంచ శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డాడు. ఫామ్ హౌస్ లో ఒకరు, ప్యాలెస్లో మరొకరు, నీకు తెలంగాణ, నాకు ఆంధ్ర ప్రదేశ్ అని ఇరు పార్టీల నాయకులు కేసీఆర్, జగన్ లు పగటి కలలు కంటున్నారన్నారు.

హరీష్ రావు, కేటీఆర్ లకు ప్రాజె క్టుల మీద అవగాహన లేకున్నా అహంకారంతో అనవసర రాద్ధాం తం చేస్తున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు నాయకత్వంలో రాయల సీమ ప్రాజెక్టు పనులను పట్టాలెక్కించి రాయలసీమను సస్యశ్యా మలంగా చేసే దిశగా అడుగులు పడుతున్నాయన్నారు.

# కరీంనగర్లో బంగారు స్వామినాథన్ విగ్రహ ఆవిష్కరణ

- **ఉద్యోగ సంఘాల మధ్య చిచ్చు పెట్టవద్దు**
- **తెలంగాణ రాష్ట్ర ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ ఘాటైన హెచ్చరిక**



**కరీంనగర్ జిల్లా బ్యూరో, జనవరి 16 (జనంసాక్షి) :** శుక్రవారం రోజు స్థానిక కరీంనగర్లోని సర్వసభ్య సమావేశంలో దారం శ్రీనివాస్ రెడ్డి ఎంప్లాయిస్ జేఏసి చైర్మన్ కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో జరిగిన సభలో స్థానిక కరీంనగర్లోని టీఎన్జీవోల సంఘ భవనంలో తెలంగాణ ఎన్జీవోల సంఘం మాజీ అధ్యక్షులు దివంగత బంగారు స్వామినాథన్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, టీఎన్జీవోల ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం. హుస్సేని (ముజీబ్) ముఖ్య అతిథులుగా పాల్గొని స్వామినాథన్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బంగారు స్వామినాథన్ సేవలను గుర్తుచేసుకుంటూ పలువురు నాయకులు ఘన నివాళులు అర్పించారు. అదేవిధంగా, స్వామినాథన్ సతీమణికి సం తరపున లాంఛనప్రా యంగా నగదు సహాయంతో పాటు బట్టలను అందజేశారు.

**ఉద్యోగ సంఘాల మధ్య విభేదాలకు ప్రభుత్వం దూరంగా ఉండాలి**

ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మధ్య ఐక్యతను భంగపెట్టేలా ఉద్యోగ సంఘాల మధ్య చిచ్చు పెట్టి పరస్పర విభేదాలు సృష్టించే ప్రయత్నాలను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని ఘాటుగా హెచ్చరించారు. తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యలను సమగ్రంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, ప్రస్తుతం ఒకే ఒక్క ఉద్యోగ సంఘాన్ని ప్రత్యేకంగా దగ్గర చేసుకుని, దానికి మాత్రమే వత్తాసు పలుకుతూ మిగిలిన ఉద్యోగ సంఘాలను నిర్లక్ష్యం చేయడం తీవ్ర అభ్యంతరకరమని ఆయన విమర్శించారు. ఈ విధానం వల్ల ఉద్యోగుల్లో అయోమయం, అసంతృప్తి పెరిగి రాష్ట్రవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలిచి పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల శ్రేయస్సును కాపాడడమే ఉద్యోగ సంఘాల ప్రధాన లక్ష్యమని, అలాంటి సంఘాలను ప్రభుత్వం సమానంగా గౌరవించి హక్కుల సాధనలో భరోసాగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. ఉద్యోగ సంఘాల మధ్య విభేదాలు రెచ్చగొట్టి పక్కన నిలబడి చూస్తే టీఎన్జీవోల సంఘం ఎట్టి పరిస్థితుల్లోనూ మౌనంగా ఉండబోదని హెచ్చరించారు. ప్రభుత్వం ఇప్పటికైనా తన వైఖరిని మార్చుకుని తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీని వేదికగా చేసుకొని ఉద్యోగ సంఘాలన్నింటితో సమన్వయం పాటిస్తూ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కాబోయే రోజుల్లో ఉద్యోగుల హక్కుల సాధన విషయంలో టీఎన్జీవోల సంఘం ఎట్టి పరిస్థితుల్లోనూ వెనుకడుగు వేయదని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణకు సిద్ధంగా ఉంటామని తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై మారం జగదీశ్వర్ మాట్లాడుతూ, చాలాకాలంగా పెండింగ్లో ఉన్న ఉద్యోగుల బిల్లుల సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నెలకు కనీసం రూ.1500 కోట్లను విడుదల చేస్తూ, అత్యవసర బిల్లుల క్లియరెన్స్కు ప్రత్యేకంగా గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేయాలని కోరారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, త్వరలోనే



జీవో విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. చాలా కాలంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ఉద్యోగుల కోసం ఎంప్లాయీ హెల్త్ స్కీమ్ ను ఈ నెలలోనే పూర్తి చేసి, ఉద్యోగులు వారి కుటుంబాలకు తక్షణ సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. పెన్షనర్లు, రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించిన అన్ని బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టి ఎన్జీవోల సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సంగేం లక్ష్మణరావు, కేంద్ర సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణ గౌడ్, జిల్లా నాయకులు ముప్పిడి కిరణ్ కుమార్, రవీందర్ రెడ్డి, నాగుల నరసింహస్వామి, గూడ ప్రభాకర్ రెడ్డి, రాగి శ్రీనివాస్, మామిడి హరికృష్ణ, సర్దార్ హర్మేందర్ సింగ్, మేన్నేని సందీప్ రావు, లేంకల సబితా రెడ్డి, గంగారపు రమేష్ గౌడ్ పాల్గొన్నారు.


# అసైన్డ్ భూముల ఆక్రమణలపై పరిశీలన

**వివరాలు అడిగి తెలుసుకున్న సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా**



**ఆర్మూర్, జనవరి 16 (జనంసాక్షి):** ఆర్మూర్ పట్టణం కోటార్మూర్ లోని సర్వేనెంబర్ 202లో ఉన్న భూమితో పాటు అసైన్మెంట్ స్థలాలను సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా శుక్రవారం పరిశీలించారు. 202లో ఒక ఎకరం 7 గంటల ప్రభుత్వ భూమి ఉంది. ఈ ప్రభుత్వ భూమితో పాటు అసైన్మెంట్ భూముల ఆక్రమణలపై వివిధ పత్రికల్లో వచ్చిన వార్తలపై సబ్ కలెక్టర్ స్పందించారు. 202 సర్వే నెంబర్ లో ఒక ఎకరం 7 ఏడు గుంటల ప్రభుత్వ భూమి ఉంది. ఇది కాకుండా మరో ఎకరం భూమి ఉంది. 202 సర్వే నెంబర్ లోని అసైన్ మెంట్ భూమిని కొందరు ఆక్రమించారని ఫిర్యాదులు వచ్చాయి. ప్రభుత్వ భూమితో పాటు అసైన్మెంట్ భూములను ఆయన పరిశీలించారు. పేదలకు ఇచ్చిన ప్రభుత్వ భూములు ఇతరుల చేతుల్లో ఏ విధంగా మారాయి అన్నది అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ భూములను రక్షిస్తామని ఆయన చెప్పారు. అదే విధంగా అసైన్మెంట్ భూముల విషయం పై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి నిర్ణయం తీసుకుంటామన్నారు. అదేవిధంగా కొటార్మూర్ చెరువు స్థలాన్నీ సైతం సబ్ కలెక్టర్ పరిశీలించారు. చెరువు ఎఫ్ టి ఎల్ స్థలంతో పాటు బఫ ర్ జోన్ స్థలాలలో ఆక్రమణలు పరిశీలించి అధికారులతో మాట్లాడి చర్యలు చేపడతామన్నారు. వీటన్నింటి రికార్డులను పరిశీలించి చర్య లు చేపడతామన్నారు.ఆయన వెంట డివిజన్ సర్వేయర్ శేఖర్ వర్మ, మండలసర్వేయర్ రత్నాకర్, ఆర్ఐ ప్రమోద్,జిపిఓలు రాధా పాల్గొన్నారు.

# జి రాంజీ పథకాన్ని రద్దు చేయాల్సిందే..!



**మంథని, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా మంథని మండలం బిట్టు పల్లి గ్రామంలో వరి నాట్లు వేస్తున్న కూలీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం మహాత్మా గాంధీ పేరుతో ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దుచేసి పార్లమెంటు తమకున్న మందబలంతో జి రామ్ జి పేరుతో పథకాన్ని పార్లమెంట్లో ఆమోదించుకున్నారని అన్నారు 60 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం ఇస్తుందని 40 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని ఈ పథకంలో చెప్పారని అన్నారు ఉపా ధి పనులను కూలీలతో కాకుండా కాంట్రాక్టర్లకు అప్పజెప్పి యంత్రాల ద్వారా పనులు చేస్తారని అన్నారు. దీంతో గ్రామాల్లో కూలీలకు పని దొరికే పరిస్థితి లేదని అన్నారు గ్రామీణ ప్రజలకు ఆసరగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయడం సరి కాదన అన్నారు కూలీల పని హక్కుకు భంగం కలిగిస్తున్న జిరాంజీ పథకాలు రద్దు చేయాల్సిందేనని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ మేట్ రమేష్తో పాటు కూలీలు పాల్గొన్నారు.

# ఏములడ రాజన్న, సమ్మక్క సారక్క పేదల దేవుండ్లు






**మంత్రి సీతక్క**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జనవరి 16 (జనంసాక్షి):** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి వారిని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుక్రవారం దర్శించుకున్నారు.ఆమెకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శ్రీ భీమేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కోడె మొక్కులు చెల్లించుకున్నారు. ఆమె అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మేడారం సమ్మక్క సారక్క దర్శనానికి ముందు రాజన్నను దర్శించుకోవడం ఆనవాయితి అన్నారు గత కొన్ని సంవత్సరాల నుండి స్వామివారి దర్శనానికి మా కుటుంబ సభ్యులతో వస్తున్నామన్నారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి ఏటా రూ.100 కోట్లు ఇస్తానని, మేడారం సమ్మక్క సారలమ్మ ఆలయ అభివృద్ధి చేస్తానని విస్మరిం చారన్నారు. శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి,భక్తులకు సౌకర్యాలు కల్పించాల్సి ఉందన్నారు.సామాన్య భక్తుల సౌకర్యాల ను, ఆలయ అభివృద్ధి దృష్టిలో ఉంచుకొని సిఏం రేవంత్ రెడ్డి ఆలయ అభివృద్ధికి శ్రీకారం చుట్టారన్నారు.గతంలో కొంతమంది ఆలయ అభివృద్ధి,భక్తుల దర్శనాలపై దుష్ప్రచారాలు చేశారన్నారు. భీమన్న ఆలయంలో ఎంతో మంది భక్తులు తమ మొక్కుబడులు చెల్లిం చుకుంటున్నారన్నారు. సమ్మక్క సారక్క, వేములవాడ రాజన్న పేద ల దేవుళ్ళన్నారు.ఆలయాల అభివృద్ధి భావోద్వేగాలు, ఆచారాల తో కూడుకున్నదన్నారు.ఈ నెల 19న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారం సమ్మక్క సారక్క గుడి పునః ప్రారంభోత్సవం చేస్తారన్నారు. 18న మేడారంలో క్యాబినెట్ మీటింగ్,మంత్రులు ఎమ్మెల్యేలు వస్తారన్నారు.రానున్న గోదావరి పుష్కరాల సందర్భంగా గోదావరి పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు సిఏం చర్యలు తీసుకుంటున్నరన్నారు.

## మినీ మేడారం జాతరలలో

# భక్తులకు ఇబ్బందులు రావొద్దు



**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): జిల్లాలో నిర్వహించనున్న మినీ మేడారం జాతరలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు.

శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో మండల ప్రత్యేక అధికారులు, పంచాయతీ రాజ్, విద్యుత్, ఇంజనీరింగ్, మిషన్ భగీరథ, గిరిజన సంక్షేమ శాఖ, తహసీల్దార్లు, ఎంపీడీఓ లు తదితర శాఖల అధికారులతో మినీ మేడారం జాతర ల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జాతర ప్రాంగణంలో పొదలు, పిచ్చి మొక్కలు తొలగించాలని, భక్తుల సౌకర్యార్థం త్రాగునీరు, మరుగుదొడ్లు, తాత్కాలిక మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, పారిశుద్ధ్య కార్యక్రమాలు వంటి మౌలిక సదుపాయాలు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. జాతర సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, మిషన్ భగీరథ ద్వారా పరిశుభ్రమైన త్రాగునీరు అందించాలని ఆదేశించారు. జాతరలు జరిగే మార్గాల్లో రోడ్లకు ఇరువైపుల పొదలు, పిచ్చి మొక్కలు తొలగించాలని, మూల మలుపుల వద్ద సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని, దెబ్బతిన్న రోడ్లు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. స్థానిక తహసీల్దార్లు, ఎంపీడీఓలు జాతర జరిగే ప్రదేశాలను పరిశీలించి చేయాల్సిన సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. జాతరలు నిర్వహించే మండలాల్లో మండల ప్రత్యేక అధికారులు పూర్తి బాధ్యత తీసుకోవాలని, భూపాలపల్లి మండలంలో కమలాపూర్, గుర్రంపేట ప్రాంతాల్లో రెండు జాతరలు జరుగు తున్నందున ఇద్దరు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు.

ఈ నెల 23వ తేదీ వరకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి మినీ మేడారం జాతరలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, సీపీఓ బాబురావు, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, మండల ప్రత్యేక అధికారులు సునీల్, బాబురావు, విద్యుత్ శాఖ డీఈ రాజిరెడ్డి, ఆర్డీవో హరికృష్ణ, డీఎల్పీఓ మల్లికార్జున రెడ్డి, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు పాల్గొన్నారు.

## జాతరకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు

**ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**



**గోదావరిఖని, (జనంసాక్షి):** సమ్మక్క సారాలమ్మ జాతర ఏర్పాట్ల పనులను శుక్రవారం ఆర్జీ 1 జియం లలిత్ కుమార్ తో కలసి రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ స్వయంగా పర్యవేక్షించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని మౌలిక వసతు లు సమకూర్చాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. అనంతరం సంక్రాంతి పం డుగ సందర్భాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కైట్ ఎగిరేసి పండుగ సందడిలో పాల్గొన్నారు. నాయకులతో, కార్యకర్తలతో కలిసి ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 104 ఉద్యోగులకు పది నెలల జీతాలు చెల్లించాలి

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్లో ఉన్న పది నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని 104 నల్గొండ జిల్లా అధ్యక్షులు ఎం ఏ హాది ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా 104 ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 104 ఉద్యోగులందరూ కూడా బకాయి వేతనాల కోసం నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని,ఈ సమస్యపై రాష్ట్ర ప్రభుత్వంతో అనేక సందర్భాల్లో వినతి పత్రాలు ఇచ్చిన నేటి వరకు 104 ఉద్యోగులకు వేతనాలు చెల్లించలేదన్నారు. దీనివల్ల 104 ఉద్యోగుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో ఉన్నారని ఆయన అన్నారు. 104 సర్వీసులో పనిచేస్తున్న ఉద్యోగులకు వెంటనే పది నెలల పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరారు.

# దేశ సంపద రక్షణలో కమ్యూనిస్టులు

- చారిత్రక ఘటనలో భాగస్వాములు కండి
- మా నినాదాలే పరిపాలనా నిర్ణయాలు
- స్వేచ్ఛను హరిస్తున్న కేంద్ర పాలకులు
- మీడియా సమావేశంలో కూనంనేని




**ఖమ్మం బ్యూరో (జనంసాక్షి):** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో జరిగే సభ చరిత్రలో నిలిచి పోనుందని, ఈ చారిత్రక ఘటనలో ప్రజలు పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని కొత్తగూడెం శాసన సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. ఖమ్మం ఎస్ఆర్ అండ్ బిజిఎన్ఆర్ కళాశాల మైదానంలో జరిగే సభకు సిపిఐ జాతీయ కార్యదర్శి డి. రాజాతో పాటు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హాజరుకానున్నారని ఆయన తెలిపారు. శుక్రవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ ఖమ్మం సభ కమ్యూనిస్టుల పురోగమనానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి దోహదపడుతుందన్నారు. సంపూర్ణ స్వాతంత్ర్యం నినాదం లక్ష్యంతో పోరాడిన ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ మాత్రమేనని ఆయన తెలిపారు. కమ్యూనిస్టుల పోరాటం ప్రజాసంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసమేనన్నారు. ఏ స్వేచ్ఛ కోసం పోరాడి స్వాతంత్ర్యం తెచ్చుకున్నామో అదే స్వేచ్ఛను బిజెపి హరించివేస్తుందన్నారు. సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యల పరిష్కారంతో పాటు రైతులు, కూలీలు, మహిళలు, విద్యార్థి, యువజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సిపిఐ పోరాడుతుందన్నారు. ప్రశ్నించే వారి గొంతు నొక్కే క్రమంలోనే పాలకులు యూనియన్ల రద్దు అంటున్నారని మరో పక్క అర్బన్ నక్సలైట్ ముద్ర వేసి నిర్బంధిస్తున్నారని ఆరోపించారు. 1925లో సిపిఐ ఆవిర్భావించిన తర్వాత నిర్బంధాల నడుమ నిషేధానికి గురైందని కమ్యూనిస్టుల భావాజాలంతో అనేక మంది కాంగ్రెస్లో చేరి సోషలిస్టు సిపిఐ పోరాడుతుందన్నారు. ప్రశ్నించే వారి గొంతు నొక్కే క్రమంలోనే పాలకులు యూనియన్ల రద్దు అంటున్నారని మరో పక్క అర్బన్ నక్సలైట్ ముద్ర వేసి నిర్బంధిస్తున్నారని ఆరోపించారు. కమ్యూనిస్టుల ప్రత్యామ్నాయమే సరైన ప్రత్యామ్నాయమని ఆయన తెలిపారు. చిట్టగాంగ్, గదర్, తెబగా, వాయిలార్, పోనప్ప సహా పలు పోరాటాలను నిర్వహించిన వారంతా సిపిఐలో చేరారన్నారు. మీరట్, కాన్పూర్, విషాద సహా పలు కుట్ర కేసులను ఎదుర్కొని నిలబడ్డ సిపిఐ మరో వందేళ్లయినా ప్రజల పక్షాన నిలబడేందుకు సిద్ధమేనని సాంబశివరావు తెలిపారు. వందేళ్ల వేడుక భవిష్యత్తు పోరాటలకు స్ఫూర్తిని ఇవ్వనుందన్నారు.

**రెండవ శతాబ్దంలోనూ ప్రజా పోరాటాలు : ప్రకాష్ బాబు**

శతాబ్ద కాలం పాటు పోరాటం సాగించిన సిపిఐ రెండవ శతాబ్దంలోనూ ప్రజా పోరాటాలకు సిద్ధంగా ఉన్నామని సిపిఐ జాతీయ కార్యదర్శి ప్రకాష్ బాబు తెలిపారు. ప్రకాష్ బాబు మాట్లాడుతూ 2024 డిసెంబర్ 24 శతాబ్ది ఉత్సవాలు కాన్పూర్లో ప్రారంభమయ్యాయని ముగింపు కమ్యూనిస్టు ఖిల్లా ఖమ్మంలో ముగుస్తున్నాయన్నారు. శతాబ్దకాలం ప్రజల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం పనిచేశామని అదే సిద్ధాంతం, లక్ష్యంతో భవిష్యత్తులోనూ పోరాడతామన్నారు. మతోన్మాద శక్తులను నిలువరించే శక్తి కమ్యూనిస్టులకు మాత్రమే ఉందన్నారు.

**మూడు ప్రదర్శనల ద్వారా సభా స్థలికి భాగం**

మూడు ప్రదర్శనల ద్వారా ప్రజలు బహిరంగ సభా స్థలికి చేరుకుంటారని ఆహ్వాన సంఘ ప్రధాన కార్యదర్శి బాగం హేమంతరావు తెలిపారు. పెవిలియన్ మైదానం నుంచి జనసేవాదళ్ ప్రదర్శన ప్రారంభమవుతుందని దీనికి రాష్ట్ర పార్టీ సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, బాగం హేమంతరావు, నాయకత్వం వహిస్తారని తర్వాత కళాకారుల వృత్తి సంఘాల ప్రదర్శన ఉంటుందన్నారు. రెండవ ప్రదర్శన శ్రీశ్రీ విగ్రహం నుంచి ప్రారంభమవుతుందని దీనికి జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా, కూనంనేని సాంబశివరావు, కొత్తగూడెం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎసి, సాబీర్ పాషా, ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి మూడవ ప్రదర్శన నయాబజార్ కళాశాల కాల్వొడ్డు నుంచి ప్రారంభమవుతుందని దీనికి ఏపి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి దండి సురేష్ నాయకత్వం వహిస్తారని హేమంతరావు తెలిపారు. మూడు ప్రదర్శనలు సరిగ్గా మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమవుతాయని ఇల్లందు క్రాస్ రోడ్డు వద్ద మూడు ప్రదర్శనలకు జాతీయ నాయకులు స్వాగతం పలికేందుకు వేదిక ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కళారూపాల ప్రదర్శనకు ప్రత్యేక వేదిక ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ఈ మీడియా సమావేశంలో జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఎస్ కె జానిమియా, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, బిజి క్లెమెంట్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఉపాధి కొల్లగొట్టే కుట్రలో భాగమే మోడీ విధానాలు

## కార్మిక రైతు సంఘం ప్రతినిధుల నిరసన




**వరంగల్ ప్రతినిధి, జనవరి 16 (జనంసాక్షి):** పేద మధ్యతరగతి ప్రజల ఉపాధిని కొల్లగొట్టి దేశ సంపదను కార్పొరేట్ పెట్టుబడుదారి శక్తులకు కట్టబెట్టేందుకు మోడీ ప్రభుత్వం రైతు కార్మిక వ్యతిరేక విధానాలను రూపొందిస్తుందని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కెఎం) రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్ అన్నారు. శుక్రవారం ఆ సంఘం జిల్లా కన్వీనర్లు సోమిడి శ్రీనివాస్ రాచర్ల బాలరాజు చిర్ర సూరి చుక్క మొగిలి వల్లందాస్ కుమార్ కార్మిక సంఘాల జిల్లా కార్యదర్శులు గన్నారపు రమేష్ ముక్కెర రామస్వామి ఎలకంటి రాజేందర్ గంగుల దయాకర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విధానాలను మానకపోతే ఉద్యమాలు ఉధృతం అవుతాయని కేంద్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కె ఎం) దేశవ్యాప్త పిలుపులో భాగంగా కేంద్ర ప్రభుత్వ కార్మిక రైతు కూలీ వ్యతిరేక విధానాలను చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్లో ప్లే కార్డ్స్ తో పాటు నల్ల జెండాలు ప్రదర్శిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ రాస్తారోకో నిర్వహించారు..ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ కుసుంబా బాబురావు అధ్యక్షత వహించగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఎన్నో పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసి శ్రామికుల హక్కులను కాలరాస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. నూతన విద్యుత్తు విత్తన చట్టాల పేరుతో ప్రైవేటు కంపెనీలకు దాసోహం అయిందని ఈ క్రమంలో రైతులకు తీవ్రమైన హాని కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వదేశీ నినాదంతో అధికారంలోకి వచ్చి ఆచరణలో విదేశీ పెట్టుబడిదారులకు కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ దేశ సంపదను కట్టబెడుతూ నియంతృత్వ విధానాలకు చట్టాలకు పాల్పడుతున్నదని ఈ విధానాలను మానుకోకపోతే బిజెపి మోడీ ప్రభుత్వం తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని నూతన విత్తన చట్టాన్ని సవరించాలని కేంద్ర విద్యుత్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని పాత 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు కార్మిక సంఘాల నాయకులు నర్ర ప్రతాప్ ఓదెల రాజన్న మహమ్మద్ మెహబూబ్ పాష కందిక చెన్నకేశవులు మైదం పాణి ఉప్పుల రవి మండల యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కల్లు బుంగలు ధ్వంసం

## పోలీసులకు ఫిర్యాదు చేసిన గీత కార్మికులు



**మంథని, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలంలోని గుండారం శివారులోని బండల వాగు సమీపంలోని గీత కార్మికులకు చెందిన ఈత చెట్లుకు కట్టిన కల్లు బుంగలను ఇనుప రాడు తో రంధ్రాలు చేసి ధ్వంసం చేశారని గీతా కార్మికులు తెలిపారు. శుక్రవారం ఉదయం గీతా కార్మికులు కల్లు తీయడానికి ఈత వనంలోకి వెళ్లి చూడగా ఈత చెట్లకు కట్టిన బుంగలు రంధ్రాలతో పాటు కుండలు పగిలిపోయి ఉన్నాయి. గుండారం గీతా కార్మిక సోసైటిలో గ్రామానికి చెందిన సుమారు 30 మంది గీతా కార్మికలు ఈత వనాలతో ఉపాధి పొందుతున్నామని.. కల్లు బంగలను ధ్వంసం చేసిన వారిని గుర్తించి చట్టపరగా చర్యలు తీసుకోవాలని కోరుతూ.. కమాన్‌పూర్ పోలీస్ ష్టేషన్, మంథని ఎక్సైజ్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు గీతా కార్మికులు తెలిపారు.

## హక్కుల కోసం పోరాడేది కమ్యూనిస్టులే

### ఆటో ర్యాలీని ప్రారంభించిన సిపిఐ నేత ప్రకాష్ బాబు



**ఖమ్మం టౌన్ (జనంసాక్షి) :** కార్మిక హక్కులు, సంక్షేమం కోసం పోరాడేది కమ్యూనిస్టులేనని సిపిఐ జాతీయ కార్యదర్శి ప్రకాష్ బాబు తెలిపారు. శుక్రవారం శ్రీశ్రీ సెంటర్లో శతాబ్ది ఉత్సవాల ముగింపు బహిరంగ సభ ప్రచారంలో భాగంగా ఆటో ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రకాష్ బాబు మాట్లాడుతూ ..అసంఘటిత కార్మికుల శ్రమకు తగిన వేతనం లభించడం లేదన్నారు. శ్రమకు తగినవిధంగా వేతనం లభించే చర్యలు తీసుకోవడంలో పాలకులు విఫలమయ్యారని ప్రకాష్ బాబు ఆరోపించారు. మోడీ తెచ్చిన లేబర్ కోడ్ కార్మికుల హక్కులు హరించబడుతున్నాయని భవిష్యత్తులో కార్మిక వర్గం మరిన్ని క్లిష్ట పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందని యావత్ కార్మిక లోకం భవిష్యత్తు పోరాటాలకు సంసిద్ధులు కావాలన్నారు. ఆటో ర్యాలీ శ్రీశ్రీ విగ్రహం వద్ద ప్రారంభమై నగరంలోని అన్ని ప్రధాన వీధుల్లో సాగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, నగర కార్యదర్శి ఎస్ కె జానిమియా, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి టి. రామాంజనేయులు, హవేలి ఏరియా సిపిఐ కార్యదర్శి ఏనుగు గాంధీ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు పి. మోహన్ రావు, శ్రీనివాసరావు, జాకీర్, ఆముదాల వెంకన్న, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై నిరసన




- కార్మిక చట్టాలను వెనక్కి తీసుకోవాలి
- తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెల్మారెడ్డి రాజిరెడ్డి

**శంకరపట్నం జనవరి 16 (జనంసాక్షి):** కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలో తెలంగాణ రైతు సంఘం, సంయుక్త కిసాన్ మోర్చా, సిఐటియు వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తూ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎమ్మార్వో కే.సురేఖకు అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెల్మారెడ్డి రాజిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కేంద్ర విత్తన బిల్లును ఉపసంహరించుకోవాలని, వి బి జి రామ్ జి పథకాన్నీ రద్దు చేయాలని, రైతులకు సమగ్ర రుణమాఫీ చేయాలని లేఖలో పేర్కొన్నట్లు తెలియజేశారు. నకిలీ ఎరువులు పురుగుమందులను అరికట్టాలని అమ్మిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, 50 సంవత్సరాలు నిండిన ప్రతి రైతుకు పదివేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని రబీ పంటకు ఎకరానికి 7500 రైతు భరోసా అందించాలని, భూభారతిలో ఆర్ ఓ ఆర్ ద్వారా సాదా బైనామాలను తదితర భూ సంబంధిత సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కన్నెబోయిన తిరుపతి, ఇమ్మడి చక్రపాణి, నారాయణరెడ్డి, గోపు వీరమల్లు, వెంకటేష్, సమ్మయ్య పాల్గొన్నారు.

## క్యాతనపల్లి అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తా

- ప్రజా సేవకే రాజకీయాల్లోకి వచ్చా
- మంత్రి వివేక్ వెంకటస్వామి



**రామకృష్ణాపూర్, జనవరి 16(జనంసాక్షి):** క్యాతనపల్లి మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా పనులు చేస్తున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మున్సిపాలిటీలో పరిధిలోని 1,2,7,8,9,12 13, 14,16 వార్డులో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మున్సిపల్ కమిషనర్ రాజు తో కలిసి అభివృద్ధి పనులకు శుక్రవారం శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు, డ్రైనేజీ, ఇతర మౌలిక సదుపా యాలను ప్రజలకు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చానని తెలుపుతూ రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను బారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు పిన్నింటి రఘునాథ్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, నాయకులు ఒడ్నాల శ్రీనివాస్, గాండ్ల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతి పండుగ వేళ దొంగల హల్ చల్




**మర్రిగూడ, జనవరి 16 (జనంసాక్షి):** మర్రిగూడ మండలం తిరుగండ్లపల్లి గ్రామంలో సంక్రాంతి పండుగ వేళ దొంగల హల్ చల్ చేశారు.తాళాలు వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి సొత్తు దోచుకెళ్లారు.తిరుగండ్లపల్లి గ్రామానికి చెందిన దేరంగుల సంక్రాంతి పండగ నిమిత్తం భార్య పిల్లలతో కలిసి తన అత్తగారి ఇంటికి వెళ్లగా గురువారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో దొంగలు ఇంటి తాళం పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. ఇంట్లోని 50, 000 రూపాయల నగదు , 5 గ్రాముల బంగారం ఎత్తుకెళ్లారు. బాధితుడు ఫిర్యాదు మేరకు మర్రిగూడ ఎస్ఐ మున గాల కృష్ణారెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తులో భాగంగా నల్లగొండ నుండి క్లూస్ టీం దొంగతనం జరిగిన ఇంటి నుండి క్లూస్ సేకరించారు.

# 5 మెలికల్స్




- నిబంధనల పాతర
- కాసులు పుచ్చుకొని గప్ చుప్ అయిన గత ప్రభుత్వం
- మాజీ మంత్రి, పిఎ సహకారం
- బఫర్ జోన్ లో బడా అనుమతి
- సంపన్నవర్గాల ఇండ్లు, వ్యాపార సముదాయల ముందు యూటర్న్‌లు

**ఖమ్మం బ్యూరో (జనంసాక్షి):**

బిఆర్ఎస్ హయాం లో ఖమ్మం నగరంలో ఇందిర నగర్ టూ అల్లీ పురం రోడ్డు వరకు చిన్న రోడ్లు వేసి, మధ్యలో పోల్స్ వేసి వాటికి లైటింగ్ తీగలు చుట్టీ దానినే అభివృద్ధి అని చెప్పి పబ్బం గడుపు కున్నారు. ఆ రోడ్డులో ఒకేసారి రెండుకార్లు వెళ్లే పరిస్థితి ఉండుదు దానినే అభివృద్ధి అనే ప్రచారం చేసుకోవడం గత ప్రభుత్వానికే చెల్లుబాటైంది. దాన్ని చూపి అదే రోడ్డులో ఓ సమూహం కలిసి నివసించడానికి అపార్ట్మెంట్ నిర్మించుకుంది. పక్కనే పెద్ద కాల్వ వెళ్తుంది. బఫర్ జోన్ పరిధిలో ఉండే స్థలానికి సునాయసంగా అనుమతులు వచ్చాయి. రావడంతో పాటుగా అక్కడ అంతస్థుల భవనం వెలిసింది. ఆ నిర్మాణంలో అన్ని రకాల నిబంధనలను ఉల్లంఘించారు. చిన్నచిన్న ఇండ్లకు నిబంధనల పేరుతో వేధించే మున్సిపల్ శాఖ ఇక్కడ జరిగిన ఉల్లంఘనలపై ఏ మాత్రం స్పందించలేదు. మాజీ మంత్రి అతని పిఎ అండతో ఇక్కడ అనేక తప్పులు చేసారు. స్థలం ముందు నుంచి వెళ్లే కాల్వ ను పటిష్టంగా నిర్మాణం చేపట్టారు. కాల్వను ను రాకపోకల కోసం, గ్రీన్ బెల్ట్ కోసం, పార్కింగ్ కోసం వినియోగిస్తున్నారు. ఇక్కడ నివాసం ఉండే వ్యాపారస్థుల నుంచి భారీ స్థాయి లో ముడుపులు అందుకున్న అధికార యంత్రాం గం మౌనం వహించిందనే ఆరోపణలున్నాయి.

**వరదలకు కారణం ఆ కాల్వ నిర్మాణమే..**



ఖమ్మంలో గతేడాది వచ్చిన వరదలు ఆ ప్రాం తంలో ఉప్పొంటానికి ప్రధానంగా ఆ కాల్వ నిర్మాణమే అని ఇంజినీరింగ్ అధికారులు తేల్చారు. ఆ కాల్వను నిర్మించాల్సిన వెడల్పులో నిర్మించకుండా వాళ్ల ఇష్టారీతిన నిర్మించడంతో దిగువకు వెళ్లే వరదకు ఇరుకుగా మారి వరద బయటకు వచ్చి రాకపోకలు నిలిచిపోయాయి. దాంతోపాటుగా ప్రజాధనంతో పోసిన రోడ్డు కొట్టుకపోయింది. దాంతో ప్రజలందరు కొన్ని నెలల పాటు ఇబ్బం దులకు గురయ్యారు. నిబంధనలను ఏర్పాటు చేసేది ప్రజలు ఇబ్బందులకు గురికావొద్దనే ఉద్దేశ్యంతో కానీ ఇక్కడ అడుగడుగునా నిబం ధనలకు తూట్లు పొడిచారు. దానికి గత ప్రభుత్వం వత్తాసు పలికింది. ఆ అక్రమ నిర్మాణం వల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అందులో ఉన్న సంపన్న వర్గానికి జేబులో పార్టీ లుగా అన్ని రాజకీయ పార్టీలు ఊడిగం చే స్తున్నా యి. అందులో ఉన్న ఓ వ్యక్తి తనకు తాను ఓ టాటా ఇండస్ట్రీలిస్ట్ గా భావించుకుంటాడు. అత ను చేసే ఏ వ్యాపారమైనా అంత మ్యానేజ్ చేసుకో వడం తప్పా అందులో నాణ్యత ఉండదు. చిటికె డంత పెట్టి కొండతం దోచేయ్యడం సదరు వ్యా పార వేత్తకు బంకుతో పెట్టిన విద్య.

**అక్రమ అపార్టుమెంటుకి ప్రత్యేక టర్నింగ్ పాయింట్ :** గత ప్రభుత్వ హాయాంలో సామాన్య ప్రజలకంటే పెట్టుబడి దారులకు మాత్రమే ఎక్కువ ప్రయో జనాలు జరిగాయి. అపార్ట్మెంట్ పక్కనే ఉన్న రోడ్డు నిర్మించడానికి స్థానిక కార్పోరేటర్లకు మనసు ఒప్పలేదు. ఎందుకంటే వారికి సామాన్య ప్రజలు కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే కావాలి. అదే సంపన్న వర్గాల ఇండ్ల ముందు అయితే అడగక పోయినా సౌకర్యాలు సమకూర్చడం రాజకీయ నాయకులకు పార్టీలు మారిన అనుభవంతో వచ్చిన విద్య. ఎక్కడ టర్నింగ్ పాయింట్ పెట్టకు ండా చైతన్య స్కూల్ వద్ద , దాంతో పాటుగా ఈ అక్రమ అపార్ట్మెంట్ వద్ద ఓ టర్నింగ్ పాయింట్ పెట్టారు. అంటే సంపన్నుల కోసం మాత్రమే గత ప్రభుత్వం పని చేసిందని చెప్పడానికి సజీవ సాక్ష్య ం. జడ్పీ సెంటర్ నుంచి హనుమాన్ టెంపుల్ వరకు యూ టర్న్ లేదు. ఆ ఇరుకు రోడ్డులో నుంచి ప్రయాణం అంటే ప్రజలు తీవ్రంగా ఇబ్బం దులు పడుతున్నారు.



**అపార్ట్ మెంట్ ముందు కాల్వ విస్తరించాల్సిందే..**

చిన్న చిన్న అంశాలకు ఆందోళనలు చేసే ప్రజా సంఘాలు ఈ విషయంలో చూసి చూడనట్లు వ్యవహరించడం అనేక అనుమానాలకు తావిస్తోం ది. అక్కడ నిర్మించిన కాల్వను విస్తరించాల్సిన అవసరం ఉంది.దానిని పార్కింగ్, గ్రీన్ బెల్ట్ కు కాకుండా ప్రజా అవసరాలకు వినియోగించాలి. కాల్వ నిర్మాణం చేపట్టేది ప్రజా అవసరాల కోసం అంతే తప్పా ఒకరిద్దరి ఇండ్లకు వెళ్లేందుకు రాచ మార్గానికి కాదనే విషయాన్ని పాలకులు గుర్తెరగా లి. ఇప్పటికైనా సరే అధికారులు ఆ కాల్వ నిర్మా ణాన్ని కూల్చి బఫర్ జోన్ కు వర్తించే నిబంధ నలను వర్తింపజేసి ప్రజలకు సౌకర్యంగా మార్చా ల్సిన అవసరం ప్రభుత్వానికి ఉంది.

**ఎలిమెంట్స్ పేరుతో వర్గాలు విభజన :** సమాజంలో బ్రతికే ప్రతి ఒక్కరికి సామాజిక న్యాయం పాటించాలనే ఉద్దేశ్యం ఉండాల్సిన అవసరం ఉంది. అది కేవలం ఒక కులానికి సంబంధించిన సమూహంగా ఏర్పాటు చేసుకొని ఇతర వర్గాలను రానివ్వకుండా సామాజిక బహి ష్కరణ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏదో ఇచ్చామంటే ఇచ్చాం అన్నట్లు ఒకటి రెండు ఇతరులకు ఇచ్చి మిగతాదంతా ఒకే వర్గం లీడ్ చేయడం అనేది సామాజిక న్యాయం అనిపిం చుకోదు. భూమి, గాలి, నీరు, అగ్ని, ఆకాశం అనేవి ప్రతి జీవరాశికి సంబంధించినవి. అలాంటి వాటి పేర్లు పెట్టుకొని ఒక కులం మాత్రం అందులో రాజ్యం ఏలాలి అనుకోవడం అన్ని నిబ ంధనలు అతిక్రమించడంపై నేటి ప్రభుత్వం చర్యలకు పూనుకోవాలి. హైడ్రాను ఖమ్మంలో ప్రవేశ పెట్టి ఈ అక్రమ కట్టడాలను కూల్చి ప్రజలకు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

## శ్రీ హేమాచలుడిని దర్శించుకున్న మంత్రి సీతక్క



**మంగపేట జనవరి 16 (జనంసాక్షి):** తెలంగాణలోని రెండవ యాదగిరిగుట్టగా ప్రసిద్ధిగాంచిన స్వయంభు శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్న రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మాత్యులు దనసరి అనసూయ సీతక్క . ముందుగా ఆలయ సాంప్రదాయ ప్రకారం దేవస్థాన ఆలయ ఈవో రెవెల్లి మహేష్ అర్చక సిబ్బందితో కలిసి సన్నాయి డోలు వాయిద్యాలతో పూర్ణకుంభశీతో స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు మంత్రి సీతక్కకు శాలువతో సన్మానం చేసి గోత్రనామాలతో అర్చన చేసి స్వామి వారి చరిత్ర ను వివరించి స్వామివారి తీర్థ ప్రసాదాలను మంత్రి వర్యులు సీతక్కకు అందజేశారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ ములుగు జిల్లా మంగపేట మండలం మల్లూరు గ్రామంలో స్వయంభుగా వెలసిన లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం ఎంతో ప్రత్యేకమైనది రాష్ట్ర ప్రభుత్వం చే స్వామివారి దేవస్థాన అభివృద్ధికి డెవలప్మెంట్ కి అన్ని విధాల అభివృద్ధి చేస్తానని తెలిపారు. అనంతరం మల్లూరు గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించగా ముగ్గులలో పోటీలో మొదటి బహుమతి ఎర్రంగారి భార్గవి 5వేల , రెండవ బహుమతి పూజారి దివ్య 3 వేలు, మూడవ బహుమతి 2 వేలు, గరికపాటి వాణికి నాల్గవ బహుమతి నళిని బహుమతి లను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి , స్త్రీ శిశు సంక్షేమ శాఖ మాత్యులు సీతక్క అందజేశారు.

కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడకుల అశోక్ , ఆలయ దేవస్థాన ఈవో మహేష్, రాష్ట్ర పంచా యతీరాజ్ శాఖ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మైల జయరామ్ రెడ్డి, దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్ ఎర్రంగారి సురేష్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్టుపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా, నియోజకవర్గ, బ్లాక్ కాంగ్రెస్, గ్రామనాయకులు పాల్గొన్నారు.

# సంక్రాంతి సెలవుల ముగింపు

- తిరుగు ప్రయాణాలకు సన్నాహాలు
- ట్రాఫిక్ జామ్ లేకుండా వాహనాల మళ్లింపు



**నల్లగొండ, జనవరి 16 (జనంసాక్షి) :** సంక్రాంతి సంబురాల ముగింపుతో పల్లెలకు వెళ్లిన వారు ఇళ్లకు చేరే సమయం ఆసన్నమైంది. శని, ఆదివారాల్లో నగరాలకు బయలుదేరనున్నారు. ఈ క్రమంలో రోడ్లు జామ్ కాకుండా, ట్రాఫిక్ చిక్కులు ఏర్పడకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. సొంతూళ్లకు వెళ్లిన ప్రజలు మళ్లీ పట్నం బాట పట్టనున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ - విజయవాడ హైవేపై రద్దీని తగ్గించేందుకు నల్గొండ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై చిట్యాల, పెద్ద కాపర్తి వద్ద ఫ్లైఓవర్ నిర్మాణ పనులు జరుగుతుండటతంతో ట్రాఫిక్ జామ్ అయ్యే అవకాశం ఉన్నందున దారి మళ్లింపు చర్యలు చేపట్టినట్లు నల్గొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. ప్రయాణికులు, వాహనదారులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని పోలీసులకు సహకరించాలని కోరారు. దారి మళ్లింపు వివరాలు ఇలావున్నాయి. గుంటూరు నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలను గుంటూరు, మిర్యాలగూడ, హాలియా, కొండమల్లేపల్లి, చింతపల్లి, మాల్ మీదుగా హైదరాబాద్‌కు మళ్లిస్తున్నారు. మాచర్ల నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలలను మాచర్ల, నాగార్జునసాగర్, పెద్దవూర, కొండపల్లేపల్లి, చింతపల్లి-మాల్ మీదుగా హైదరాబాద్ మళ్లిస్తారు. నల్లగొండ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను నల్లగొండ, మర్రిగూడ బై పాస్ -మునుగోడు , నారాయణపూర్- చౌటుప్పల్ (ఎన్. హెచ్ 65)మీదుగా హైదరాబాద్ తరలిస్తారు. విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే భారీ వాహనాలను కోదాడ- హుజూర్‌నగర్-మిర్యాలగూడ-హాలియా-చింత పల్లి- మాల్ మీదుగా హైదరాబాద్ మళ్లించారు. ఎన్. హెచ్ 65 విజయవాడ -హైదరాబాద్ రహదారి పై చిట్యాల, పెద్దకాపర్తిలో ఫ్లై ఓవర్ నిర్మాణాలు జరుగుతున్నందున ట్రాఫిక్ జామ్ అయిన పక్షంలో చిట్యాల నుంచి భువనగిరి గుండా హైద్రాబాద్ మళ్లించడం జరుగుతుంది. ఈ మార్గాల ద్వారా వెళ్లడం వల్ల ప్రధాన రహదారి విజయవాడ, హైద్రాబాద్ పై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గి, ప్రయాణికులు గమ్యస్థానాలకు త్వరగా చేరుకోవచ్చని పోలీసులు తెలిపారు.

# వేములవాడ అభివృద్ధికి శ్రీకారం

- నిధులు కేటాయించి పనులు ప్రారంభం
- విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి రాజన్న ఆలయం సందర్శన
- గత కెసిఆర్ ప్రభుత్వం వేములవాడను విస్మరించింది
- రాజన్న ఆలయ సందర్శనలో మంత్రి సీతక్క




**వేములవాడ, జనవరి16 (జనంసాక్షి) :** వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. రాజన్న అనుబంధ భీమేశ్వర ఆలయంలో స్వామి వారిని మంత్రి శుక్రవారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి మీడియాతో మంత్రి మాట్లాడారు. వేములవాడలో భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ఆలయాల అభివృద్ధి.. భావోద్వేగాలు, ఆచారాలతో ముడిపడి ఉంది. ఈనెల 18న మేడారంలో క్యాబినెట్ భేటీ జరుగుతుంది. 19న మేడారం ఆలయాన్ని సీఎం పునఃప్రారంభిస్తారు. పుష్కరాల దృష్ట్యా గోదావరి పరివాహక ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని సీతక్క తెలిపారు. కేసీఆర్ హయాంలో వేములవాడ రాజన్న ఆలయాన్ని పట్టించుకోలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఆలయాన్ని ఎంతగానో అభివృద్ధి చేస్తోందని వ్యాఖ్యానించారామె. వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ జంక్షన్ అభివృద్ధికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆమె.. బీఆర్‌ఎస్ హయాంలో వేములవాడ రాజన్న ఆలయాన్ని ఎందుకు అభివృద్ధి చేయలేదని ప్రశ్నించారు. మేడారం సమ్మక్క - సారక్క, వేములవాడ ఆలయాల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ఏకకాలంలోనే నిధులు కేటాయించారని ప్రస్తావించారు మంత్రి. సమ్మక్క - సారలమ్మ చరిత్ర, ప్రత్యేకతను శిలలపై రాయిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో రాజన్నను దర్శించుకుంటే నష్టం అంటూ దుష్ప్రచారాలు చేశారని అన్నారు. వేములవాడ రాజన్నను ఎంతోమంది భక్తులు తమ ఇంటి ఇలవేల్పుగా కొలుస్తారని తెలిపారు సీతక్క. ప్రస్తుతం.. వేములవాడకు భారీగా భక్తులు తరలివచ్చి రాజన్నకు మొక్కులు సమర్పిస్తుంటారని పేర్కొన్నారు. రాజన్నపై నమ్మకంతోనే ఇంతమంది భక్తులు ఆలయానికి వస్తున్నారని వెల్లడించారు. కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారంగా స్వామివారిని భక్తులు కొలుస్తుంటారని తెలిపారు. తెలంగాణ సార్వత్రిక ఎన్నికల ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తాను వేములవాడ రాజన్నను దర్శించుకున్నామని గుర్తుచేశారు. అలాగే, మేడారం సమ్మక్క - సారక్క అమ్మవార్ల నుంచి పాదయాత్ర ప్రారంభించామని తెలిపారు. ఏ దేవాలయాల ప్రత్యేకత వాటికి ఉంటుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు.



# జైపాల్ రెడ్డికి సిఎం రేవంత్ నివాళి

**హైదరాబాద్, జనవరి16 (జనంసాక్షి) :** దివంగత మాజీ కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి 84వ జయంతి సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి తదితరులు ఘనంగా నివాళి అర్పించారు. నెక్లెస్ రోడ్ లోని జైపాల్ సమాధి స్ఫూర్తి స్థల్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. రాష్ట్రానికి, దేశానికి జైపాల్ రెడ్డి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణా రావు, పొన్నం ప్రభాకర్, మాజీమంత్రి చిన్నా రెడ్డి, పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

# ముంబై కార్పోరేషన్లో అరుణ్ గావ్లీకి ఎదురుగాలి

- గావ్లీ కూతుర్లు ఇద్దరూ ఓటమి

**ముంబై, జనవరి16 (జనంసాక్షి) :** మహారాష్ట్ర మున్సిపల్ పోల్స్‌లో ఆసక్తికర ఫలితాలు వెలువడుతున్నాయి. ముంబైలో ఒకప్పుడు పేరుగాంచిన గ్యాంగ్‌స్టర్, మాజీ ఎమ్మెల్యే అరుణ్ గావ్లీ కుమార్తెలైన గీత గావ్లీ, యోగిత గావ్లీ ఈ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. తమ తండ్రి గావ్లి స్థాపించిన అఖిల్ భారతీయ సేన తరఫున ముంబైలోని బైకుల్లా ఏరియా నుంచి ఈ ఇద్దరూ పోటీ చేశారు. బృహాన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ నుంచి మూడుసార్లు కార్పొరేటర్‌గా గీత పనిచేశారు. ఈ ఎన్నికల్లో ఆమె 212వ వార్డు నుంచి పోటీ చేసి సమాజ్‌వాది పార్టీ అభ్యర్థి అమ్రిన్ షెహజాద్ అబ్రహాని చేతిలో ఓటమి పాలయ్యారు. 207వ వార్డు నుంచి యోగిత తొలిసారి పోటీ చేసి బీజేపీ అభ్యర్థి రోహిదాస్ లోఖాండే చేతిలో ఓటమి చవిచూశారు. ముంబైలో 2007 మార్చి 2న శివసేన కార్పొరేటర్ కమలాకర్ జామ్‌సండేకర్ తన నివాసంలో హత్యకు గురైన కేసులో అరుణ్ గావ్లీకి యావజ్జీవ కారాగార శిక్ష పడింది. ఈ కేసులో సుప్రీంకోర్టు బెయిలు మంజూరు చేయడంతో 2025 సెప్టెంబర్‌లో నాగపూర్ జైలు నుంచి ఆయన విడుదలయ్యారు. 1980, 1990 దశకంలో దావూద్ ఇబ్రహీం గ్యాంగ్ డి-కంపెనీకి సమాంతరంగా ఆయన క్రైమ్ సిండికేట్ నడిపారు.

# పోచారం ఇంకా బిఆర్ఎస్‌లోనే ఉన్నాడని అంటారా?

- స్పీకర్ తీరు చట్టసభలను అగౌరవ పరిచేలా ఉంది
- మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆగ్రహం



**నిజామాబాద్, జనవరి16 (జనంసాక్షి) :** చట్టసభల గౌరవాన్ని హక్కులను రక్షించాల్సిన అసెంబ్లీ స్పీకర్ భక్షకుడుగా మారడం శోచనీయమని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు , మాజీ ఎమ్మెల్యే, ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ ఆరోపించారు. స్పీకర్ జడ్జిమెంట్ రాష్ట్ర అసెంబ్లీ చరిత్రలో చీకటి రోజుగా అభివర్ణించారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి ఇంకా బీఆర్‌ఎస్ పార్టీలోనే ఉన్నారని, పార్టీ మారినట్లు ఎలాంటి ఆధారాలు లేవని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీర్పునివ్వడం రాష్ట్ర చట్టసభల గౌరవాన్ని దిగజార్చిందని అన్నారు. నిజామాబాద్ జిల్లా రాజకీయాల్లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు ప్రజాస్వామ్య వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీసే విధంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి పార్టీ ఫిరాయింపు చేసినప్పటికీ, అనర్హత వేటు వేయకపోవడం రాజ్యాంగ విరుద్ధమైన చర్యగా మారిందని అభిప్రాయ పడ్డారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం స్పష్టంగా ఉన్నా, దాన్ని అమలు చేయడంలో స్పీకర్ నిర్లక్ష్యం, ప్రజాస్వామ్యంపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీస్తోందన్నారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి అవలంబిస్తున్న ఈ అనైతిక రాజకీయ విధానం ప్రజలు ఇచ్చిన తీర్పుకు విరుద్ధమని దుయ్యబట్టారు. బిఆర్‌ఎస్ బీ ఫామ్ కింద గెలిచి, మంత్రిగా ఉన్నత పదవులు అనుభవించి, కాంగ్రెస్ పార్టీ లోకి ఫిరాయించిన పోచారం తాను బీఆర్‌ఎస్ కొనసాగుతున్నారని చెప్పు కోవడం సిగ్గుచేటని విమర్శించారు. నిజంగా బిఆర్‌ఎస్ పార్టీలోనే ఉంటే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలకు తన చిత్తశుద్ధిని చాటాలని డిమాండ్ చేశారు. జీవిత చరమాంకంలో ఉన్న విలువ తీసుకోవద్దని పోచారానికి హితవు పలికారు. మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు కేటాయించకుండా ముందుకెళ్లడం ద్వారా కాంగ్రెస్ పార్టీ బీసీ లను మరోసారి వంచించిందని బాజిరెడ్డి గోవర్ధన్ స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను తగ్గించడం మరో ప్రజావ్యతిరేక నిర్ణయంగా మారిందని ఆరోపించారు. బీసీ వర్గాల హక్కులను కాలరాసేలా తీసుకున్న ఈ నిర్ణయం సామాజిక న్యాయ సూత్రాలకు పూర్తిగా విరుద్ధమని స్పష్టం చేశారు. బీసీ వర్గాలు రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న తరుణంలో, వారి ప్రాతినిధ్యాన్ని తగ్గించే ప్రయత్నాలు ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పుగా మారతాయని, కాంగ్రెస్ ప్రభుత్వ బీసీ వ్యతిరేక విధానానికి బీసీలు రాబోయే ఎన్నికల్లో గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

# ఇందూరును నిజామాబాద్‌గా మార్చారు

- మళ్లీ తిరిగి ఇందూరుగా మార్చి తీరుతాం
- ఇక్కడ కాషాయ జెండా ఎగరేసి తీర్మానిస్తాం
- రాముడికి బిజెపి సభ్యత్వం ఉందంటూ ఎంపి అరవింద్ వ్యాఖ్య



**నిజామాబాద్, జనవరి16 (జనంసాక్షి) :** నిజామాబాద్‌ని ఇందూర్‌గా పేర్కొన్న ఎంపీ ధర్మపురి అరవింద్ ఆ పేరు ఎలా వచ్చిందో చారిత్రిక ఆధారాలు ఉన్నాయన్నారు. మీడియాలో మాట్లాడిన ఎంపీ ధర్మపురి అరవింద్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నిజాం ఒక హంతకుడు.. నిజామాబాద్‌కి ఆయన పేరు ఎందుకు పెట్టుకుంటారన్నారు. ఇందూర్‌గా పేరు మార్చి ఆ తీర్మానాన్ని ఏబీవీపీ నుంచి వచ్చిన రేవంత్‌రెడ్డికి పంపిస్తామన్నారు. శ్రీరాముడికి బీజేపీ మెంబర్ షిప్ ఉందని అనుమానం ఉంటే వెళ్లి చూసుకోవాలని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్‌కు తెలిపారు. ముస్లిం అంటే కాంగ్రెస్ అంటున్నారు.. మీ పార్టీకి సున్తీ అయిందా పోయి చూసుకోవాలని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పహల్గాంలో హిందువులా? ముస్లింలా? అని చూసి కాల్చి చంపారని గుర్తు చేశారు. శ్రీరాముడికి బీజేపీ మెంబర్ షిప్ ఉందని అన్నారు. కొంత మంది హిందువుల్లో చెడ పుట్టారన్నారు. తెలంగాణ మొత్తం కాషాయమయం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ ఎక్కడుందో కవితను అడిగితే చెబుతుందన్నారు.. రేపు సిరిసిల్లలో కూడా చూపిస్తామన్నారు. ఇందూర్‌కి దమ్ముంటే రా అని కేటీఆర్‌కి సవాల్ విసిరారు. చెన్నారెడ్డి సీఎంగా రాజీనామా చేసే వరకు రాష్ట్రంలో మత ఘర్షణలు జరిగాయని ఎంపీ అరవింద్ తెలిపారు. గొడవలకు కారణం కాంగ్రెస్.. అప్పట్లో సత్తయ్య ఏసీపీని చంపితే ఆ నిందితులను బయటకు తెచ్చింది మజ్లిస్.. తిన్న తిండి అరగక హిందూ దేవాలయాల మీద పడుతున్నారు.. దీనికి కారణం రేవంత్ రెడ్డి.. ఇచ్చేది దొంగ వాగ్దానాలు.. హిందూ దేవుళ్ళ మీద ఓట్లు.. గులాంలుగా మారి పోయి హిందువులను తాకట్టు పెడుతున్నారు.. నూటికి నూరు శాతం ఇందూర్ కార్పొరేషన్‌పై బీజేపీ జెండా ఎగురవేస్తాం.. నిజామాబాద్ పేరును ఇందూర్‌గా మారుస్తాం? తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తాం.. నిజాంను ఒకే సారి నేను గాడిద అని ఒక్కసారి అంటే దానిపై రాద్ధాంతం చేస్తున్నారు.. నిజాం చరిత్రలో దుర్మార్గమైన రాజు గానే మిగిలి పోతారు.. ఆయన పేరు చెబితే హిందువులకు గుర్తుకు వచ్చేది అయన చేసిన మారణకాండనే.. ముస్లింలకు అవాస్ యోజన కింద ఇల్లు, ఫ్రీ రేషన్, ఫ్రీ వాక్సినేషన్ మోడీ ఇస్తున్నారు.. ముస్లిం దేశాలకు కూడా వ్యాక్సిన్ పంపించారు.. మీ పిల్లలకు విద్యా, వైద్యం ఇస్తుంది.. నిజాం అంత వెనుకోసుకొస్తున్నా.. రేవంత్ రెడ్డి ఏం చేశారని ఓట్లు వేస్తున్నారు.. ఇన్ని చేసినా మోడీకి ఎందుకు వేయడం లేదు.. ఇదేనా మీ ఇమాందారీ..అని ఎంపీ వ్యాఖ్యానించారు.

# మద్యం సేవిస్తూ అన్నదమ్ముల గొడవ

- పై అంతస్తు నుంచి తోసి అన్నను చంపిన తమ్ముడు

**హైదరాబాద్, జనవరి16 (జనంసాక్షి) :** పండగ పూట హైదరాబాద్ నాచారంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. మద్యం సేవించే క్రమంలో జరిగిన చిన్న గొడవ అన్నదమ్ముల మధ్య ఘర్షణకు దారి తీసింది. మద్యం గ్లాస్ విషయంలో మొదలైన వాగ్వాదం తీవ్రస్థాయికి చేరడంతో తమ్ముడు అన్నపై దాడికి పాల్పడ్డాడు. అంతటితో ఆగకుండా కోపోద్రిక్తుడైన తమ్ముడు అన్నను మూడో అంతస్తుపై నుంచి తోసేయడంతో అన్నకు తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలిస్తుండగా.. మర్గమధ్యంలో మృతి చెందారు. సమాచారం అందుకున్న నాచారం పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడు స్టీఫెర్డ్ రోహన్ సాయర్స్ (30), నిందితుడు లేనర్డ్ లయనెల్ సాయర్స్ (28)గా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

# కిటకిటలాడిన వీరభద్రస్వామి సన్నిధి





- రెండు రోజుల్లో నాలుగు లక్షలు మంది భక్తుల మొక్కులు
- ప్రత్యేక ఆకర్షణగా ఎడ్లబండ్ల రథాలు.. మేకల బండ్లు

**భీమదేవరపల్లి, జనవరి 16జనం సాక్షి) :** కొత్తకొండ జాతర..భక్త జన జాతరగా మారింది. వీరభద్రుడి నామస్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. కుటుంబ సమేతంగా తరలివచ్చి స్వామివారికి కోరమీసాలు, గుమ్మడికాయలు చెల్లించి మొక్కులు చెల్లించుకున్నారు. బుధవారం భోగి, గురువారం మకర సంక్రాంతి, శుక్రవారం కనుమ పండుగల్లో లక్షలాది మంది భక్తులు హాజరైనట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. వరంగల్, సిద్ధిపేట, కరీంనగర్, జనగాం, నల్గొండ, జగిత్యాల, ఆదిలాబాద్, నిజామాబాద్, జయశంకర్‌భూపాలపల్లి జిల్లాల భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. కరీంనగర్, వరంగల్, సిద్ధిపేట, హుజూరాబాద్, హుస్నాబాద్ ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులు ప్రత్యేకంగా నడపడం, ప్రైవేట్ వాహనాలు, ట్రాక్టర్లు, ఎడ్లబండ్లతో లక్షలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. గురువారం సంక్రాంతి పండుగ సందర్భంగా బండ్లు తిరిగాయి.

## మహన్యాసపూర్వక శత రుద్రాభిషేకం

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఆలయంలో గురువారం ప్రాతఃకాలంలో అర్చకులు మహాన్యాసపూర్వక శత రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా 108 లీటర్ల ఆవు పాలతో స్వామి వారికి మహాభిషేకం నిర్వహించారు. అనంతరం నవరసాభిషేకం, రుద్రహెూమం కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో మహాలింగార్చన, జ్యోతిలింగార్చనను యాగశాలలో నిర్వహించారు. ఆలయంలో సాయంత్రం 365 దీపాలతో జ్యోతిర్లింగార్చనను నిర్వహించారు. ఉత్తరాయనం పుణ్యకాలంలో స్వామి వారిని, జ్యోతిర్లింగార్చన చూస్తే ఆయురారోగ్యాలతో పాటు శరీర బాధలు తొలగి సుఖసంతోషాలు, భోగభాగ్యాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. శివునికి ఇష్టమైన మహాన్యాసపూర్వక శతరుద్రాభిషేకాన్ని దర్శించుకునేందుకు భక్తులు పోటీ పడ్డారు.

## ప్రత్యేక ఆకర్షణగా ఎడ్లబండ్ల రథాలు

జాతరలో కొత్తపల్లి ఎడ్లబండ్ల రథాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కొత్తపల్లి గ్రామం నుంచి 69 ఎడ్లబండ్లను అందమైన రథాలుగా తీర్చిదిద్ది ఆలయం చుట్టూ తిప్పారు. వీటితో పాటు వేలాది ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు స్వామి వారి ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేశాయి. అలాగే వేలేరు గ్రామం నుంచి వచ్చిన మేకల బండ్లు పలువుర్ని ఆకట్టుకున్నాయి. ఏకేవీఆర్ కళాశాలకు చెందిన 30మంది ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు జాతరలో విశిష్టమైన సేవలందించారు. వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్, ఆదేశాల మేరకు డిసిపి కవిత ఏసీపీ ప్రశాంత్ రేడ్డి, సీఐ పులి రమేష్, ఎస్ఐలు రాజు, దివ్య, ప్రవీణ్ కుమార్, ఆధ్వర్యంలో సుమారు 400 మంది పోలీసులు జాతరలో బందోబస్తు ఏర్పాటు చేశారు. దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, జాతర చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ రామాల సునీత ఆలయ ఈవో కిషన్ రావు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## ఆలయ పరిసరాల్లో శానిటైజేషన్

కొత్తకొండ జాతర సజావుగా సాగింది. కరోనా నేపథ్యంలో ఆలయంలో శానిటైజేషన్ నిర్వహించారు. సుమారు140 మంది గ్రామపంచాయతీ కార్మికుల సిబ్బందితో ఆలయం చుట్టూ, పరిసరాల్లో చెత్త చెదారం లేకుండా పారిశుధ్య కార్మికులు 24గంటలు చెత్తను తొలగించారు. ఎంపీడీవో వీరేశం, ఎంపీవో నాగరాజు, ఏఈ లతో పాటు సిబ్బంది పనిచేశారు. 24గంటలు మంచినీరు, విద్యుత్ సౌకర్యం కల్పించారు.

# బాలుడికి పురాతన నాణేలు లభ్యం

- రంగంలోకి దిగి తవ్వకాలు చేపట్టిన పురావస్తు శాఖ

**బెంగళూరు, జనవరి 16 (జనంసాక్షి) :** కర్ణాటకలోని గడగ్ జిల్లా లక్కుండి గ్రామంలో ఇటీవల ఓ బాలుడికి పురాతన కాలం నాటి బంగారు నాణెలిలు లభించడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్త మైంది. గ్రామంలోని కోటె వీరభద్రేశ్వర స్వామి ఆలయ పరిసరాల్లో తవ్వకాలు జరిపేందుకు పురావస్తు శాఖ రంగంలోకి దిగింది. రాష్ట్ర పర్యాటక శాఖ, లక్కుండి వారసత్వ పరిరక్షణ సంస్థ, జిల్లా అధికారుల సారథ్యంలో శుక్రవారం తవ్వకాలు ప్రారంభమయ్యాయి. మధ్య యుగాల నాటి నుంచీ అనేక రాజవంశాలు పాలించిన లక్కుండి చరిత్ర ఎంతో గొప్పదని చరిత్రకారులు చెబుతు న్నారు. ఈ ప్రాంతాన్ని చాళుక్యులు, రాష్ట్రకూటులు, విజయనగర రాజులు, ఇతర వంశాల పాలకులు అనేక మంది పరిపాలించారు. అప్పట్లో బంగారు నాణెలిల ముద్రణకు లక్కుండి కేంద్రంగా ఉండేదని చరిత్రకారులు చెబుతున్నారు.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370